మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline
NAMASTE TELANGANA

సోమవారం MONDAY 29.4.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 325 ‖ వెల (Price) రూ.6.50

సూర్యోదయం: 5-51, సూర్యాస్తమయం: 6-36. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: పంచమి ఉదయం 7-57 వరకు, తదుపరి షష్ఠి. నక్షత్రం: పూర్వాషాఢ తెల్లవారుజామున 4-42 వరకు. వర్జ్యం: పగలు 2-23 నుంచి పగలు 3-58 వరకు. రాహుకాలం: ఉదయం 7-26 నుంచి ఉదయం 9-01 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-37 నుంచి పగలు 1-28 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 3-10 నుంచి సాయంత్రం 4-01 వరకు. అమృతకాలం: రాత్రి 11-54 నుంచి రాత్రి 1-30 వరకు.





జన హోరుగల్లు

మన గోదావరిని మోదీ ఎత్కపోతడట!

మన ప్రాణహిత నీళ్లు తమిళనాడుకు..
సాగర్ ప్రాజెక్టు కేఆర్ఎంబీకి ఇచ్చిండ్రు
రేవంత్ కుయ్ అనడు.. కయ్ అనడు

- కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ గుజరాత్‌కు ఎట్లపోయింది?
- మోదీకి 200 సీట్లు మించవు.. బీఆర్ఎస్, బీజేపీ మధ్యే ఫైట్
- రేవంత్‌రెడ్డికి తెలంగాణ చరిత్ర తెల్వదు.. భూగోళం తెల్వదు
- ఏరికోరి తెచ్చుకుంటే ఎగిరెగిరి తన్నినట్టుంది కాంగ్రెస్ పాలన
- చేసిన మోసానికి 3 నెలల్లో కడియం రాజకీయ సమాధే
- ఘన్‌పూర్‌లో మళ్లీ ఎన్నికలు.. రాజయ్యే ఎమ్మెల్యే: కేసీఆర్

› 2

- తెలంగాణ ఉద్యమం ఇంకా మిగిలే ఉన్నది

ఉద్యమం ఇంకా అయిపోలే. తెలంగాణ పునర్నిర్మాణం ఇంకా మిగిలే ఉన్నది. రాష్ట్రాన్ని ఇంకా డెవలప్ చేసుకోవాలె. అభివృద్ధి అంటే ఎట్ల ఉంటదో వరంగల్‌లో 24 అంతస్థుల్లో ఆకాశమంత ఎత్తున కనబడుతున్న మల్టీస్పెషాలిటీ దవాఖాననే నిదర్శనం. అటువంటి ప్రగతిలో ముందుకు పోవాలె. బీఆర్ఎస్ గెలవాలే. 13వ తేదీ వరకు ఉత్సాహాన్ని కొనసాగించి పోరుగల్లు చైతన్యాన్ని చాటాలె.

-బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఓరుగల్లు జన హారతి

అడుగడుగునా కేసీఆర్‌కు జన నీరాజనం
బస్సుయాత్రలో కలిసి నడిచిన జనం › 3
'సీఎం కేసీఆర్' అంటూ నినాద హోరు

ఆ పోలీస్ అభ్యర్థులు

అన్‌ఫిట్?

కండ్లతో చూసి పనికిరారని రాసిచ్చిన వైద్యులు
రీ చెకప్‌కు కొందరిని అనుమతించని బోర్డు
కొన్ని జిల్లాలవారికి మూడో చెకప్‌కూ అనుమతి?
సీఎం సొంత జిల్లాలోనే ఎక్కువ మందికి నష్టం
కానిస్టేబుల్‌గా ఎంపికైనా తీరని నిరాశ › 3

- ఇది మిర్యాలగూడలో..



చొక్కా వేసుకుని ఉన్న ఓ యువతి సెక్యూరిటీని ఛేదించుకుని కేసీఆర్ బస్సు వద్దకు పరిగెత్తుకొచ్చింది. 'కేసీఆర్ సార్..' అని పిలుస్తూ అరచేతిని కిటికీ అద్దంపై ఉంచింది. అవతలివైపు కేసీఆర్ కూడా అద్దంపై అరచేతిని ఉంచారు. కరచాలనం చేసేదాక వదలని అభిమాని అప్యాయత అది.

- ఇది నాగర్‌కర్నూల్‌లో..



కేసీఆర్ నాగర్‌కర్నూల్ రోడ్‌షోలో కనిపించింది దృశ్యం. కేసీఆర్ ప్రసంగం వినేందుకు ఓ రైతు ఇలా చెట్టెక్కాడు. కేసీఆర్ రాక కోసం రాష్ట్ర రైతులు ఎంతో ఎదురు చూస్తున్నారనేందుకు, ఆయన ప్రతి మాటను చాలా ఆసక్తిగా వింటున్నారనేందుకు ఇదో నిదర్శనం.

- ఇది జనగామలో..



జనగామ మార్కెట్లో ఓ మహిళా రైతును యూట్యూబ్ విలేకరి పలకరించాడు. వడ్లకొనుగోళ్ల కోసం ఎదురుచూసి విసిగిపోయిన ఆమె ఒక్కసారిగా విరుచుకుపడింది. కాంగ్రెస్ పాలనపై సగటు రైతు ఆవేదనను కడుపుమండిన భాషలో వెళ్లగక్కింది.

- ఇది గజ్వేల్‌లో..



గజ్వేల్ కూరగాయల మార్కెట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కరపత్రం తీసుకుంటూ ఆవేదన వ్యక్తంచేసింది ఐలవ్వ. తెల్వక కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయినమని వాపోయింది. ఎన్నికలు మళ్లాపెడితే కేసీఆరే గెలుస్తడని చెప్పింది.

కార్.. టాప్ గేర్!

- అనూహ్యంగా మారిన తెలంగాణ రాజకీయం
- కేసీఆర్ చతురతతో రాష్ట్రంలో మారిన సీన్
- మళ్లీ నంబర్-1గా దూసుకొచ్చిన బీఆర్ఎస్
- బీఆర్ఎస్ వర్సెస్‌గా మారిన ఎన్నికల క్షేత్రం
- వ్యూహాత్మక తప్పిదాలతో కాంగ్రెస్ చతికిల
- గ్యారెంటీలే గుదిబండలు.. శాపంగా కరువు
- అభ్యర్థుల ఎంపికలో నాయకత్వం తప్పిదాలు
- పలుచోట్ల మూడో స్థానానికి హస్తం పరిమితం
- బీఆర్ఎస్ వైపు మైనార్టీలు, దళితుల మొగ్గు
- ఎటూగాని పరిస్థితుల్లో బీజేపీ నాయకులు

నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

హైదరాబాద్, ఏప్రిల్ 28: ఒక ముసలి రైతు కింద పడతానన్న భయమైనా లేకుండా ఎందుకు చెట్టెక్కి మరీ కేసీఆర్‌ను చూడాలనుకుంటున్నడు? బస్సు కింద పడతానేమో అన్న జంకు లేకుండా ఒక మహిళ ఎందుకు కేసీఆర్ కర స్పర్శ కోసం గొంతు చినిగిపోయేలా అరుస్తూ వెంట బడింది? అమలైన, అమలు కాని హామీలను కూడా తప్పుబడుతూ మరో మహిళ ఎందుకు కాంగ్రెస్ పరిపాలనను, సీఎం రేవంత్‌రెడ్డిని బూతులు తిడుతూ విమర్శిస్తున్నది? ఇప్పుడు ఎన్నికలు పెడితే కేసీఆరే వస్తడు అని ఐలవ్వ ఎందుకంటున్నది? రాష్ట్రంలో మారుతున్న రాజకీయానికి ఇవి నిదర్శనాలా? వాతావరణంలో వస్తున్న 'మార్పు'నకు ఇవి సూచికలా? రేపటి ఫలితాలకు ఇవి ఇవాళ్టి సంకేతాలా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ పరిశీలకులు. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి, అంతకు ముందు, తర్వాత జరిగిన దుష్ప్రచారం నేపథ్యంగా లోక్‌సభ ఎన్నికల ముంగిట నిలిచిన బీఆర్ఎస్‌లో కొంత నైరాశ్యం కనిపించింది. పార్టీ పోరాట పటిమ, విజయావకాశాలపై రకరకాల అనుమానాలు అంచనాలు వ్యక్తమయ్యాయి. క్యాడర్ సైతం కొంత నిస్తేజానికి గురైంది. కానీ గత వారం రోజులుగా జరిగిన పరిణామాలు ఈ సందేహాలను పటాపంచలు చేయడమే కాదు; బీఆర్ఎస్‌ను రాజకీయంగా మళ్లీ అగ్రస్థానంలోకి తెచ్చి నిలబెట్టాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా ఒక ప్రముఖ టీవీ చానల్‌కు మాజీ సీఎం కేసీఆర్ ఇంటర్వ్యూ › 8వ పేజీలో

తగ్గిన పోలింగ్
కమలం కలవరం

- 2019 కంటే తగ్గిన పోలింగ్
- తొలిదశలో 4% మలిదశలో 6%
- బీజేపీ రాష్ట్రాల్లో ఇంకా తక్కువ
- మధురలోనూ అదే ట్రెండ్
- సీట్లు తగ్గుతాయేమోనని భయం
- ఈ 88 సీట్లలో 63 బీజేపీవే

గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం తగ్గిన పోలింగ్

రాష్ట్రం	స్థానాలు	2019	ఇప్పుడు
ఉత్తరప్రదేశ్	8	62%	54.85%
మహారాష్ట్ర	8	63%	59.6%
బీహార్	5	63%	57%
రాజస్థాన్	13	68%	64.0%

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల్లో తొలి దశ తేడా కొట్టడంతో మతపరమైన అంశాలను తెర మీదకు తెచ్చిన బీజేపీకి రెండో దశలోనూ అడియాసలే మిగిలాయా? పోలింగ్ శాతం తగ్గడం, ప్రత్యేకించి బీజేపీకి పట్టున్న రాష్ట్రాల్లో మరింత తగ్గడం కమలనాథులను కలవరపాటుకు గురి చేస్తున్నదా? 2019లో గెలిచిన సీట్లను నిలబెట్టుకోవడం కూడా ఆ పార్టీకి కష్టమేనా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. రెండో దశలో భాగంగా 13 రాష్ట్రాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరిగింది. ఈ 88 స్థానాల్లో గత ఎన్నికల్లో 63 చోట్ల ఎన్డీయే గెలిచింది. ఓటింగ్ సరళిని బట్టి చూస్తే ఈసారి బీజేపీకి ఈ స్థానాల్లో భారీగా కోత పడే అవకాశం ఉందంటున్నారు విశ్లేషకులు. 370 సీట్లు సొంతంగా సాధిస్తామని చెప్తున్న బీజేపీకి రెండో దశ మింగుడు పడకుండా › 7వ పేజీలో



హైదరాబాద్‌పై యూటీ కుట్ర!

ఉమ్మడి రాజధాని గడువు తీరాక అమలు
పార్లమెంట్‌లో బీఆర్ఎస్ లేకుంటే తెలంగాణకు రాజధాని లేకుండా చేస్తరు
నదుల అనుసంధానం పేరిట ఎండబెడుతరు
బడేభాయ్, చోటాభాయ్‌తో రాష్ట్రానికి మోసం
పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేకుండా చేస్తరు: కేటీఆర్ › 5



› 5

రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం

తెలంగాణలో మా పార్టీని అడ్డుకున్నది కేసీఆరే
మమ్మల్ని ఆపడం కాంగ్రెస్‌తో అయ్యేపని కాదు
నిజామాబాద్ అభ్యర్థి అర్వింద్ వ్యాఖ్యలు



హనుమకొండ చౌరస్తాలో రోడ్ షోకు అశేషంగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులకు అభివాదం చేస్తున్న పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్

మన గోదావరిని మోదీ ఎత్కపోతడట!

- రేవంత్ కుయ్యిలేదు కయ్యిలేదు
- ఎందుకెయ్యాలి వీళ్లకి ఓట్లు?
- బీజేపీ మళ్లీ అధికారంలోకి రాదు
- ఆ పార్టీకి 280 సీట్లు మించి రావు
- హంగ్‌లో బీఆర్ఎస్‌ది కీలకపాత్ర
- రాష్ట్ర ప్రజల తరఫున కొట్లాడేది నేనే
- కడియం రాజకీయ జీవితం సమాధి
- లంచం కోసం అభివృద్ధికి పాతర
- ఉద్యమం ఇంకా మిగిలే ఉంది
- వరంగల్ బస్సుయాత్రలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ''కేంద్రంలోని బీజేపీ గోదావరిని ఎత్తుకుపోతానంటున్నది. చేతగాని సీఎం రేవంత్ రెడ్డి నోరు మూసుకుని కూర్చున్నడు. మరి ఆ రెండు పార్టీలకు ఓటెందుకెయ్యాలె. ఎన్నో హామీలిచ్చి గెలిచిన ఐదునెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. ప్రభుత్వం మెడలు వంచి హామీలను అమలు చేయిస్తాం. తెలంగాణ ప్రజానీకం తరపున కొట్లాడేది బీఆరెస్సే. అది నేనే'' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, వచ్చేది హంగ్ ప్రభుత్వమే కాబట్టి.. ఎక్కువమంది బీఆర్ఎస్ ఎంపీలను గెలిపిస్తే కీలక పాత్ర పోషించే అవకాశముంటుందని వివరించారు. బస్సుయాత్రలో భాగంగా ఐదో రోజు ఆదివారం వరంగల్‌లో నిర్వహించిన రోడ్ షోలో కేసీఆర్ మాట్లాడుతూ కడియం శ్రీహరిపై నిప్పులు చెరిగారు. మూడు నెలల్లో ఆయన రాజకీయ జీవితానికి శాశ్వత సమాధి తప్పదని హెచ్చరించారు.

రాజకీయాల కోసం గోదావరి పణం

కేంద్రంలోని బీజేపీ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదని, 18 లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉంటే ఒక్క పోస్టును కూడా భర్తీ చేయలేదని కేసీఆర్ విమర్శించారు. ''మనకున్నది ఒకే ఒక్క నది. గోదావరి నది మన బతకుదెరువు. కేంద్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ గొంతుకోసి గోదావరిని ఎత్తుకుపోయి తమిళనాడుకు ఇస్తా, కర్ణాటకకు ఇస్తా అని మాట్లాడుతున్నది. ఎన్నికల సమయంలో మోదీ రాష్ట్ర ప్రభుత్వానికి నోటిఫికేషన్ పంపారు. ప్రాణం పోయినా ఇవ్వబోమని రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ పెట్టాలె. మేమున్నప్పుడు అదే చేసినం. చేతగాని రేవంత్ ప్రభుత్వం మాత్రం నోరుమూసుకుని పడున్నది. ఏం మత్లబు ఉంది ఇండ్ల? ఇయ్యాల ఈ ముఖ్యమంత్రేమో కుయ్యి లేదు. కయ్యిలేదు. ఏమనుకోవాలె దీన్ని. ఇంతకుముందే కృష్ణానదిని తీసుకుపోయి కేఆర్ఎంబీకి అప్పగించిండు. ఇయ్యాల గోదావరిని ఎత్తుకుని పోతామంటే మూతి ముడుసుకుని కూర్చున్నడు'' అని రేవంత్‌రెడ్డిపై కేసీఆర్ మండిపడ్డారు.

వరంగల్ తెలంగాణ వైభవ ప్రతీక

తెలంగాణ వైభవానికి ప్రతీక అయిన వరంగల్ మట్టితో, చరిత్రతో తనకు విడదీయరాని బంధముందని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్‌కు మద్దతుగా హనుమకొండలో బస్సు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. 42 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయకుండా కార్నర్ మీటింగ్ వచ్చారంటూ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నాడు ఉద్యమ సమయంలో ఓరుగల్లు పోరుగల్లుగా మారబట్టే తెలంగాణ వచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ కోసం 1969 నుంచి విరామం లేకుండా, రాజీ పడకుండా పోరాడిన కాళోజీ, జయశంకర్‌ను తలచుకుంటే ఉద్వేగం, ఆవేశం వస్తుందని పేర్కొన్నారు. సమైక్య పాలనతో వరంగల్ వెనకబడిందని, అజంజాహీ మిల్లు ఆగమైందని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏండ్లుగా తనతో ఉన్న యువకుడు, విద్యావంతుడు అయిన సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో వరంగల్ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిందని, వరంగల్ నడిబొడ్డున 24 అంతస్థుల్లో మల్టీ సూపర్ స్పెషాలిటీ దవాఖాన కట్టుకున్నామని, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ పెట్టుకున్నామని గుర్తుచేశారు. పరకాలలో మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆధ్వర్యంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెచ్చుకున్నామని పేర్కొన్నారు. ములుగు, భూపాలపల్లి, నర్సంపేట, మహబూబాబాద్, జనగామలో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకున్నామని వివరించారు.

లంచం కోసం అభివృద్ధిని ఆపేశారు

తెలంగాణ వచ్చాక భూముల ధరలు పెరిగితే ఇప్పుడు మొత్తం పడిపోయాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్‌లో రంగంలో వేలాదిమంది రోడ్డున పడ్డారని తెలిపారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఐదు నెలలుగా పర్మిషన్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తాము టీఎస్ బీపాస్‌ను తీసుకొచ్చి అప్లికేషన్ పెట్టిన 21 రోజుల్లోనే పర్మిషన్ ఇచ్చేవాళ్లమని గుర్తు చేశారు. ఈ ముఖ్యమంత్రి, మంత్రి వర్గం మాత్రం బిల్డింగ్‌లు కడితే స్క్వేర్ ఫీట్‌కు ఇంత చొప్పున పార్టీకి లంచమివ్వాలని బిల్డర్లను అడుగుతున్నారని ఆరోపించారు. దీనికోసం మొత్తం అభివృద్ధిని ఆపేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తయిన బిల్డింగ్‌లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కూడా ఇవ్వడం లేదని, రేపో, ఎల్లుండో ఈ బండారమంతా బయటపెడతానని తెలిపారు.

మైనార్టీలకు గురుకులాలు

తమ పదేండ్ల పాలనలో తెలంగాణను లౌకిక రాష్ట్రంగా తీర్చిదిద్దామని కేసీఆర్ తెలిపారు. మైనార్టీల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. మైనార్టీ సంక్షేమం కోసం రూ.12 వేలకోట్లు ఖర్చు చేశామని, మైనార్టీ గురుకులాలను ఏర్పాటుచేశామని, దేశంలోనే తొలిసారి ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇచ్చామని గుర్తుచేశారు. బీజేపీ సర్కారు తన బిడ్డను జైలులో పెట్టిందని, అయినా భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోటీ కొనసాగుతున్నదని, కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీ గెలిచే అవకాశం ఉన్నదని హెచ్చరించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించి, కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



హనుమకొండ చౌరస్తాలో రోడ్ షోలో మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన నమస్కరిస్తున్న వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, రాజయ్య

విద్వేషం నింపడమే బీజేపీ పని

బీజేపీ చాలా ప్రమాదరకమైన పార్టీ అని, విద్వేషం నింపడం, పంచాయితీలు పెట్టుడు తప్ప దానికి మరో పనిలేదని కేసీఆర్ ఆరోపించారు. బీజేపీ ఎజెండాలో ప్రజలకు సుఖాలుండవని పేర్కొన్నారు. ఈ రాష్ట్ర భవిష్యత్తు యువకులదేనని, కాబట్టి వారంతా ఆలోచించి ఈ అంశాలపై బస్తీల్లో, ఊర్లలో చర్చ పెట్టాలని సూచించారు. విదేశాల నుంచి నల్లధనం తెచ్చి ఇంటికి రూ. 15 లక్షలు ఇస్తానని మోదీ పదేండ్ల క్రితం చెప్పారని, ఇప్పటికీ అది అమలు కాలేదని మండిపడ్డారు. కాజీపేటకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని మోదీ తన సొంతరాష్ట్రం గుజరాత్‌కు ఎత్తుకెళ్లారని మండిపడ్డారు.

సీఎంకు తెలంగాణ చరిత్ర తెల్వదు

మన ముఖ్యమంత్రికి తెలంగాణ చరిత్ర తెల్వదు, భూగోళం తెల్వదు. ఇటీవల ఎక్కడో మాట్లాడుతూ కృష్ణానదిని తానే కట్టానని అన్నాడని, ప్రపంచంలో ఎవరైనా నదిని కడతారా? అని ఎద్దేవా చేశారు. వరంగల్‌కు కాళేశ్వరం నీళ్లే రాలేదని అంటున్నాడని, మరి నర్సంపేట భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్, పరకాల, పాలకుర్తి, వర్ధన్నపేటకు ఎక్కడి నుంచి నీళ్లు వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ సాధించుకున్నాక కాళేశ్వరం కడితే వరంగల్‌కు నీళ్లు వచ్చాయని వివరించారు.

> హైదరాబాద్ వంటి నగరాల్లో ఐదు నెలలుగా పర్మిషన్లు ఇవ్వడం లేదు. మేము టీఎస్ బీపాస్‌ను తీసుకొచ్చి అప్లికేషన్ పెట్టిన 21 రోజుల్లోనే పర్మిషన్ ఇచ్చేవాళ్లం. ఈ ముఖ్యమంత్రి, మంత్రివర్గం మాత్రం బిల్డింగ్‌లు కడితే స్క్వేర్ ఫీట్‌కు ఇంత చొప్పున పార్టీకి లంచమివ్వాలని బిల్డర్లను అడుగుతున్నరు.
>
> \- కేసీఆర్

> ఇక్కడొక మనిషికి టికెట్ ఇచ్చినం. ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చినం. ఎందుకు మారిపోయిండు పార్టీ. కడియం శ్రీహరి మోసం చేసి తన రాజకీయ జీవితాన్ని శాశ్వతంగా సమాధి చేసుకున్నడు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 3 నెలల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి బై ఎలక్షన్ రాక తప్పదు. రాజయ్య ఎమ్మెల్యే గాక తప్పదు. ఇది రాసిపెట్టుకోండి. మూడునెలల్లో జరగబోయే సత్యం ఇది. ద్రోహం చేస్తే చెప్పే గుణపాఠం అదే.
>
> \- కేసీఆర్

14-15 సీట్లు వస్తే మనమే కీలకం

ఈ ఎన్నికల్లో మోదీకి 280 సీట్లు కూడా దాటే పరిస్థితి లేదని వార్తలు వస్తున్నాయని, అదే జరిగితే హంగ్ ఏర్పడుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు 14-15 సీట్లు వస్తే అప్పుడు కేంద్రంలో మనం కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుందని తెలిపారు. గోదావరి, కృష్ణానదిని కాపాడుకోవాలన్నా, మన నిధులను రాబట్టుకోవాలన్నా, ప్రాజెక్టులకు జాతీయహోదా రావాలన్నా, నిరుద్యోగ సమస్య తీరాలన్నా, మన బతుకులు బాగుపడాలన్నా కచ్చితంగా బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలని పేర్కొన్నారు. తెలంగాణకు అదే క్షేమమని, ప్రజలు ఆలోచించాలని కోరారు. గోదావరిని ఎత్తుకుపోతానన్న బీజేపీకి కానీ, హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌కు కానీ ఓటెందుకేయాలని ప్రశ్నించారు. ''కాంగ్రెస్ మోసాలపై కొట్లాడదామా? యుద్ధం చేద్దామా? గోదావరిని కాపాడుకుందామా? కృష్ణాను కాపాడుకుందామా? మళ్లీ బీఆర్ఎస్ సర్కార్ తరహాలో రైతుబంధు ఇచ్చుకుందామా?'' అన్న కేసీఆర్ ప్రశ్నకు ప్రజలు చెయ్యెత్తి 'అవును' అని నినదించారు. స్పందించిన కేసీఆర్.. అవన్నీ జరగాలంటే వరంగల్ ఎంపీగా సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

ఏరికోరి తెచ్చుకుంటే ఎగిరెగిరి తన్నిండు

ఏరికోరి తెచ్చుకున్న మొగుడు ఎగిరెగిరి తన్నినట్టు.. కాంగ్రెస్ అడ్డగోలు హామీలకు మోసపోయి ఓట్లు వేస్తే నాలుగైదు నెలల్లో తెలంగాణకు జబ్బు వచ్చిందని కేసీఆర్ పేర్కొన్నారు. కరెంటు ఎందుకు పోతున్నదని, సాగు నీళ్లు ఎక్కడికి పోయాయని, పంటలెందుకు ఎండుతున్నాయని, తాగునీటికి కరువు ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. గత పదేండ్లలో ఎన్నడూ వీటిని ఎరుగమని చెప్పారు. ఈ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. తాము రూ. 30 వేల కోట్లతో రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. డిసెంబర్ 9న 10 గంటలకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి చెప్పాడని, కానీ అమలు కాలేదని పేర్కొన్నారు.



హనుమకొండ చౌరస్తాలో కేసీఆర్‌ను ఫొటో తీసుకుంటున్న ప్రజలు

స్వరాష్ట్ర ఉద్యమ కెప్టెన్ కేసీఆర్

ఓరుగల్లుతో విడదీయలేని బంధం

2001 నుంచి ఇప్పటిదాకా ఓరుగల్లుది అదే ఆప్యాయత

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఎవరు అవునన్నా కాదన్నా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర కల సాకారానికి కెప్టెన్ కేసీఆరే. తెలంగాణ పునర్నిర్మాణానికి బంగారు బాటలు వేసింది కూడా కేసీఆరే. తెలంగాణ ఉద్యమానికి, బీఆర్ఎస్ పార్టీకి వరంగల్‌కు విడదీయలేని బంధం ఉన్నది. తెలంగాణ ఉద్యమంలో తనను అక్కున చేర్చుకున్న వరంగల్‌ను స్వరాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ అంతే గౌరవించారు. నాయకులకు పదవులు ఇవ్వటంలో, పథకాల రూపకల్పనలో, సర్కారు రాజముద్రలోనూ కేసీఆర్ వరంగల్‌కు సమున్నత అవకాశం ఇచ్చి గౌరవించారు. ఆదివారం రోడ్ షో సందర్భంగా కేసీఆర్‌ను కండ్లనిండా చూసినపుడు ఓరుగల్లు పులకించిపోయింది. 2001 నుంచి ఇప్పటిదాకా కేసీఆర్‌కు విడిదినిచ్చే కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంటిలోని గది అంతగానే పరవశించింది. 2001 జూన్ 21న వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన బహిరంగసభకు కేసీఆర్ హాజరైనప్పటి నుంచి ఇప్పటి దాకా కేసీఆర్ ఆ గదిలో జరిపిన చర్చలు, సమాలోచనలు, కేసీఆర్ నడిపిన సమరాంగణంలో భాగస్వాములైన మేధావులు, బుద్ధిజీవులు, పార్టీ ముఖ్యులు ఎంతోమందికి ఆ గది ప్రత్యక్షసాక్షి. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన అనంతరం కేసీఆర్ అదే ఇల్లు ఆయనకు విడిది విశాలకేంద్రం. సర్కారు అతిథి గృహాలు, ఆతిథ్యాలకు నెలవైన వందల ఇండ్లు ఎన్ని ఉన్నా కేసీఆర్‌కు ఆప్యాయతలను పంచిన కెప్టెన్ ఇల్లే వరంగల్ చిరునామా. మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంట్లో ఒక గది, హాల్ ప్రత్యేకంగా ఉంటాయి. 'కేసీఆర్ సర్ హాల్.. కేసీఆర్ సర్ బెడ్‌రూం' అని ప్రత్యేకంగా ఉంటాయి. ఆ రెండు చోట్లా ఫోన్లు ఉంటాయి. '2001లో వరంగల్‌లో మీటింగ్ అయినప్పటి నుంచి సార్.. ఎప్పుడొచ్చినా ఇంట్లోనే ఉంటారు. రోజూ శుభ్రం చేయటం తప్ప వాటిని వాడుకోము. అత్యవసరం అయితే తప్ప (ఏడాదికి ఒక్కసారో రెండు సార్లో తప్ప) హాల్‌ను వాడతాం. కానీ సార్ చర్చలు జరిపిన హాల్‌ను ఎవరం వాడం. సార్ చెయిర్.. అటూ ఇటూగా ఉండే సీట్లను రోజూ శుభ్రం చేసి ఉంచుతాం' అని మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీశ్‌కుమార్ పేర్కొనడం విశేషం. కాగా, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కేసీఆర్ హన్మకొండ రోడ్‌షోలో ప్రసంగించారు. వరంగల్ మట్టికి తనకు ఉన్న ఉద్యమబంధాన్ని నెమరువేసుకున్నారు. ఓరుగల్లు పోరుచైతన్యాన్ని చాటిచెప్పారు. అనంతరం కెప్టెన్ ఇంటికి చేరుకున్నారు.

> దేశంలోనే తొలిసారి ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇచ్చాం. బీజేపీ సర్కారు మా బిడ్డను జైలులో పెట్టింది. అయినా భయపడలేదు. ఇప్పుడు బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోటీ కొనసాగుతున్నది. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీ గెలిచే అవకాశం ఉన్నది. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపించండి.
>
> \- కేసీఆర్





జనజాతర | హనుమకొండ చౌరస్తాలో కేసీఆర్ ప్రసంగానికి చేతులెత్తి జేజేలు పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు



100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తా

నిరుపేదలకు ఉచిత విద్య, ఉపాధి శిక్షణ • ప్రతి నియోజకవర్గంలో ఒక ఫంక్షన్ హాల్ • ఒక్క రూపాయికే శుభకార్యానికి అవకాశం • మెదక్‌లో పారిశ్రామికాభివృద్ధికి కృషి

పేదలకు సేవ చేసేందుకే ప్రత్యక్ష రాజకీయాల్లోకి.. • ప్రజల కోసమే రిజర్వాయర్ల నిర్మాణం • కాంగ్రెస్, బీజేపీలవి అసత్య ప్రచారాలు • బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి పీ వెంకట్రామిరెడ్డి

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ Special Interview

సిద్దిపేట, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చాను. కేసీఆర్ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఒక కుటుంబ సభ్యుడిగా ఉంటాను. నిండు మనస్సుతో దీవిస్తే ప్రజల కష్టసుఖాల్లో తోడుంటాను. మన ప్రాంతంపై ఉన్న ప్రత్యేక ప్రేమతో అందరికీ విస్తృత సేవలను అందించాలనే సంకల్పంతో ఎంపీగా పోటీలో నిలిచా'..అని మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పీ వెంకట్రామిరెడ్డి అన్నారు. గత పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో, మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో చాలా అభివృద్ధి జరిగిందని చెప్పారు. తాను వ్యక్తిగతంగా రూ. 100 కోట్లతో ట్రస్టును ఏర్పాటు చేసి, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రజల నుంచి స్పందన ఎలా ఉన్నది..?

ప్రజల ఆదరణ ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కలెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉంది. ప్రతి సమస్య తెలిసిన వ్యక్తిని. ప్రతి గ్రామంలో వంద మందిని పేరు పెట్టి పిలిచేంత పరిచయాలు ఉన్నాయి. ఒక అధికారిగా నన్ను ఆదరించారు. ఇవ్వాళ ఆశీర్వదిస్తున్నారు. మెదక్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ పార్టీకి కంచుకోట. పార్టీ పటిష్టంగా ఉంది. క్యాడర్ సైనికుల్లా పనిచేస్తున్నారు. అందరి సహకారంతో మెదక్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలుస్తాను. అన్ని మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలతోపాటు రోడ్ షోలు నిర్వహిస్తున్నాం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు, అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. గ్రామాల్లో గులాబీ సైన్యం ఇంటింటా ప్రచారం ప్రారంభించింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. మా వెంకట్రామన్న కలెక్టర్‌గా బాగా పని చేసిండు..ఎంపీగా అయితే మరింతగా పనిచేస్తాడన్న ఉత్సాహంతో ముందుకు పోతున్నారు. క్యాడర్ రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శనం చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో ముందుకుపోతున్నాం. టెలికాన్ఫరెన్స్ ద్వారా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలు ఇస్తున్నారు. ఖచ్చితంగా విజయం మాదే.

కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న విమర్శలపై మీ కామెంట్..?

మల్లన్నసాగర్ ముంపు గ్రామాల్లో మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్‌కు మంచి మెజార్టీ వచ్చింది. ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ అదే రిపీట్ అవుతుంది. ప్రతి ముంపు కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకొని.. వాళ్ల సమస్యలన్నీ పరిష్కరించిన వ్యక్తిని.. కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఆర్అండ్ఆర్ కాలనీలు నిర్మించాం. ముంపు బాధితులకు పరిహారం ఇచ్చి ఆదుకున్నాం. రిజర్వాయర్ల నిర్మాణం కోసమే భూసేకరణ చేశాం. ఇవ్వాళ ఈ రిజర్వాయర్ల ద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరు అందింది.

మీరు చేయాలనుకున్న సేవా కార్యక్రమాలు వివరిస్తారా..?

రూ.100కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఉద్యోగమేళాలతో యువత కలలు సాకారం చేస్తానని హామీ ఇస్తున్నాను. ఇక్కడ ఎక్కువమందికి ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగావకాశాలు రావాలనేది నా తపన. హైదరాబాద్‌తోపాటు ఇతర నగరాల్లో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి తర్ఫీదునిస్తాను. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి శాసనసభ నియోజకవర్గపరిధిలో ఒక ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేస్తాను. పేదలకు రూపాయి ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తాను. పెండ్లి భారం కావద్దని ఆడపడుచుల కుటుంబాలకు అండగా ఉండాలన్నదే నా ఆకాంక్ష. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధులను వందకు వంద శాతం ప్రజల అవసరాలు తీర్చడానికి ఖర్చు చేస్తాను. ఎంపీగా గెలిచాక వచ్చే జీతం ఒక్క పైసా సొంతానికి వాడుకోకుండా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తాను. ఉన్నత చదువులు చదివిన నేను ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 ఏండ్ల పాటు ఒక అధికారిగా, కలెక్టర్‌గా సేవలందించాను. ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో సిద్దిపేట జిల్లాను దేశంలోనే అగ్రగామిగా నిలిపాను.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తారా..?

మెదక్ ప్రాంతంలో కలెక్టర్‌గా చేసిన అనుభవం ఉంది. ఎక్కడ ఏం అభివృద్ధి కావాలో నాకు ఒక విజన్ ఉంది. హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతం కాబట్టి మరిన్ని పరిశ్రమలు అవసరం. రాజీవ్ రహదారి వెంబడి మరిన్ని విద్యా సంస్థలు తీసుకువస్తాను. మెదక్ పార్లమెంట్ పరిధిలో కేసీఆర్ ఆలోచనలు, హరీశ్‌రావు నాయకత్వంలో విద్య, పరిశ్రమలు, ఉపాధి ఇవన్నీ మరింతగా అభివృద్ధి చేయాలన్నదే నా ఆలోచన. ఎంపీ అయ్యాక ట్రస్టు ద్వారా నెల రోజుల్లో కార్యక్రమాలను ఆవిష్కరిస్తాను.

మీ ప్రత్యర్థుల గురించి మీరు ఏమంటారు..?

ప్రజలు నన్ను ఒక అధికారిగా ఆదరించారు. ప్రధాన పార్టీల్లో ఒక అభ్యర్థి కేవలం గెలుపు కోసమే నాలుగు నెలల్లో నాలుగు పార్టీలు మారారు. మూడు నెలల కిందట ఒక పార్టీ నుంచి ఓటు అడిగాడు. మళ్లీ ఇంకో పార్టీ నుంచి ఓటు అడుగుతున్నాడు. ఇంకో అభ్యర్థి మొన్నటి శాసనసభఎన్నికల్లో దుబ్బాకలో ఘోర పరాజయం అయ్యాడు. నిరుద్యోగ భృతి, బీడీ కార్మికులకు పెన్షన్ అన్నాడు..? రైతులకు ఎడ్లు నాగలి ఇస్తాను అన్నాడు..? ఇవన్నీ ఏవీ ఇయ్యలేదు. టెక్స్‌టైల్ పార్క్, రైల్వే లైన్ ఇలా ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసి చివరికి ప్రజలను మోసం చేసిన వ్యక్తి. ఈ మోసాలను ప్రజలు గుర్తించి దుబ్బాక ఎన్నికల్లో ధీటైన సమాధానం ఇచ్చారు. నేను ఏవి చేయగలుగుతానో వాటిని మాత్రమే ప్రజలకు హామీలు ఇస్తున్నాను. నేను చేయాలనుకున్నది ప్రజలకు చెప్పి ఓట్లు అడుగుతున్నాను. గెలుపు కోసం తప్పుడు వాగ్దానాలు చేయాల్సిన అవసరం లేదు. హుందాగా రాజకీయాలు చేయాలి. అసత్య ప్రచారాలు మానుకొని ఒక్కరిని ఒక్కరూ దుర్భాషలాడి ప్రజల్లో చులకన కావొద్దు. ఒక మంచి అభ్యర్థిగా ప్రజల్లో ఉండాలన్నదే నా కోరిక.

ప్రజానేతకు ఓరుగల్లు జన హారతి

- అడగడుగునా కేసీఆర్‌కు జన నీరాజనం
- బస్సుయాత్రలో కలిసి నడిచిన జనం
- జై కేసీఆర్.. సీఎం కేసీఆర్.. నినాదాల హోరు
- వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో గ్రాండ్ సక్సెస్

వరంగల్, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ నగరానికి వచ్చిన కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వరంగల్ నగరంలోకి ప్రవేశించినప్పటి నుంచి రోడ్‌షో ముగిసేవరకూ అడగడుగునా వేలాది మంది జనం కిలోమీటర్ల దూరం కేసీఆర్ వెంటే నడిచారు. రోడ్డు పొడవునా జనం రోడ్డుకు ఇరువైపులా జై కేసీఆర్.. సీఎం కేసీఆర్ అంటూ నినాదాలతో స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సు యాత్ర జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ మీదుగా వరంగల్ మహానగరంలోకి చేరుకున్నది. రాంపూర్, మడికొండ, కాజీపేట, అదాలత్ సర్కిల్ మీదుగా బస్సులో కేసీఆర్ అంబేద్కర్ జంక్షన్ వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి జనప్రవాహం కేసీఆర్‌కు ఎదురేగి వచ్చి ఘన స్వాగతం పలికింది. భారీగా వచ్చిన జనం మధ్య నుంచి సభ జరిగే హనుమకొండ చౌరస్తా వరకు చేరుకునేందుకు చాలా సమయం పట్టింది. అంబేద్కర్ జంక్షన్‌కు రాత్రి 7.37 గంటలకు వచ్చిన కేసీఆర్ అక్కడి నుంచి కిలోమీటరు దూరంలోని హనుమకొండ చౌరస్తాకు వచ్చే వరకు రాత్రి 8.25 అయ్యింది. కిక్కిరిసిన జనంతో బస్సు ఆలస్యంగా వెళ్లాల్సి వచ్చింది. వరంగల్ నగరంలో కేసీఆర్ రోడ్ షో మొత్తం భారీ జనంతో ఉత్సాహంగా సాగింది. కేసీఆర్ రోడ్ షోకు ప్రజలు డప్పు చప్పుళ్లతో స్వాగతం కలిపారు. కేసీఆర్‌ను చూస్తూనే కిలోమీటర్ల దూరం బస్సు వెంట నడుస్తూ వెళ్లారు.

హోరెత్తిన నినాదాలు

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలోని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, పరకాల, వరంగల్ తూర్పు, పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి భారీగా జనం కేసీఆర్ రోడ్ షోకు వచ్చారు. అదాలత్ జంక్షన్, నక్కలగుట్ట, అంబేద్కర్ జంక్షన్, పెట్రోలు పంపు జంక్షన్, మిషనరీ హాస్పిటల్, అశోక జంక్షన్ వద్ద అన్నివైపులా రోడ్లు జనంతో కిక్కిరిపోయాయి. కేసీఆర్ ప్రసంగం వినేందుకు, ఆయనను చూసేందుకు గంటలకొద్ది వేచి ఉండి, ఓపికగా ప్రసంగం విన్నారు. కేసీఆర్ ప్రసంగానికి మధ్యలో నినాదాలతో మద్దతు తెలిపారు. తెలంగాణ మలి ఉద్యమంలో వరంగల్‌తో తనకున్న సంబంధాన్ని కేసీఆర్ వివరిస్తున్నప్పుడు ప్రజలు జై తెలంగాణ అని గట్టిగా నినదించారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేసీఆర్ వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సాగు, తాగునీరు, కరెంటు సరఫరా, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేటలో మెడికల్ కాలేజీల నిర్మాణం గురించి కేసీఆర్ చెప్పినప్పుడు జై కేసీఆర్, సీఎం కేసీఆర్ అన్న నినాదాలు హోరెత్తాయి. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ తెచ్చుకున్నం అన్నప్పుడు ప్రజలు చప్పట్లతో ప్రతిస్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సారెస్పీ కాలువ నుంచి నీళ్లు రాలేదని, కాళేశ్వరం కట్టిన తర్వాతే పరకాల, భూపాలపల్లి, వర్ధన్నపేట, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి నియోజకవర్గాల్లో సాగునీరు అందిందని, పుష్కలంగా పంటలు పండాయని కేసీఆర్ వివరించినప్పుడూ జనం చప్పట్లతో మద్దతు పలికారు.



హనుమకొండ చౌరస్తా వద్ద కేసీఆర్ రోడ్‌షోకి పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం

కాంగ్రెస్ అన్యాయం, బీజేపీ ద్రోహంపై రగిలిన జనం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ద్రోహంపై కేసీఆర్ వివరించినప్పుడు ప్రజలు రగిలిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ఎలా ఉన్నదని కేసీఆర్ అడిగినప్పుడు ఏమీ లేదని, జనం చేతులెత్తి చెప్పారు. కల్యాణలక్ష్మితో తులం బంగారం అందుతున్నదా? రైతుబంధు అందరికీ వచ్చిందా? రుణమాఫీ జరిగిందా? మహిళలకు రూ.2,500 ఇస్తున్నారా? రైతుబీమా వస్తున్నదా? అని కేసీఆర్ రోడ్‌షోకు వచ్చిన ప్రజలను అడిగారు. కేసీఆర్ అడిగిన ప్రతి ప్రశ్నకు ప్రజలు చేతులెత్తి లేదు అంటూ ముక్తకంఠంతో చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వరంగల్ ఉమ్మడి జిల్లాకు అన్యాయం చేసిందని కేసీఆర్ అన్నప్పుడు జనం బీజేపీకి వ్యతిరేకంగా స్పందించారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని, బయ్యారంలో స్టీలు ఫ్యాక్టరీని బీజేపీ ప్రభుత్వం ఇవ్వయలేదని కేసీఆర్ వివరించారు. ఇప్పుడు వరంగల్‌కు సాగునీటి ఆదెరువుగా ఉన్న గోదావరి నీటిని బీజేపీ ప్రభుత్వం తమిళనాడుకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరిస్తున్నదని కేసీఆర్ చెప్పినప్పుడు జనం బీజేపీ, కాంగ్రెస్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

కడియం ద్రోహి.. అంటూ నినదించిన ప్రజలు

బీఆర్ఎస్ తరఫున స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి పేరు లేకుండానే కేసీఆర్ ప్రసంగంలో ప్రస్తావించగానే.. రోడ్ షోకు వచ్చిన జనం 'కడియం ద్రోహి' అంటూ నినాదాలు చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవి పోతుందని, స్టేషన్ ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక వస్తుందని, రాజయ్య గెలుస్తాడని కేసీఆర్ మాట్లాడినప్పుడు జనం ఈలలు, చప్పట్లతో హనుమకొండ చౌరస్తా జంక్షన్ మార్మోగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన రోడ్ షో భారీ జనంతో విజయవంతం అయ్యింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో కేసీఆర్ రోడ్ షో ఉత్సాహాన్ని పెంచింది.



రోడ్‌షోకి హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ఆ పోలీస్ అభ్యర్థులు అన్‌ఫిట్?

- కండ్లతో చూసి పనికిరారని రాసిచ్చిన వైద్యులు
- రీ చెకప్‌కు కొందరిని అనుమతించని బోర్డు
- సీఎం సొంత జిల్లాలోనే ఎక్కువ మందికి నష్టం
- కానిస్టేబుల్‌గా ఎంపికైనా తప్పని నిరాశ

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాలకు ఎంపికయ్యామని ఆనందపడిన వారికి వైద్య పరీక్షలు, పెట్టీ కేసుల రూపంలో తీరని నిరాశ ఎదురైంది. వింతైన వైద్య పరీక్షలతో ఎందరో కొట్టుమిట్టాడుతున్నారు. కేసులు కొట్టివేసినా వారికి కనికరం చూపడం లేదు. ఇలా ఒకరు, ఇద్దరు కాదు.. వందలాది మంది అభ్యర్థులు నరకయాతన అనుభవిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది బాధితులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా నుంచే ఉండటం గమనార్హం. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన వివిధ పరీక్షల్లో తుది దశలో ఎంపికైన అభ్యర్థులకు గత ఫిబ్రవరిలో మెడికల్ టెస్టులను ఆదరాబాదరాగా చేయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అప్పటికే సివిల్, ఏఆర్ వంటి విభాగాలకు ఎంపికైనట్టు బోర్డు నుంచి లేఖలు అందాయి. ఫిబ్రవరి మొదటివారం నుంచే మెడికల్ టెస్టులకు రావాలని అభ్యర్థులకు సందేశాలు పంపారు. చాలామందిని పరీక్షించకుండానే వైద్యులు ముఖం చూసి మెడికల్ టెస్టులు పాస్ చేయించారని విశ్వసనీయ సమాచారం. కొందరిని కాళ్లు, కండ్లు చూసి పరీక్షలు నిర్వహించకుండా వెరికోస్ వీన్స్, లో సైట్, మైల్డ్ హైడ్రోసిల్ పేరుతో 'అన్‌ఫిట్' అని రాసి ధ్రువీకరించారు. దీంతో కంగారుపడిన ఆయా అభ్యర్థులు వివిధ ప్రైవేట్ దవాఖానలకు వెళ్లి పరీక్షలు చేయించుకోగా ఎలాంటి లోపాలు లేవని తేలింది. ఆ రిపోర్టులతో తమకు రీచెకప్ చేయాలని ఎస్పీకి, టీఎస్ఎల్‌పీఆర్బీకి లెటర్లు పెట్టుకున్నా కనికరించే నాథుడే లేరు. అయితే, కొన్ని జిల్లాల్లో కొందరు అభ్యర్థులకు మూడోసారి కూడా రీచెకప్‌కు అవకాశం ఇచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది.



నా కాళ్లను చూసి 'వెరికోస్ వీన్స్' అని రాసి అనర్హత వేటు వేశారు. వైద్యులే అలా చేయడంతో భయపడి వెంటనే ఓ ప్రైవేటు దవాఖానలో పరీక్షలు చేయించుకున్నా. నాకు ఎలాంటి వెరికోస్ వీన్స్ లేవని తేలింది. ఆ రిపోర్టులు తీసుకొని రీ చెకప్‌కు అవకాశం ఇవ్వాలని జిల్లా ఎస్పీకి, బోర్డుకు లేఖలు రాసినా స్పందన రాలేదు. 13 ఏండ్లుగా హోంగార్డుగా చేస్తున్నా.

- టీ రాములు, గాలిగూడ గ్రామం, బాలానగర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా

కేసులపై విచారణలో అధికారుల అలసత్వం!

రాష్ట్రవ్యాప్తంగా సివిల్, ఏఆర్, టీఎస్ఎస్పీ విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమ స్వీయ ధ్రువీకరణ పత్రంలో తమపై రకరకాల కారణాలతో నమోదైన సివిల్,క్రిమినల్,బైండోవర్,కరోనా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన కేసులు ఉన్నట్టు పోలీసులే ధ్రువీకరించారు. వీరిపై నమోదైన కేసుల్లో వారు విద్యార్థి దశలో చేసిన ఉద్యమ కేసులు, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే కుటుంబ తగాదాలతో కక్షపూరితంగా, ఉద్దేశపూర్వకంగా నమోదైన కేసులే అత్యధికం. ఎంపికైన అభ్యర్థులపై నమోదైన చాలా కేసుల్లో ఇప్పటికే కొందరు అభ్యర్థులు కోర్టుల్లో నిర్దోషులుగా బయటపడ్డారు. స్పెషల్ బ్రాంచి అధికారుల తుది పరిశీలనలో కూడా అభ్యర్థులు ఆయా కేసులకు సంబంధించిన పూర్తి వివరాలతోపాటు,కేసుల్లో నిర్దోషిగా తేలిన కోర్టు జడ్జిమెంట్ కాఫీలను అభ్యర్థులు స్పెషల్ బ్రాంచి అధికారులకు, బోర్డుకు అందించినా అలసత్వం వహిస్తున్నారు.

156 మందికి క్లియరెన్స్?

పోలీసు ఉద్యోగాలకు అర్హత సాధించి స్థానికత ధ్రువపత్రం, నేరచరిత్ర, సమాచారాన్ని గోప్యంగా ఉంచడం, వర్టికల్/హారిజాంటల్ రిజర్వేషన్ల అర్హత, మెడికల్ ఫిట్‌నెస్ తదితర అంశాల్లో సమస్యలను గుర్తించి సుమారు 700 మందిలో 326 మందిని తుది దశకు తీసుకొచ్చారు. అందులో న్యాయమైన వారిని ఎంపిక చేసే బాధ్యతను స్క్రీనింగ్ కమిటీకి అప్పగించారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి, డీజీపీ ప్రతినిధితోపాటు టీఎస్ఎల్‌పీఆర్బీ చైర్మన్ సభ్యులుగా ఉన్న స్క్రీనింగ్ కమిటీ నుంచి ఇప్పటికే 156 మందికి క్లియరెన్స్ ఇచ్చినట్టు తెలిసింది. మిగిలిన వారిలో సాధారమైన పెట్టీ కేసులు ఉన్నవారు, వైద్యుల ద్వారా అన్యాయానికి గురైన వారే ఎక్కువగా ఉన్నారని తెలిసింది. ఇప్పటికనా సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని తమపై కనికరం చూపాలని వారంతా వేడుకుంటున్నారు.

సాగునీటిపై 'ఉత్తమా'టలు!

- కాళేశ్వరంపై సాగునీటి మంత్రి అబద్ధాలు
- 2018లోనే కాళేశ్వరం జలాలకు పూజలు
- ఐదేండ్లు ఏటా 30 టీఎంసీల నీళ్లు
- సూర్యాపేట జిల్లాలోనే అదనంగా 20 లక్షల ఎకరాల సాగు
- ఐదేండ్లలో సాగైంది 6.50 లక్షల ఎకరాలేనన్న మంత్రి
- సొంత జిల్లాలో పర్యటిస్తే కదా? వాస్తవం తెలిసేది!

సూర్యాపేట, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఆయన స్వయంగా ఇరిగేషన్ శాఖకు మంత్రి.. ఏ ప్రాజెక్టు కింద ఎంత సాగు? ఏ జిల్లాలో ఎంత పంట పండింది? అన్న సమాచారం తెలిసి ఉండాలి. కానీ, వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా, కనీస అవగాహన లేకుండా అబద్ధాలతో ప్రజల్లో పలుచన అవుతున్నారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి. సూర్యాపేట జిల్లా పరిధిలో గోదావరి జలాల ఆయకట్టు అధికారిక లెక్కల ప్రకారం.. దాదాపు 2.60 లక్షల ఎకరాలు ఉండగా 2017 వరకు బావులు, బోర్ల కింద 55 వేల ఎకరాలకు మించి సాగుకు నోచుకోలేదు. 2018 నుంచి కాళేశ్వరం జలాలు రావటంతో ఏకంగా 2.58 లక్షల ఎకరాలకు చేరుకొన్నది. ఈ లెక్కన కాళేశ్వరం జలాలు వచ్చిన తర్వాత జిల్లాలో ప్రతి సీజన్‌కు పెరిగిన సాగు విస్తీర్ణం 2.03 లక్షల ఎకరాల చొప్పున ఏటా 4.06 లక్షలు. అంటే ఐదేండ్లలో సాగైన భూమి దాదాపు 20 లక్షల ఎకరాలు. కానీ, ఐదేండ్లలో మొత్తంగా కాళేశ్వరం జలాలతో సాగైంది కేవలం 6.50 లక్షల ఎకరాలే అని మంత్రి ఉత్తమ్ అనటం గమనార్హం.



మేడిగడ్డ నుంచి సూర్యాపేట జిల్లా రావి చెరువుకు ఐదారు దశాబ్దాల తరువాత నీళ్లు రావడంతో పూజలు చేస్తున్న నాటి మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి(ఫైల్)

కాలువల్లో నిరంతర జలాలు

కాళేశ్వరం జలాలను ఐదేండ్ల పాటు ఏటా రెండు సీజన్లల్లో ప్రతి సీజన్‌కు కాలువల్లో 1,200 నుంచి 1,700 క్యూసెక్కుల చొప్పున అవసరాన్ని బట్టి సీజన్‌కు 65 రోజుల నుంచి 100 రోజుల పాటు నిరంతరాయంగా నీటిని విడుదల చేశారు. బయ్యన్న వాగు నుంచి కాలువల ద్వారా నేరుగా పంట పొలాలకు సీజన్‌కు 12 క్యూసెక్కులతో పాటు జిల్లాలోని గోదావరి జలాల ఆయకట్టు పరిధిలోని దాదాపు 650 చెరువులు, కుంటలు నింపేందుకు మరో 2 టీఎంసీలు మొత్తం కలిపి ఒక్కో సీజన్‌కు 12 నుంచి 15 టీఎంసీల చొప్పున ఏడాదికి రెండు సీజన్లకు కలిపి దాదాపు 24 నుంచి 30 టీఎంసీల నీటిని విడుదల చేశారు.

కాళేశ్వరంపై తొలి నుంచీ అక్కసే

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమైనప్పటి నుంచి కాంగ్రెస్ కడుపు కుతకుత ఉడుకుతున్నది. రైతుల కడుపు నిండుతున్నదనే సంతోషం కనిపించకపోగా, ఆ పార్టీ కడుపు మండుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితం వచ్చి ఊహించిన రీతిన వరిసాగు పెరిగి దేశానికే అన్నం పెట్టే స్థాయికి వచ్చినప్పటికీ ఆ పార్టీ బుద్ధి మారటం లేదు. తప్పుడు మాటలు వదలటం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఏటా 1.30 లక్షల ఎకరాల చొప్పున ఐదేండ్లలో 6.50 లక్షలకు మించిలేదని ఉత్తమ్ ఇటీవల ఓ స్క్రీన్ ఏర్పాటు చేసి ఓ కట్టుకథను అల్లి చెప్పారు. కానీ వాస్తవ పరిస్థితి గమనిస్తే సూర్యాపేట జిల్లాలోనే గత ఐదేండ్లలో కలిపి సాగైన మొత్తం విస్తీర్ణం 20 లక్షల ఎకరాలు. మరి మంత్రి ఉత్తమ్ చెప్పే లెక్క ప్రకారం కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చిన తరువాత దాని పరిధిలో ఏటా 1.30 లక్షల చొప్పున ఐదేండ్లలో 6.50 లక్షల ఎకరాలే పండాయని చెప్పటం ఆయన మాటలు అబద్ధమని తేటతెల్లమవుతున్నది. వాస్తవానికి గ్రామాలకు వెళ్లి నీళ్లు ఎప్పటి నుంచి వస్తున్నాయని తెలుసుకుంటే కాంగ్రెస్‌కు నిజం తెలుస్తుంది.ఎన్ని లక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చాయో తెలుతుంది. రూ.వేల కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే చిన్న బరాజ్‌లను మరమ్మతులు చేయించలేని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అబద్ధాలు మాని యుద్ధప్రాతిపదికన పనులు చేయించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నాలుగు ఎకరాలు సాగుచేస్తున్నా



మా ఊరు మొత్తంలో దాదాపు 1,200 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కానీ నీటి సౌకర్యం లేక 300 ఎకరాల కంటే ఎక్కువ రైతులు వ్యవసాయం సాగు చేయలేకపోయేది. కేసీఆర్ సీఎం అయ్యాక అయిన తరువాత మా ఊరి పక్కనుంచే 71 డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా కాళేశ్వరం జలాలు వెళ్లటంతో భూగర్భ జలాలు పెరిగాయి. బోర్లు, బావుల్లో నీళ్లు పుష్కలంగా వచ్చాయి. దీనికి తోడు మా ఊళ్లోని చెరువులు, కుంటలను కాళేశ్వరం జలాలతో నింపటంతో సాగుకు ఢోకా లేకుండాపోయింది. నీటి సౌకర్యం ఎక్కువగా ఉండటంతో ప్రతి సీజన్‌లో దాదాపు 1,200 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇది కాళేశ్వరం జలాలు వచ్చాకే సాధ్యమైంది. నాకు కూడా నాలుగున్నర ఎకరాల భూమి ఉన్నది, కాళేశ్వరం జలా పుణ్యమా అని ఆ భూమి సాగు చేస్తున్నా.

- తొట్టె లింగయ్య, పర్సాయపల్లి, అర్వపల్లి మండలం, సూర్యాపేట జిల్లా

ఐడీఈఏ అధ్యక్షుడిగా వీసీ సీతారామారావు

ప్రధానకార్యదర్శిగా ఎల్ విజయకృష్ణారెడ్డి



సీతారామారావు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఐడీఈఏ) కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. గౌరవ అధ్యక్షుడిగా కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు కే మురళీ మనోహర్, అధ్యక్షుడిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక యూనివర్సిటీ వీసీ కే సీతారామారావు, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అభ్యాసక సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి, వివిధ రాష్ట్రాలకు చెందిన నలుగురిని ఉపాధ్యక్షులుగా, మరో ముగ్గురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు. ఈ కార్యవర్గం కాలపరిమితి రెండేండ్లు ఉంటుంది. అంతకు ముందు ఓయూలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సులో పలువురు వక్తలు మాట్లాడుతూ.. దూరవిద్యను బలోపేతం చేయడంతో పాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునీకరించేందుకు ప్రభుత్వాలు అన్ని విధాల సహకరించాలని అభిప్రాయపడ్డారు. సదస్సులో వీసీలు నాగేశ్వరరావు, డీ రవీందర్, కే సీతారామారావు, రమేశ్, రాజన్ వెలుకర్, న్యాక్ మాజీ డైరెక్టర్ వీఎస్ ప్రసాద్, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు హరగోపాల్ పాల్గొన్నారు.

4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 29 ఏప్రిల్ 2024
www.ntnews.com

చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

రామాయణంలో స్త్రీ పాత్రల ఔచిత్యం

రామాయణ, భారత, భాగవతాలు భారతీయులకు పవిత్ర గ్రంథాలు. భారత సాహిత్యానికే అవి పట్టుకొమ్మలు. భారతీయ జీవన విధానానికి దర్పణాలు. మానవ జీవన విధాన రూపకల్పనకు చక్కగా ఉపకరించే సమున్నత సాధనాలు.

ఆదర్శ మానవ జీవితానికి దారిచూపే కరదీపిక రామాయణం. మూడు కుటుంబ జీవితాలను మన ముందుంచి, ఏది ఉత్తమ జీవితమో చెప్తూ, కుటుంబ బాంధవ్యాలను ఉదాహరణగా నిర్వచించి, ఎవరితో ఎలా మసలుకోవాలో సున్నితంగా సూచించే కావ్యం ఇది. అందుకే రామాయణానికి వైశిష్ట్యం కల్పించి, ఆరాధించారు.



డాక్టర్ శ్రీభాష్యం అనురాధ
87903 25502

వాల్మీకి రామాయణాన్ని ఆధారంగా చేసుకొని, ప్రాంతీయ భాషల్లో పలు రామాయణాలు వెలువడ్డాయి. తెలుగులో తొలి రామాయణం 'భాస్కర రామాయణం'. ద్విపదగా, చంపూ పద్ధతిలో రూపొందిన మొదటి రామాయణం. అది జానపద ప్రభావం లేక ఇంచుమించు మూల రామాయణ కథ ఆధారంగానే సాగింది.

> రామాయణాన్ని సాహిత్య చరిత్రలో కుటుంబ, సామాజిక ఆదర్శాల ద్వారా జీవితంలో విస్తృతమైన దృక్పథాన్ని ప్రవేశపెట్టిన మొదటి రచనలలో ఒకటిగా చెప్పవచ్చు. స్త్రీ పాత్రల గురించిన నిర్దిష్టమైన అధ్యయనంతో గుర్తించబడిన విలువలు లేదా ఆదర్శాలు ఏవీ చెప్పకుండా వదలలేదని చెప్పవచ్చు. మానవ ఆలోచనల భావోద్వేగం, ఉనికి సంపూర్ణతను ప్రదర్శిస్తుంది.

భారతదేశమే కాకుండా ప్రపంచంపై దాని ప్రభావాన్ని విస్తృతం చేస్తుంది. రామాయణమంతా సీత పాత్ర విస్తరిస్తుంది. 'సీతాయః చరిత మహత్' అనే వ్యక్తీకరణ దీనికి నిదర్శనం. కథాంశం మార్చడానికి (మంథర); కథాంశ మలుపు (కౌసల్య, సుమిత్ర, కైకేయి); అనుబంధించడం (శబరి, అహల్య); ఏకపక్ష పాత్ర (ఊర్మిళ); ఇలా మనకు ఎన్నో స్త్రీ పాత్రలు నిజ జీవితపు సారూప్యతను కనిపింపజేస్తాయి.

స్త్రీ పాత్రల ఔచిత్యం: భాస్కర రామాయణంలో మొదట అహల్య వృత్తాంతంలో ప్రత్యేకత కనిపిస్తుంది. ఇంద్రుడు అహల్యను మోసగించి గౌతముడు లేని సమయాన కోరి వస్తాడు. తన కూతతో పొద్దు పొడిచిన సంకేతం ఇచ్చాడు. గౌతముడు అనుష్టానాలు నిర్వర్తించుకోవడానికి వెళ్తాడు. ఆ సమయం చూసుకొని ఇంద్రుడు ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. దివ్య దృష్టి కలిగిన గౌతముడు అన్ని తెలుసుకోవచ్చు కానీ, 'బుద్ధారెడ్డి' సామాన్య మానవుడి కల్పనలు కోడి కూతతో తెల్లవారిందని భ్రమపడే విధంగా చిత్రించాడు. తిరిగివచ్చిన గౌతముడు అహల్యను శపిస్తాడు. రంగనాథ రామాయణంలో 'పడతి పాషాణమై పడి యుండు నీవు' అని శపించినట్లు ఉన్నది.

'మంథర': ఈ పాత్రను బుద్ధారెడ్డి రాముడు చిన్నప్పుడు తన కాలు విరిచినందుకు ప్రతీకారం తీర్చుకునే స్వభావం కలదిగా చిత్రిస్తాడు. యజ్ఞదత్తుడు మరణించినప్పుడు అతని తండ్రితో పాటు తల్లికూడా ఎంతగానో విలపించిందని చెప్పడంలో ఆ పాత్రలో మాతృహృదయాన్ని వ్యక్తపరిచాడు.

ఊర్మిళ: రంగనాథ రామాయణంలో ఊర్మిళాదేవి నిద్ర ఘట్టాన్ని వివరిస్తాడు. అరణ్యవాసానికి వెళ్లిన తన భర్త (రాముని వెంట లక్ష్మణుడు) వెళ్లినప్పుడు, లక్ష్మణ కర్తవ్య నిర్వహణ కోసం నిద్రాదేవి తనను ఆవహించడం, లక్ష్మణుడు తిరిగి రాగానే, నిద్రాదేవి వెళ్లిపోవడం దీనిలో చెప్పబడింది.

సీత: సీతాదేవిని హిందూ మతంలోనే విశ్వాసాల ప్రతీకగా చూపబడింది. విష్ణువు అవతారమైన శ్రీరాముని ధర్మపత్ని హిందూ సమాజంలో స్త్రీ ప్రవర్తనకు, ఆలోచనకు సీతా చరిత్ర మార్గదర్శకంగా నిలిచిపోయింది. సకల గుణాలు కలిగిన సాధ్విగా, భారతీయులకు నిత్యం ఆరాధించే సుగుణాల రాశిగా పేరొందింది. రామాయణ కథంతా సీతే ప్రధాన పాత్ర వహించింది.

> **అంజన:** కిష్కింధ నివాసి, కుంజరుడి కూతురు, కేసరి భార్య అంజన. ఈమెకు వాయుదేవుడి అంశతో హనుమంతుడు జన్మించాడు. రామాయణంలో ఈమె ప్రధాన పాత్ర వహించింది.

అనసూయ: అంటే అసూయ లేనిదని అర్థం. కర్ధమ ప్రజాపతి, దేవహూతుల పుత్రిక, అత్రి మహర్షి భార్య. వినయ, వివేకాలు ఈమెకు సహజ భూషణాలు. పతి సేవలో లీనమై ఉన్నట్టు పతి భక్తికి మెచ్చి అత్రి మహర్షి అష్టాక్షరీ మంత్రోపదేశం చేస్తాడు. మహర్షులకు కూడా పూజ్యనీయమైన మహోన్నత స్థానాన్ని పొందింది.

అరుంధతి: వశిష్ట మహర్షి ధర్మపత్ని మహా పతివ్రత. బాలకాండలో ఈమె గురించి చెప్పబడింది.

కైకసి: సుమాలి, కేతుమతిల కుమార్తె. విశ్రవసుని భార్య. రావణ, కుంభకర్ణ, విభీషణ, శూర్పణకలకు తల్లి. గొప్ప శివభక్తురాలుగా చిత్రించారు.

కైకేయి: రామాయణంలో దశరథుని మూడో భార్య. పుత్రకామేష్టి యాగం చేసిన తర్వాత యజ్ఞ ఫలం మూలంగా ఈమెకు భరతుడు జన్మిస్తాడు. తన దాసి అయిన మంథర మాట విని, శ్రీరాముడిని 14 ఏండ్లు వన వాసానికి పంపమని, భరతునికి రాజ్యాభిషేకం జరిపించమని దశరథుని కోరుకుంటుంది. సీతారాముల వనవాసానికి ప్రధాన కారకురాలైంది.

కౌసల్య: అయోధ్య రాజ్యానికి మహారాణి. కోసల రాకుమారి. ఈమె శ్రీరాముని తల్లి. మహా విష్ణువునే పుత్రునిగా పొందే అదృష్టం పొందింది. 'కౌసల్యా సుప్రజా రామా' అని కీర్తించబడింది.

సుమిత్ర: కాశీరాజ్యపు రాకుమారి. యజ్ఞ ఫలం మూలంగా లక్ష్మణుడు, శత్రుఘ్నుడు జన్మించారు. సౌమిత్రి అని లక్ష్మణునికి పేరు. రామాయణంలో సుమిత్ర పాత్ర చాలా కొంచెమే కనిపిస్తుంది.

తాటకి: యక్ష రాక్షసి. యక్షరాజైన సుకేతుడికి తపస్సు ఫలితంగా జన్మించిన పుత్రిక. విశ్వామిత్రుని యాగరక్షణార్థం వచ్చిన రామ లక్ష్మణులచే వధించబడింది.

తార: కిష్కింధకాండలో వాలి భార్యగా చిత్రింపబడుతుంది. అంగదుడు వీరి కుమారుడు. వాలి, సుగ్రీవుల వైరంలో తార హితోక్తులు ముఖ్యంగా చెప్పుకోదగినవి.

త్రిజట: ఇదొక కల్పిత పాత్ర. రావణుడు సీతను ఎత్తుకొని పోయి, లంకలో బంధించినప్పుడు, ఆమెకు రక్షణగా ఉంచిన రాక్షస స్త్రీల లో ఒకతె. ఈమె తన స్వప్న వృత్తాంతం సీతకు తెలపడం ముఖ్యాంశంగా చెప్పవచ్చు.

మండోదరి: రామాయణంలో రావణుని భార్య. విశ్వకర్మ పుత్రుడైన మయబ్రహ్మ కుమార్తె. ఇంద్రజిత్తు ఈమె కుమారుడు. రావణుని పట్టమహిషి. బాహ్య సౌందర్య రాశి మాత్రమే కాదు, అంతః సౌందర్యం మిక్కిలి కొనియాడదగినది. నీతిని, ధర్మాన్ని, కర్తవ్యాన్ని ప్రబోధం చేయగల మనస్తత్వం కలది. మండోదరి, అహల్య, తార, సీత, ద్రౌపది పంచ కన్యలుగా ప్రసిద్ధి చెందారు.

> **శబరి:** శ్రీరాముని భక్తురాలు. రాముని దర్శనానికై జీవితాంతం భక్తితో వేచి ఉండి, చివరికి రామదర్శనం పొందిన ధన్యజీవి. గిరిజన స్త్రీ అయిన శబరి వేదం తెలియనప్పటికీ యోగ సాధన చేసింది. జ్ఞానం మోక్షం, పొందడానికి అందరూ అర్హులని నిరూపించినదే 'శబరి కథ'.

శూర్పణఖ: రావణబ్రహ్మ సోదరి. రాముని వనవాస కాలంలో రామునిపై మోజుపడి, లక్ష్మణునిచే ముక్కు చెవులు కోయించుకుంటుంది. రామ రావణ యుద్ధానికి ఈమె ఒక కారణమని చెప్తారు.

సులోచన: ఇంద్రజిత్తుని భార్య.

శ్రుతకీర్తి: కుశ ధ్వజుని కుమార్తె. శత్రుఘ్నుని భార్య.

సరమ: విభీషణుడి భార్య.

శాంత: దశరథుని మిత్రుడైన రామపాదుని కుమార్తె.

లంకిణి: లంకకు కాపలాగా ఉన్న రాక్షసి.

ధాన్యమాలిని: రావణుని రెండవ భార్య. అతికాయుని తల్లి.

ఇలా రామాయణంలో కొన్ని పాత్రలు మానవత్వాన్ని మరిచిపోయి ప్రవర్తిస్తే, మరికొన్ని పాత్రలు మానవత్వానికి ప్రతీకలైనాయి. ఇది మానవ ఆలోచన, భావోద్వేగం, ఉనికి సంపూర్ణతను ప్రదర్శిస్తుంది. సమాజంలో లేదా ఒక వర్గం వ్యక్తుల స్థితి ఆధారంగా కానీ మానవ స్వభావం ఆధారంగా ఎటువంటి పక్షపాత భావాలతో చిత్రించబడలేదు.

ఈ రామాయణ స్త్రీ పాత్రల ద్వారా మానవ స్వభావ పరిధిని ఒక సంగ్రహావలోకనం పొందడం జరుగుతుంది. ఏది తీసుకోవాలి లేదా తిరస్కరించాలనేది కథ ముందుకు సాగుతున్న కొద్ది సంఘటనల ఫలితాన్ని బట్టి అవగతమవుతుంది. రామాయణంలో చిత్రీకరించబడిన పాత్రలు ప్రస్తుత సమాజంలో ఒక సాధారణ స్త్రీ జీవితానికి ఒక సాధారణ స్థానాన్ని తెలుసుకునే అంశం గా ఆలోచిస్తే ఈ పాత్రలు భారతీయ నేపథ్యానికి దూరంగా లేవు. ఒకరి కుటుంబం, స్నేహితులతో పరస్పరం భాషించేటప్పుడు అది ప్రభావం చూపుతుంది. చుట్టూ ఉన్న సమాజంలో ఈ పాత్రలను ఒక దానితో ఒకటి పోల్చి అంచనా వేసినప్పుడు ఆధునిక మహిళల తప్పుల నుంచి నేర్చుకోవడమే కాకుండా సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోగలరు. రాక్షసులు, సన్యాసులు, దేవతల పాత్రలు కేవలం ఆనందానికి మూలం మాత్రమే కాదు, మానవ స్వభావాలలోని లోపాలు లేదా బలాల పెద్ద సంస్కరణల వర్ణనలుగా చూసినప్పుడు, కథ సందేశాత్మకంగా మారుతుంది. ఈ విధంగా ఒకే సమయంలో నేర్చుకోవడం, ఆనందించడం, సొంత జీవితంలో సాకారం చేసుకోవడం గమనిస్తాం. మన సనాతన సంస్కృతిని నాడు, నేడు రేపు ప్రతిబింబింపజేసి ప్రగతి బాటలు వేసేది రామాయణం అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆఖరి క్షణం



నలుపు కేవలం ఓ రంగు కాదు
అది ఘనీభవించిన దుఃఖం

తెలుపూ ఒట్టి రంగు కాదు
విచ్చుకుని వికసించిన సంతోష
పరిమళం

నిజానికి
సప్త వర్ణాలల్లో ఏ ఒక్కటీ
ఏదో ఒక రంగు మాత్రమే కాదు
ఒక్కో రంగూ ఒక్కో భాష మాట్లాడుతుంది
ఒక్కో భావాన్ని ప్రకటిస్తుంది

మనం
బతికే కోట్లాది క్షణాల్లో
ఏ క్షణమూ ఒంటరిది కాదు
బతుకు ఒక్క రంగునూ ప్రతిబింబించదు

ప్రతి క్షణం గతంలో
తాను గడిపేసిన క్షణాన్ని వెంటేసుకొని
రానున్న క్షణంలోకి దారితీస్తుంది

దారీ తెన్నూ ఏ భవిష్యత్తూ లేనిది
ఒక్క చివరి క్షణమే

ఎప్పుడొస్తుందో తెలీని ఆ ఆఖరి క్షణం
తాను నడిచొచ్చిన క్షణాల్ని
చూస్తూ ఏడవకుండా
నవ్వుతూ కొవ్వొత్తిలా ఆరిపోతే
మనిషి బతుక్కి అంతకంటే ఆనందమేముంది
నలుపు తెలుపుల పరమార్థమేముంది



వారాల ఆనంద్
94405 01281

ఆహ్వానం

ప్రకటన

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం మొదలైన అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించి ప్రచురిస్తున్న జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల పరంపరలో మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల సంపుటాలకు వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. 1.జిల్లా నైసర్గిక స్వరూపం, 2.జిల్లా ప్రాచీన ఆధునిక చరిత్ర, సంస్కృతి, 3.పురావస్తు కట్టడాలు, 4.సంగీత నృత్య నాటక చిత్రలేఖన శిల్ప కళల వికాసం, 5.పద్య, 6.గేయ, 7.వచన కవిత్వం, 8.కథ, 9.నవల, 10.విమర్శ, 11.అనువాదం, 12.పరిశోధన, 13.బాలసాహిత్యం, 14.పత్రికలు, 15.జానపద కళలు, 16.తెలంగాణ ఉద్యమంలో జిల్లా కవులు కళాకారుల పాత్ర, 17.విద్యారంగం, 18.పరిశ్రమలు 19.వ్యవసాయం, 20.సాగు, తాగునీటి పథకాలు, 21. పర్యాటక ప్రదేశాలు, 22.ప్రాచీన ఆలయాలు జాతరలు, 23.జానపద విజ్ఞానం 24.జిల్లాకు చెందిన సాహిత్య సాంస్కృతిక సంస్థలు, 25.ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, 26.పండితులు, కళాకారులు, 27.క్రీడారంగం.. ఈ అంశాలపైన వ్యాసాలకు ఆహ్వానం.ఆసక్తి ఉన్నవారు వెంటనే 9441046839 నెంబర్‌లో గానీ rsuryaprakashrao@gmail.com మెయిల్ ద్వారా గానీ సంప్రదించాలి.

- డాక్టర్ రాయారావు సూర్యప్రకాశరావు

జర్నలిస్టుల్లో కవులు తక్కువే. వార్తలు, కథనాల ఏరివేతలోనే వారి సమయం హరిస్తుంది. దొరికిన విశ్రాంతిలోనే తమ మదిలో కదిలే భావధార కోసం వచనాన్ని మరిచి పద్యంలోకి వెళ్లాలి. వేళాపాళా చూడని మనసు ఊరట కోసం నిద్రాకాలాన్ని చించి మరీ కవితలల్లాలి. అప్పుడే హద్దులు దాటి రాయలేని వార్తలు కవి వెంట ఇంటికొచ్చి ఆయన నిశ్వాసాల్లో కొత్త ఊపిరి పోసుకుంటాయి. వార్తకు యాజమాన్యం ఉంటుంది కానీ, కవితకు కవే యజమాని. ఇలా కవిత్వం బారిన పడిన పాత్రికేయుల్లో గార శ్రీరామమూర్తి ఒకరు.

కవితాకాశంలో 'నిజం' పద ముద్రలు

జీవితమే పాత్రికేయంగా గడిపిన శ్రీరామమూర్తి కవిగా 'నిజం' అవతారమెత్తారు. జీవన గమనంలో చుట్టుముట్టిన భిన్న నేపథ్యాల, పార్శ్వాల ఒత్తిళ్లకు, రాపిడికి 'నిజం'గా కవిత్వం ఆయనకు ఒక రిలీఫ్. ఒక ముందడుగు. ఒక బాధ్యత. ఒక ఆయుధం కూడా. బతుకు ఎన్ని మలుపులు తిరిగినా, తెరువు ఎన్ని దారులు చూపినా తన కవిత్వపు జెండా రంగు, ఎత్తు, నిటారు ఏ మాత్రం మారనీయలేదు. కవిత్వంలో నాణ్యత ఎంత ముఖ్యమో నిబద్ధత అంతకన్నా ముఖ్యమని నమ్మిన కవి ఆయన. తన నమ్మికని నిలబెట్టే ధీర కవిత్వాన్ని, వెరుపులేని వ్యక్తీకరణను కలంలో నింపుకొన్న 'నిజం' నిజాన్ని నిక్కచ్చిగా ప్రకటించారు. అలా ఆయన ముద్రతో వచ్చిన మరో కవితా గుచ్ఛం 'రంగు రంగుల సూర్యోదయాలు'.



చాలాసార్లు తన మనసులోకి వెళ్లిపోతారు. అయితే ఆయన అక్కడే ఆగకుండా తన భావజాలం పిలిచినట్టు వెనక్కి వచ్చి పాలకుల తీరును ఎండగడతారు. 'నిజంగా అభివృద్ధి చేస్తే/ సంక్షేమం అక్కర్లేదు/ సంక్షేమమే నడిస్తే/ అభివృద్ధి అడ్రస్ ఉండదు' అంటూ చురకలేస్తారు. అందుకే ఆయన కవిత్వం రంగు రంగుల సూర్యోదయమైంది.

కవిత్వాన్ని ఆయన ఎంత ఇష్టపడుతారో, అందులో నాణ్యతను అంతే కోరుకుంటారు. 'కవిత్వమా! ఇంటింటి/ సుమానివై నువ్వెంత/ సులువో చెబుతావు/ నాణ్యత దగ్గర కొండెక్కి కూచుంటావు' అంటూ నేటి కవిత్వంలోని పలుచదనాన్ని విమర్శిస్తూ 'లోతు బావికే కాదు, భావానికీ అవసరమే/ దిగేవారు పైకి రాలేక/ గిల గిలా కొట్టుకోవాలి' అని సూత్రీకరిస్తారు.

నిజంలో ఐదు వందలకు పైగా నాలుగు పాదాల కవితలున్నాయి. 'రెండు పూల మధ్య ఖాళీని/ పరిమళం పూరిస్తుంది/ ఇద్దరు మనుషుల మధ్య బంధాన్ని/ మతం నరుకుతుంది, 'తినే పచ్చిక కంటే/ నెమరు ఎంతో రుచి/ వర్తమానం కంటే/ గతం మధురం' ఇలా సాగే ఈ కవితల్లో వర్తమాన సమాజపు అన్ని రూపాలను, పోకడలను ఎత్తి చూపారు. 'అన్ని చక్రాలూ/ నడిస్తేనే రథం కదిలేది/ దేనికేది కృతజ్ఞతలు చెప్పుకోనక్కర్లేదు/ బాధ్యతే అసలైన బండి' అని చెప్తూ మనుషుల్లో చీలికల్ని నిలదీశారు.

శ్రీరామమూర్తిపై కవిత్వానిదెప్పుడూ పై చెయ్యే. ఆయన మూడ్‌ని దట్టంగా ఆవరిస్తుంది. అందుకే 'విత్తనాలక్కర్లేని మనసు పొలం/ ఎల్లకాలం పండే ఆలోచనల క్షేత్రం, నిద్రలోనూ మేల్కొనేదే కన్ను/ చూపు దుప్పటి కప్పుకొని పడుకుంటుంది' అని తన కవిత్వ చేతనను చెప్పుకోగలిగారు. కవిత్వంతో ఆయనది యాభై ఏండ్ల అనుబంధం. ఆయనలో భావుకతకు కొదువే లేదు. ముదిమిలో అది మరింత చిగురులు వేస్తోంది. 'తీగకు, గోటికి లేని తీపి/ మీటే రాగానికి పూస్తుంది ఎలా/ ఇదే నిజమయ్యే అపురూప కల' అని

శ్రీరామమూర్తి ఆలోచనల్లో నవ్యత ఎప్పుడు కదలాడుతుంది. చెప్పే విషయంలోనైనా, చెప్పే విధానంలోనైనా తనకంటూ ఓ బాట ఉంది. అందుకే 'అవే కిరణాలు మళ్లీ మళ్లీనా?/ అయితే అది ఉషోదయమెలా అవుతుంది?' అని కొత్త ప్రశ్నలు వేస్తారు. సామాజిక విమర్శలో కవి కలం సదా సంసిద్ధమే. 'కుక్క కరిస్తే మందు ఉంటుంది/ మతం కరిస్తే ఉండదు', 'మనువాడిన నాడే/ భవిత చూసుకోవలసింది/ బౌద్ధాన్ని విడనాడిన/ దుర్బుద్ధుల భారతం' లాంటి కవితలు అందుకు సాక్ష్యం. చివరగా తానేంటో తెలిపేలా 'నేను ప్రేక్షకుడనే కానీ/ వేదికుడను కాను/ నా మూలాలు కప్పిపెట్టి/ నటించలేను' అంటారు. స్థూలంగా నిజం కవిత్వానికి ఆయన రాసిన ఈ కవితనే ఉదహరించవచ్చు.

అక్షరాల కూర్పుతో ఏర్పడ్డ వాక్యంలో రసాత్మకత ప్రధాన లక్షణం అంటారు. అయితే వాక్యం జనాత్మకం కూడా కావ్యమే అని ఈ కవి కొత్తగా చెప్పారు. ఎంత రస గుళికలైనా జనం ప్రమేయం లేని కళలకు ప్రయోజనం శూన్యమే అనే అర్థం ఇందులో గోచరిస్తున్నది. నిజం కవిత్వంలో రసాత్మకత ఉంది, జనాత్మకతా ఉంది.



బి.నర్సన్
94401 28169



ట్రోలింగ్

ఆమె అంతరంగపు
భావాల మువ్వల సవ్వడి
నిశ్శబ్దపు సమాధయ్యింది
కలలు ఆశలు ఆటలు
అందులోనే దాచుకున్నాయి
ఆలోచనలు ఆదర్శాలు
అందులోనే
దోబూచులాడుతున్నాయి

ఆమె ఆధునికతపు
ఉద్వేగాల గాజుల
సందడి సాంప్రదాయ
నిశీధిలో నిర్జీవమయ్యింది
చుట్టూ హద్దులు
అలుముకున్నాయి
గుండె సంద్రంలో కన్నీటి
వర్షాన్ని ఆశ్రయిస్తున్నాయి


అంతరిక్ష శోధనలో
ఆమె రాకెట్‌లా దూసుకెళ్తుంది
చిరునవ్వు దరహాసంలో
ఆమె చుట్టూ ఎవ్వరికీ కనిపించని
అనంత శూన్యం
ఆవరించి ఉంది
కేరింగ్ లేని ఈ సమాజంలో
ట్రోలింగ్‌తో నిత్య
యుద్ధం చేస్తుంది
ఆమెకు ఎన్ని సమస్యలున్నా
'అతడే' ఆమెకు సమస్య అయినా
ఎందుకో ఆమె అడుగు
ఆపడం లేదు
స్వేచ్ఛగా ధైర్యంతో
ముందడుగే వేస్తుంది

(ఆడవారిపై జరిగే ట్రోలింగ్‌కు వ్యతిరేకంగా..)



ఫిజిక్స్
అరుణ్‌కుమార్
95947 49536

వీలునామా..!



నేను చచ్చాక
లోకమేదో ఇప్పటికే అంతమ
వుతున్నట్టు
అనవసరపు కంఠశోకాలు,
పెడబొబ్బలు పెట్టకండి
నాకసలే అరుపులంటే చికాకు
లేని కీర్తిని ఆపాదించి కీర్తిని
మాత్రమే చెప్పకండి
నేనన్న నాలుగు మాటలేవన్న
మంచివనుకుంటే వాటిని
తలుచుకోండి చాలు

నా శవంపై పూలు గట్రా పెట్ట
కండి
ఎట్లాగూ నే చచ్చాను అనవసరంగా సుకుమారమైన
పూల ప్రాణం తీయడం నచ్చదు నాకు
వాటికవే రాలేదాక పూయనీయండి అదే నాకు
నివాళి

నేనెట్లాగు కొండెక్కిన దీపాన్నే
నా తలాపున దీపాన్నేమీ ముట్టించకండి
అనవసరంగా నూనెను వృథా చేయకండి
ఆ మాత్రపు నూనె దొరుకని తల్లులెందరో
కన్నపిల్లల ముందు పెట్టుకుని ఆకలితో కన్నీరు కారు
స్తున్నారు

అగరుబత్తులు గట్రా వెలిగించకండి
బతికున్నపుడెట్లాగు నేను స్వచ్ఛమైన గాలిని పీల్చ
లేదు
నా శవాన్ని చూడ్డానికి వచ్చినవాళ్లు
అగరుబత్తుల పొగకు ఊపిరాడక ముక్కు మూసు
కుంటే
నేను తట్టుకోలేను...
వారికైనా కాసింత హాయిగా గాలి పీల్చుకోనివ్వండి

భూమిపై ఇప్పటికే కాలుష్యం మితిమీరిపోయింది
అనవసరంగా డప్పులు డీజేలు పెట్టి, బాంబులు
కాల్చి
సచ్చాక కూడా నన్ను భవిష్యత్తుతరాలు
నిందించుకునేలా చేయకండి
అయినా బాంబులంటే నాకు సచ్చేంత భయం
ప్రశాంతంగా నాతో ఉన్న జ్ఞాపకాలు నెమరేస్తూ నడ
వండి
మీ ఆరోగ్యాలకు కూడా మంచిది

నన్ను కాలబెట్టడమో, బొంద పెట్టడమో చేయకండి
ప్రయోగాలంటే పడి సచ్చేవాన్ని...
కనీసం సచ్చాక అయినా నా కుతి తీరనివ్వండి
నా శవమేమన్న పనికొస్తే ప్రయోగార్థులకివ్వండి
పుట్టినందుకు అందుకైనా పనికొచ్చానన్న తృప్తి
అయినా మిగులుద్ది నాకు

అట్లా వీలుకాకుంటే
నన్ను తొందరగా బూడిద
చెయ్యండి
అక్కడే రెండో మూడో చెట్లు
నాటండి
నా శవం ప్రకృతికి చేసిన
హానికి పరిహారంగా
అమ్మ కడుపు నుంచి ఏ ఆడం
బరం లేకుండా
ఎట్లయితే బయటకొచ్చానో
అట్లాగే ఏ ఆడంబరం లేకుం
డానే
నేల తల్లి గర్భాన కలిసిపోని
వ్వండి నన్ను

నా పోటువా చుట్టూ పండ్లు ఫలహారాలు పెట్టీ
మంది ముందు నన్ను తిండిబోతును చేయకండి
బతకడానికి నాలుగు మెతుకులు
కడుపులో పడితే చాలనుకునేవాన్ని
కాకపోతే...
ఆకలంటూ ఇంటిముందరికి ఎవరన్నా వస్తే...
లేదనకుండా ఏదుంటే అది పెట్టండి వాళ్లకు
వారి ఆకలిలో నన్ను చూసుకోండి

మిత్రులారా...
ఈర్ష్యాసూయలతో మకిలి మనుషులున్న సమాజంలో
నన్ను నన్నుగా అర్థం చేసుకున్న మీ సహచర్యమే
నన్నింతకాలం కాసింతైన హాయిగా జీవించేలా చేసింది
నాకున్న లోటేదైనా ఉందంటే... అది
నన్ను ప్రేమిస్తున్న వారితో, నేను ప్రేమిస్తున్న వారితో
ఇంకొన్ని రోజులు గడపలేకపోయాననే
నన్నెపుడన్న తలుసుకోవాలని మీకనిపిస్తే
ఆపదలో ఉన్నవారికి మీకు చేతనైనంత అండనివ్వండి
వారి ముఖం మీది నవ్వులలో నేను కనిపిస్తాను

మళ్లీ ఏ ఆలోచన నన్ను
అటకాయిస్తదోనని తొందర తొందరగా
నాకు నేనే ఈ వీలునామా ప్రశాంతంగా రాసుకున్న
బంధాలు బంధనాలు, కంపు కంపు నిబంధనల పేర
బతికినన్నాళ్లు ఎట్లాగూ నన్ను నా
ఆలోచనలతో బతుకనివ్వలేదు
కనీసం సావులోనైన నా ఆలోచనలతో
హాయిగా అంతర్ధానం అవుదామనే...



దిలీప్.వి
84640 30808







కరీంనగర్ జిల్లా చొప్పదండిలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్. రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు

హైదరాబాద్‌ను యూటీ చేసే కుట్ర!

కేంద్రపాలిత ప్రాంతంగా మార్చే ప్రమాదం

- పార్లమెంట్‌లో బీఆర్ఎస్ లేకుంటే రాజధాని లేకుండా చేస్తరు
- ఉమ్మడి రాజధాని గడువు తీరితే రాష్ట్రానికి అన్యాయం ఖాయం
- నదుల అనుసంధానం పేరిట తెలంగాణను ఎండబెడుతరు
- పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిథ్యం లేకుండా చేస్తరు
- ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తీసేస్తరు.. రాజ్యాంగాన్ని మార్చేస్తరు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరీంనగర్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు బలమైన ప్రాతినిధ్యం లేకుంటే బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలు హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటిస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం వేములవాడ, మానకొండూర్, కరీంనగర్ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాల్లో, చొప్పదండిలో రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ప్రసంగించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎందుకు ఉండాలనే దానిపై స్పష్టత ఇచ్చారు. వచ్చే జూన్ 2 నాటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు నిండుతాయని, అప్పటి వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు తీరుతుందని గుర్తుచేశారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయటానికి కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. అలా జరగొద్దు అనుకుంటే.. బీఆర్ఎస్‌కు పార్లమెంట్‌లో గట్టి బలం ఉండాలని కేటీఆర్ స్పష్టం చేశారు. అంతే కాకుండా ఓట్ల కోసం మన అవసరాలు తీరకుండానే గోదావరి జలాలను తమిళనాడు, కర్ణాటకకు తరలించేలా కావేరి నదితో అనుసంధానం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణలో ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వని బీజేపీ.. తెలంగాణను ఎండబెట్టి ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లాలని చూస్తున్నదని చెప్పారు. 2026లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను పునర్విభజన చేస్తుందని, కొన్ని కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారని, ఆ సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా ఎక్కువ, దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువని చెప్పి దక్షిణాదికి తక్కువ నియోజకవర్గాలు ఏర్పాటు చేసే ప్రమాదం ఉన్నదని, అందుకే పార్లమెంట్‌లో కొట్లాడేందుకు బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని తెలిపారు. తమకు మూడింట రెండో వంతు మెజార్టీ ఇస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని, రాజ్యాంగాన్ని మార్చేస్తామని చెప్తున్నారని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని వెల్లడించారు. బీజేపీకి ఓటు వేస్తే వ్యవసాయ బావుల కాడ మోటర్లకు మీటర్లు పెట్టుడు పక్కా అని తెలిపారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు ఆపారని, రేవంత్‌రెడ్డికి అంత దమ్ము లేదని స్పష్టం చేశారు. ఆయన మీద కేసులు ఉన్నాయని, మోదీ బెదిరిస్తే భయపడతాడని ఎద్దేవా చేశారు.

బడేభాయ్, చోటాభాయ్ కలిసి రాష్ట్రానికి మోసం

2014లో బడేభాయ్ నరేంద్రమోదీ మోసం చేస్తే, 2023లో చోటాభాయ్ రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను మరింత మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. జనధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ చెప్పారని, పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా? అన్ని ప్రశ్నించారు. చోటాభాయ్ రేవంత్‌రెడ్డి కూడా అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నిలబెట్టుకోలేని బీజేపీ, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. ప్రధాని మోదీ పేద, మధ్య తరగతి ప్రజలను వంచించారని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ మీద ప్రత్యేక సుంకం వసూలు చేసి, టోల్ ట్యాక్స్ ఎందుకు వసూలు చేస్తున్నారని మోదీని ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో హిందూ, ముస్లిం అనే విషాన్ని ప్రజల్లో నింపారని ధ్వజమెత్తారు. 'ఉంటే నా జేబులో ఉండు.. లేదంటే జైల్లో ఉండు' అన్న చందంగా మోదీ పాలన సాగుతున్నదని ఆరోపించారు. ఈ విధానాలు నచ్చని కేసీఆర్ గట్టిగా కొట్లాడితే ఆయన బిడ్డను తీసుకెళ్లి జైల్లో పెట్టారని, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను జైలుకు పంపించారని గుర్తుచేశారు. మమతా బెనర్జీ, స్టాలిన్‌పైనా కేసులు పెట్టారని వెల్లడించారు.

మోదీకి ఓటెందుకేయాలి?

తెలంగాణ పుట్టుకను అవమానించిన ప్రధాని మోదీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ఎందుకు వేయాలి? అని కేటీఆర్ ప్రశ్నించారు. మనల్ని అడగకుండానే భద్రాద్రిలో ఐదు మండలాలను ఆంధ్రాలో కలిపేశారని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, సిరిసిల్ల టెక్స్‌టైల్ క్లస్టర్లు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీలో ఏ హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు ఉన్న ఐటీఐఆర్‌ని కూడా ఎత్తివేసిందని తెలిపారు. శ్రీరాముడు అందరివాడని, ఎమ్మెల్యే, ఎంపీ కాదని, మంచిపని చేసేవాళ్లకే అధికారం ఇవ్వాలని ఆయన చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. బండి సంజయ్ వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట సీతారామస్వామి, సిరిసిల్ల మార్కండేయ ఆలయాలకు ఒక్క రూపాయైనా కేంద్రం నుంచి తెచ్చారా? అని ప్రశ్నించారు. వినోద్‌కుమార్ లాంటి వ్యక్తి పార్లమెంట్‌లో ఉంటేనే కాంగ్రెస్, బీజేపీతో కొట్లాడుతారని స్పష్టం చేశారు. పార్లమెంట్ పరిధిలో ఏ ఊరిలోనైనా బండి వేసిన శిలాఫలకం ఉన్నదా? అని ప్రశ్నించారు. అల్గునూర్‌లోని లక్ష్మీనరసింహ గార్డెన్‌లో ఒకవైపు బండి, మరో వైపు వినోద్‌కుమార్‌ను నిలబెట్టి కరీంనగర్ నియోజకవర్గానికి ఎవరు ఏం చేశారో చెప్పిద్దామన్నారు. వారు చెప్పిన విషయాలను బట్టి ప్రజలను తీర్పు అడుగుదామన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్, బీజేపీది మ్యాచ్ ఫిక్సింగ్ అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద కండువా తీసి నిలబెడితే ఆ పార్టీ కార్యకర్తలు కూడా గుర్తుపట్టలేరని ఎద్దేవా చేశారు. నిజానికి కరీంనగర్‌లో జీవన్‌రెడ్డి లేదా ప్రవీణ్‌రెడ్డి వంటి నాయకులు పోటీ చేయాల్సి ఉండేదని, వీరిద్దరైతే గట్టిపోటీ ఇస్తారని సీఎం రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ కలిసి డమ్మీ అభ్యర్థిని ఎంపిక చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డివి చిల్లర మాటలు, ఉద్దెర పనులు అని విమర్శించారు.

బీఆర్ఎస్‌కే ప్రజా బలం

రాష్ట్రంలో ప్రజా బలం బీఆర్ఎస్‌కే ఉన్నదని, పార్లమెంట్ ఎన్నికల్లో 12 సీట్లు గెలుచుకుంటే ఏడాది కాలంలో కేసీఆర్ దేశరాజకీయాలను శాసించే స్థాయికి వస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు అన్ని వర్గాల ప్రజలు అనుకూలంగా ఉన్నారని, ఇప్పుడు మనం గట్టి పునాది వేసుకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు మంచి అవకాశం ఉంటుందని అన్నారు. జూన్ 4 తర్వాత గెలిచిన ఎంపీలు.. ఎమ్మెల్యేలు లేని చోట ఎమ్మెల్యేగా పని చేస్తారని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటారని స్పష్టం చేశారు.

70 ఏండ్ల వయసులోనూ కష్టపడుతున్న కేసీఆర్

70 ఏండ్ల వయసులో, తొంటి ఎముక విరిగినా.. పార్టీ అధినేత కేసీఆర్ బస్సుయాత్రతో ప్రజల వద్దకు వచ్చి ప్రచారం చేస్తూ కష్టపడుతున్నారని కేటీఆర్ తెలిపారు. 12 బీఆర్ఎస్ సీట్లు గెలిపిస్తే రాష్ట్ర రాజకీయాలను శాసించే రోజు ఏడాదిలోపే వస్తుందని కార్యకర్తలకు ధైర్యాన్ని నింపారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవి శంకర్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్ రావు, భానుప్రసాద్‌రావు, మేయర్ సునీల్ రావు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జీవీ రామకృష్ణారావు, తోట ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎండాకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	45.5°c	32.8°c
ఆదిలాబాద్	44.8°c	26.2°c
ఖమ్మం	44.0°c	28.0°c
మెదక్	43.5°c	23.5°c
నిజామాబాద్	43.0°c	30.4°c
రంగారెడ్డి	42.9°c	21.3°c
మహబూబ్‌నగర్	42.7°c	30.2°c
కరీంనగర్	42.0°c	28.0°c
వరంగల్	42.0°c	28.0°c
హైదరాబాద్	41.8°c	28.7°c

నిప్పుల కుంపటిలా రాష్ట్రం

- 6 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఎండలు
- అన్ని జిల్లాలూ ఆరెంజ్ జోన్‌లోనే
- 15 మండలాలు రెడ్ జోన్‌లోనే
- అప్రమత్తంగా ఉండాలన్న నిపుణులు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భానుడి ప్రతాపం బెంబేలెత్తిస్తున్నది. ఎన్నికల వేళ రాజకీయ పార్టీల పోటాపోటీ ప్రచార హోరుతో కళకళలాడాల్సిన రాష్ట్రం.. సూర్యుడి ప్రకోపానికి మధ్యాహ్నం పూట దాదాపు నిర్మానుష్యంగా మారుతున్నది. 42-45 డిగ్రీ సెంటిగ్రేడ్ మధ్య నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాష్ట్రం ఇప్పుడు నిప్పుల పెనంగా మారింది. వేడిగాలులు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వాతావరణశాఖ ఆదివారం సాయంత్రం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో ఏకంగా ఆరు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటిపోయాయి. 'రెడ్ జోన్'లో చేరిపోయాయి. అంటే వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నదన్నమాట. అత్యధికంగా నల్లగొండ జిల్లా మాడుగులపల్లిలో 45.4 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో 45.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ములుగు జిల్లా మంగపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపాలగూరి, వనపర్తి జిల్లా పాన్గల్, జగిత్యాల జిల్లా వెల్గటూర్‌ల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోయాయి. మిగతా అన్ని జిల్లాల్లో 42.7 డిగ్రీలు, ఆపైనే నమోదయ్యాయి. దీనిని బట్టి అన్ని జిల్లాలు 'ఆరెంజ్ జోన్'లో ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా దిగ్వాల మండలంలో 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే అతితక్కువ అంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. మండలాలవారీగా చూసినప్పుడు ఏకంగా 15 మండలాలు రెడ్ జోన్‌లో ఉన్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోయాయి. ఇందులో ఆరు మండలాలు నల్లగొండ జిల్లాలోనే ఉండటం గమనార్హం. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్‌లోనూ ఎండలు దంచికొడుతున్నాయి. చార్మినార్ జోన్‌లో అత్యధికంగా 43.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గతేడాది అదే జోన్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత 33 డిగ్రీలుగా ఉండగా.. ఈ సారి ఏకంగా 10 డిగ్రీలు పెరగడం గమనార్హం.

నిరుటి కంటే 4.5 డిగ్రీలు ఎక్కువ..

నిరుడు ఏప్రిల్ 28వ తేదీకి, ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలను పోల్చి చూస్తే ఎంతో వ్యత్యాసం కనిపిస్తున్నది. గతేడాది గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.9 డిగ్రీలు మాత్రమే కావడం గమనార్హం. సూర్యాపేట జిల్లా నర్సయ్యగూడెంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయుడుపేటలో ఈ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇసారి ఏకంగా 45 డిగ్రీల వరకు పెరిగాయి. గతేడాది అతితక్కువగా జగిత్యాల జిల్లాలో 33.2 డిగ్రీలు నమోదైంది.

మధ్యాహ్నం బయటికి రావొద్దు..

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప బయటికి రావొద్దని సూచిస్తున్నారు. డీహైడ్రేషన్ ముప్పు పొంచి ఉన్నందున తరచూ నీళ్లు తాగాలని, ఓఆర్ఎస్ తీసుకోవాలని కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని దవాఖానల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, అవసరం ఉన్నవారు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

నేతన్నల ఆత్మహత్యలు కాంగ్రెస్ హత్యలే

- వాటికి రేవంత్ సర్కారే బాధ్యత వహించాలి
- పేరుకపోయిన వస్త్రాలను కొనుగోలు చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ డిమాండ్



హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జరుగుతున్న నేతన్నల ఆత్మహత్యలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ స్పష్టం చేశారు. వాటికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నేతన్నల ఆత్మహత్యలు మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. గత డిసెంబర్ నుంచి పది వేల కుటుంబాలకు పని లేకుండా పోయిందని చెప్పారు. నేతన్నల వద్ద పేరుకపోయిన వస్త్రాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేత ఎంఎన్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగం టెక్స్‌టైల్ అని తెలిపారు. చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడానికి రేవంత్ సర్కార్ కారణమని ఆరోపించారు. ఎమ్మెల్సీగా తాను రాష్ట్ర మంత్రి తుమ్మల దృష్టికి చేనేతల సమస్య తీసుకెళ్లానని, తమ సూచనలు పట్టించుకొని ప్రభుత్వం స్పందించి ఉంటే నేతన్న ఆత్మహత్యలు జరిగేవి కావన్నారు. నేతన్నలకు వర్క్ ఆర్డర్ పెంచాలని, బకాయిలు చెల్లించాలని, కేసీఆర్ హయాంలో ప్రకటించిన పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ ఎత్తివేస్తామని భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నలు ఆత్మస్థైర్యంతో ఉండేలా బతుకమ్మ, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చిందని గుర్తుచేశారు. చేనేతలకు నెలకు రూ.2 వేలు, అనుబంధ పనులు చేసే వారికి మరో రూ.1000 పింఛన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. నేతన్న బీమా పథకం ద్వారా చేనేతల కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం చేశారని తెలిపారు.

పోలింగ్ సమయంపైనా వివక్షే!

- ఇతర రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- తెలంగాణలో 5 గంటలకే ముగించాలట!
- మండుటెండలోనే ఓటెయ్యాలట!
- ఈసీ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరాలు
- ఇప్పటికే నిప్పుల కొలిమిలా రాష్ట్రం
- ఆందోళనలో అభ్యర్థులు, పార్టీలు



హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఇప్పటికే తెలంగాణ నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి దడపుట్టిస్తున్నాయి. వచ్చేది అసలే మే నెల!. ఎండలు ఎట్లుంటయో ఊహించుకుంటేనే వెన్నులో వణుకు పుడుతున్నది. ఈ తరుణంలో ఎండలు మండే మే నెల మధ్యలో జరిగే లోక్‌సభ పోలింగ్ కోసం ప్రజలకు వెసులుబాటు ఇవ్వాల్సింది పోయి, తెలంగాణపై కేంద్ర ఎన్నికల సంఘం వివక్ష చూపుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల దాకా పోలింగ్ సమయం ఇవ్వగా, తెలంగాణలో మాత్రం మే 13న సాయంత్రం 5 గంటల వరకే సమయమిచ్చింది. మిట్టమధ్యాహ్నం పోలింగ్ మందకొడిగా ఉంటుందని, సాయంత్రం సమయం కేటాయిస్తేనే ఓటర్లు కేంద్రాలకు వస్తారని, ఈసీ నిర్ణయంతో రాష్ట్రంలో ఓటింగ్ శాతం తగ్గే ప్రమాదముందని అటు రాజకీయ పార్టీలు, ఇటు అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. అన్ని రాష్ట్రాల మాదిరిగా ఇక్కడా సాయంత్రం 6 గంటల వరకు సమయం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నది.

ఇప్పటికే రెడ్ అలర్ట్

రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఇప్పటికే వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ బయటకు రావొద్దని స్పష్టంగా చెబుతున్నది. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నం వరకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఏప్రిల్‌లోనే ఇంత తీవ్రత ఉంటే మేలో ఎలా ఉంటుందోననే ఆందోళన రాజకీయ పార్టీలు, అభ్యర్థుల్లో నెలకొన్నది. ఉదయం ప్రచారానికి ప్రజలు ముందుకురాకపోవడం వల్లే సాయంత్రం వేళ నిర్వహిస్తున్నామని, ఇక పగలు జరిగే పోలింగ్‌కు ఓటర్లు ఎలా వస్తారని ప్రశ్నిస్తున్నారు. ఓటర్లకు సహకరించి పోలింగ్ శాతాన్ని పెంచాల్సిన ఎన్నికల సంఘం, ఇలాంటి నిర్ణయం తీసుకోవడం తెలంగాణపై వివక్షేనని ఆరోపిస్తున్నారు.

అసలే పట్టణవాసులు!

తెలంగాణలో పట్టణ ప్రాంతాలు ఎక్కువ. ఇక్కడి పట్టణవాసులు ఓటేసేందుకు ముందుకురారనే అపవాదు కూడా ఉంది. ఇక మిట్ట మధ్యాహ్నం పట్టణాల్లో పోలింగ్ సరళి ఎలా ఉంటుందో చెప్పనవసరం లేదు. దేశంలో 2019లో 50 శాతం కంటే తక్కువ పోలింగ్ నమోదైన పార్లమెంట్ నియోజకవర్గాలు చూస్తే మన రాష్ట్రం నుంచే నాలుగు హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల ఉన్నాయి.

ఇక్కడా సమయం పెంచాల్సిందే

సాయంత్రం 5 గంటలు దాటితేగాని, కొంత ఎండ తీవ్రత తగ్గడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో 5 గంటల వరకే సమయం ఇస్తే ఓటేసేందుకు ప్రజలు ఆసక్తి చూపరని, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాల్సిన వారు అసలే ముందుకురారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఈసీ పునఃసమీక్షించుకొని మిగతా రాష్ట్రాల్లానే తెలంగాణలోనూ ఆరు గంటల వరకు ఓటేసేందుకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

నక్సల్స్ ప్రభావమున్న ఛత్తీస్‌గఢ్‌లోనూ సాయంత్రం 6 వరకు

దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ గుర్తింపు పొందింది. అలాంటి ప్రాంతంలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌కు సమయం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ 6 గంటల వరకు అనుమతినిచ్చారు. తెలంగాణ చుట్టు పక్కల అన్ని రాష్ట్రాల్లోనూ 6 గంటల వరకు సమయాన్నిచ్చి తెలంగాణలో 5 గంటలకే ముగించాలనడంపై పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

బీఆర్ఎస్సే తెలంగాణకు శ్రీరామరక్ష

- లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీనే గెలిపించండి
- బ్రిటన్‌లో బీఆర్ఎస్ ఎన్నారై యూకే విభాగం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణ ప్రయోజనాలకు శ్రీరామరక్ష అని బ్రిటన్‌లోని బీఆర్ఎస్ ఎన్నారై యూకే విభాగం నాయకులు పేర్కొన్నారు. మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. లండన్‌లోని రీడింగ్ పట్టణంలో బీఆర్ఎస్ ఎన్నారై యూకే కార్యాలయంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. పార్టీ రీడింగ్ పట్టణ ఇన్‌చార్జి, బీఆర్ఎస్ ఎన్నారై యూకే విభాగం కార్యదర్శి మల్లారెడ్డి బీరం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ విభాగం ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో మొదటిసారి ఖండాంతరాల్లో లండన్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేశామని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యమే రాష్ట్రానికి ప్రయోజనం అని ఆనాడు తాము విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పుడూ, ఇప్పుడూ తెలంగాణ ప్రయోజనాల కోసం కట్టుబడి చిత్తశుద్ధితో పోరాటం చేసే సత్తా బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు మాత్రమే ఉన్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ గెలుపు.. ప్రజల గెలుపే అవుతుందని చెప్పారు. కేసీఆర్ నాయత్వానికి బలం ఇస్తేనే తెలంగాణకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్నారై యూకే విభాగం ప్రధాన కార్యదర్శి రత్నాకర్ కడుదుల, అడ్వైజరీ బోర్డు సభ్యులు దొంతుల వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధులు హరిగౌడ్ నవాబుపేట్, రవికుమార్ రత్తినేని, రవిప్రదీప్ పులుసు, సురేశ్ బుడగం, సత్య చిలుముల, సతీశ్‌రెడ్డి బండ, సత్యపాల్‌రెడ్డి పింగిళి, శ్రీకాంత్ జెల్ల, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- ఎన్నారై బహ్రెయిన్ శాఖ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ ఎన్నారై బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రాధారపు సతీశ్‌కుమార్ అధ్యక్షతన బహ్రెయిన్‌లోని అండాలస్ గార్డెన్‌లో కార్యవర్గసభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో పదేండ్లు కరువులేదని, జలాశయాలు నిండుగా ఉన్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్‌పాలనలో నాలుగు నెలలకే కరువును చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు తెస్తామంటే నమ్మి అధికారం అప్పగిస్తే పాలన చేతగాక కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు రాష్ట్ర సమస్యలపై ఏనాడూ కేంద్రాన్ని నిలదీసిన పాపాన పోలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ సర్కార్ ప్రజలను మోసం మోసగించిందని ధ్వజమెత్తారు. సమావేశంలో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి పుప్పాల బద్రి, అన్నారం సుమన్, కార్యదర్శులు చెన్నమనేని రాజేందర్, బొలిశెట్టి ప్రమోద్, చిలుకూరి రాజలింగం, మరుపాక దేవయ్య, తిప్పారవేణి శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్, కొందరి రాజేందర్, పెనుగొండ శ్రీకాంత్, కోటగిరి శ్రీనివాస్, స్వామి ఉన్నారు.

పాక్ ఉప ప్రధానిగా ఇషాక్ దార్ నియామకం

ఇస్లామాబాద్: పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ (73) ఆదివారం ఆ దేశ ఉప ప్రధానమంత్రిగా నియమితులయ్యారు. ఆయన ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ పార్టీ పీఎంఎల్ -ఎన్‌కు చెందిన నేత. ఆయనను షరీఫ్ ఉప ప్రధానిగా నియమించినట్లు కేబినెట్ డివిజన్ విడుదల చేసిన నోటిఫికేషన్ తెలిపింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని, తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు కొనసాగుతాయని వివరించింది. షరీఫ్, దార్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నారు. ప్రధాని షరీఫ్ సోదరుడు నవాజ్ షరీఫ్ కుమార్తెను దార్ కుమారునికి ఇచ్చి వివాహం చేశారు. దీంతో ఈ రెండు కుటుంబాల మధ్య బంధుత్వం ఉంది. ఆర్థిక మంత్రిగా దార్‌కు ఆయన పార్టీలో మంచి పేరు ఉంది. అయినప్పటికీ షెహబాజ్ షరీఫ్ ఈసారి ఆయనకు విదేశాంగ శాఖను అప్పగించడం అందరినీ ఆశ్చర్యపరచింది.

రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం

- తెలంగాణలో మా పార్టీని అడ్డుకున్నది కేసీఆరే
- మమ్మల్ని ఆపడం కాంగ్రెస్‌తో అయ్యేపనికాదు
- బీజేపీ ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

నిజామాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ వేల్పూర్: సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో తమ పార్టీలో చేరడం ఖాయమని బీజేపీ ఎంపీ అర్వింద్ మరోమారు స్పష్టం చేశారు. ఏబీవీపీ నుంచి వచ్చిన రేవంత్ రేపోమాపో బీజేపీలో చేరిపోతారని పుకార్లు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే చాలాచోట్ల కాంగ్రెస్ నుంచి డమ్మీ అభ్యర్థులను నిలబెట్టినట్టు తెలుస్తున్నదని చెప్పారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన బీజేవైఎం కార్యకర్తల సమావేశంలో అర్వింద్‌పై వ్యాఖ్యలు చేశారు. దేశం మొత్తం మీద కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతున్నదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కూడా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను ఖాళీ చేసి బీజేపీలోకి వస్తారని స్పష్టం చేశారు. పరోక్షంగా రేవంత్‌రెడ్డి బీజేపీకే మద్దతు పలుకుతున్నారని ప్రకటించారు. అలాంటప్పుడు ఇంతటి ఎండలో ఎన్నికలెందుకని ప్రశ్నించారు. బీజేపీని నియంత్రించడం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే సాధ్యమైందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలం పెరగకుండా కేసీఆర్ మాత్రమే కంట్రోల్ చేశారని, కాంగ్రెస్ వాళ్లు ఎక్కడా బీజేపీని అడ్డుకోలేకపోయారని తెలిపారు. ఎన్నారైల మీద కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఎక్కడాలేని ప్రేమ పుట్టుకొచ్చిందని, 45 ఏండ్ల రాజకీయ జీవితంలో ఆయన ఒక్కసారి కూడా ఎన్నారైల గురించి మాట్లాడలేదని మండిపడ్డారు. అలాంటి వ్యక్తి రాష్ట్ర ప్రభుత్వంతో ఎన్నారైల సంక్షేమ బోర్డును పెట్టిస్తానని అంటున్నాడని విమర్శించారు. చక్కెర ఫ్యాక్టరీలు జీవన్‌రెడ్డి కారణంగానే మూతపడ్డాయని, లోక్‌సభ ఎన్నికల్లో ఆయన్ను గెలిపిస్తే వాటిని తెరిపిస్తామంటున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నారైల సంక్షేమ బోర్డు, ఫ్యాక్టరీల పునరుద్ధరణ అంశాలు రాష్ట్ర పరిధిలోనివని, వాటికి లోక్‌సభ ఎన్నికలతో సంబంధమేంటని ప్రశ్నించారు. జిల్లాకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెచ్చి, జక్రాన్‌పల్లి వద్ద ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయించి కనీసం పదివేల మంది ఎన్నారైలను వాపస్ తీసుకురాకపోతే తన పేరు మార్చుకుంటానని, ఈసారి ఇదే తన బాండ్ పేపర్ అని అర్వింద్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత

బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి




హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ తీసుకొస్తామని చెప్పిన మార్పు మసక బారుతున్నదని బీఆర్ఎస్ నేత పీ కార్తీక్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ సమాజం ఎవరినైనా తొందరగా నమ్ముతుందని, అదే సమయంలో తమని మోసం చేసిన వారిని గుర్తుపెట్టుకుంటుందని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్వీ నాయకుడు దశరథ్‌తో కలిసి కార్తీక్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో రాజకీయం పూర్తిగా మారిపోయిందని, ఏ ప్రభుత్వానికీ రాని వ్యతిరేకత కాంగ్రెస్ ప్రభుత్వంపై అతి తక్కువ సమయంలో వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలు గ్రహించారని, ఆరు గ్యారెంటీల్లో ఒక్క దానిని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సాగు, తాగునీరు, కరెంటు కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారని చెప్పారు. కేసీఆర్ పాలనకు, రేవంత్‌రెడ్డి పాలనకు తేడాను ప్రజలు గమనించారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం తలకెక్కిందా? అని ప్రముఖ జర్నలిస్ట్ బర్కాదత్ ట్వీట్ చేశారని గుర్తుచేశారు. సీఎం సెక్యూరిటీ సిబ్బంది తనను ఎలా నెట్టివేసిందీ ఆమె చెప్పారని పేర్కొన్నారు. ఇంత తక్కువ వ్యవధిలోనే ఎంత మార్పు అని ఆమె ఆ పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల సెగ కాంగ్రెస్ పార్టీకి తగలబోతున్నదని, దానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల అహంకారం తగ్గించేందుకు ఎన్నికల రూపంలో ప్రజలకు ఓ అవకాశం ఉన్నదని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ స్థానాల్లో గెలిస్తే ప్రజలను పట్టించుకోదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎండలు పెరుగుతున్నట్టే కాంగ్రెస్ మీద ప్రజల్లో వ్యతిరేకత కూడా పెరుగుతున్నదని తెలిపారు.

తొలి రెండు దశల్లో..
మహిళా అభ్యర్థులు 8 శాతమే

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల తొలి రెండు దశల్లో 2,823 మంది అభ్యర్థులు పోటీ పడగా, ఇందులో మహిళా అభ్యర్థులు 235 మంది(8 శాతం) మాత్రమే. మొదటి దశలో 135 మంది మహిళలు పోటీపడగా, తమిళనాడు నుంచి అత్యధికంగా 76 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక రెండో దశలో పోటీకి నిలబడ్డ మహిళా అభ్యర్థులు 100 మంది కాగా, అత్యధికంగా కేరళ నుంచి 24 మంది ఉన్నారు. మరింత మంది మహిళా అభ్యర్థులకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వాల్సిందని ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ సుశీలా రామస్వామి అన్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చే వరకు పార్టీలు ఎందుకు వేచి చూస్తున్నాయి? అని సామాజిక కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.



తగ్గిన పోలింగ్.. కమలం కలవరం



మొదటిపేజీ తరువాయి...

ఉన్నట్టు కనిపిస్తున్నది.

ఓటింగ్ సరళితో బీజేపీలో కలవరం

దేశంలో మోదీ వేవ్ ఉన్నట్టు బీజేపీ కొంతకాలంగా ప్రచారం చేసుకుంటున్నది. ఏ ఎన్నికల్లో అయినా వేవ్ ఉంటే ఓటింగ్ పెరుగుతుంది. అయితే, 2014, 2019 సార్వత్రిక ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్ శాతం తగ్గింది. 2019లో ఈ 88 సీట్లలోని 85 సీట్లలో 69.64 శాతం పోలింగ్ జరగగా ఈసారి 63.5 శాతం మాత్రమే నమోదైంది. ఓటింగ్ శాతం తగ్గడం ఒక అంశమైతే.. బీజేపీకి పట్టున్న ఉత్తరప్రదేశ్, బీహార్ లాంటి రాష్ట్రాల్లో మరింత తగ్గడం ఆ పార్టీని కలవరపాటుకు గురి చేసే అంశం. రెండో విడతలో యూపీలోని 8 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కేవలం 54.85 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. ఇవే స్థానాలకు 2019లో 62 శాతం ఓటింగ్ జరిగింది. బీజేపీ కచ్చితంగా గెలుస్తుందని ఆ పార్టీ నేతలు చెప్తున్న మథురలో గత ఎన్నికలకు ఇప్పటికి ఓటింగ్ 12 శాతం తగ్గింది. ఘజియాబాద్‌లో 6 శాతం తగ్గింది. గత ఎన్నికల్లో ఎన్డీఏ దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసిన మహారాష్ట్రలో 59.6(2019లో 63 శాతం), బీహార్‌లో 57 శాతం(2019లో 63 శాతం), రాజస్థాన్‌లో 64.07 శాతం(2029లో 68 శాతం) నమోదైంది. మరోవైపు బీజేపీకి పెద్దగా పట్టులేని కేరళ, ఈశాన్య రాష్ట్రాల్లో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం బీజేపీ వ్యతిరేక పవనాలకు సూచిక అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

భావోద్వేగాలు పని చేయడం లేదా?

ఓటింగ్ శాతం ఎందుకు తగ్గిందనే అంశానికి సంబంధించి రాజకీయ విశ్లేషకులు పలు కారణాలను చెప్తున్నారు. ముఖ్యంగా ఓటర్లను పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరేలా చేసే భావోద్వేగ అంశాలేవీ ఈ ఎన్నికల్లో పని చేయడం లేదనేది వారి మాట. తద్వారా రామమందిర నిర్మాణం, మతపరమైన అంశాలను తెరపైకి తేవడం ద్వారా లబ్ధి పొందాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు సఫలం అవుతున్నట్టు కనిపించడం లేదంటున్నారు. గత ఎన్నికల్లో సొంతంగా 303 సీట్లు సాధించిన బీజేపీ ఈసారి 370 సాధిస్తామని చెప్తున్నది. ఇది జరగాలంటే బీజేపీకి చాలా అనుకూలత ఉండాలి. ప్రజలు ఉత్సాహంగా వచ్చి ఓటేయాలి. కానీ, ఓటర్లు ఉత్సాహంగా వచ్చి ఓటేసేందుకు సిద్ధంగా లేరని, పెరిగిన ధరలు, నిరుద్యోగం, 10 ఏండ్ల ప్రభుత్వంపై వ్యతిరేకత కూడా ఓటింగ్ తగ్గడానికి కారణం కావొచ్చని అభిప్రాయపడుతున్నారు. 102 స్థానాలకు తొలి దఫా పోలింగ్‌లోనూ గత ఎన్నికలతో పోల్చితే దాదాపు నాలుగు శాతం ఓటింగ్ తగ్గింది.

బీజేపీ సీట్ల సంఖ్యకు కోత

రెండో దశలో ఎన్నికలు జరిగిన 88 స్థానాల్లో కేరళలోని 20 స్థానాల్లో నాలుగైదు స్థానాలు మినహా ఎక్కడా బీజేపీ కనీస పోటీ ఇచ్చే స్థితిలో కూడా లేదు. ఇక, గత ఎన్నికల్లో భారీగా సీట్లు గెలిచిన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, కర్ణాటక, మహారాష్ట్రలోనూ ఈసారి బీజేపీకి ఎదురుగాలి వీస్తున్నది. రైతుల్లో వ్యతిరేకత, నిరుద్యోగ సమస్య, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి అంశాలు బీజేపీకి ప్రతికూలంగా మారవచ్చు. ఇక, గత ఎన్నికల్లో ప్రతిపక్షాల విచ్ఛిన్నం బీజేపీకి కలిసి రాగా ఈసారి ప్రతిపక్షాలు కొంతవరకు ఐక్యంగా పోరాడుతుండటం, ఎక్కడికక్కడ ప్రాంతీయ పార్టీల జోష్ కనిపిస్తుండటంతో బీజేపీ అభ్యర్థులు గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు. ఇంతకుముందు బీజేపీకి మద్దతుగా నిలిచిన రాజ్‌పుత్‌లు, జాట్లు, మరాఠాలు ఈసారి దూరమయ్యారనే అంచనాలు ఉన్నాయి. ఈ అన్ని అంశాలు కలిసి బీజేపీ విజయావకాశాలకు గండి కొడుతున్నాయనే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా రెండో దశలో ఎన్నికలు జరిగిన 88 సీట్లలో గత ఎన్నికల్లో గెలిచిన 63 సీట్ల కంటే ఈసారి లెక్క తగ్గే అవకాశముందని అంచనా.

డింకీ కొట్టుడే?


- ఎన్నికల ముందు కాంగ్రెస్ ఆర్భాటపు హామీలు
- నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసి గెలిపించిన ఓటర్లు
- అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు గాలికి
- గత లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పిన ప్రజలు
- రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ఎన్నికలే రుజువు
- 3 రాష్ట్రాల్లో 65 ఎంపీ సీట్లలో 3 స్థానాల్లోనే గెలుపు
- తెలంగాణలో అధికారంలోకి వచ్చి 5 నెలలవుతున్నా పూర్తికాని కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీమ్‌లు
- వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం: విశ్లేషకులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే పరమావధిగా గ్యారెంటీల పేరిట అలవిగాని హామీలను గుప్పిస్తారు. వీటిని నమ్మిన ఓటర్లు అధికారాన్ని కట్టబెడతారు. అయితే, ఇచ్చిన హామీల అమలులో చివరకు చేతులెత్తేస్తారు. అయితే, ప్రజలేమీ అమాయకులు కాదు కదా! తమను వంచించిన వారికి వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్తారు. ఇదేదో పొలిటికల్ సినిమా స్టోరీ కాదు. కాంగ్రెస్ పార్టీ గురించే. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లో గతంలో, ఇటీవల జరిగిన ఎన్నికలను లోతుగా విశ్లేషిస్తే అసలు తర్కం బోధపడుతుంది.

రాజస్థాన్‌లో స్కోర్ 'సున్నా'

అది నవంబర్ 2018. రాజస్థాన్‌కు అసెంబ్లీ ఎన్నికల సమయం. అధికారాన్ని చేపట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ 'జన్ ఘోష్నా పత్ర' పేరిట మ్యానిఫెస్టోలో గ్యారెంటీలను గుప్పించింది. రెండు లక్షల వరకు రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, నిరుద్యోగులకు నెలకు రూ. 3,500 భృతి, రూపాయికే కిలో గోధుమలు, పెట్రోల్-డీజిల్ ధరల తగ్గింపు, యువతకు ఉచిత విద్య, ప్రతి పంచాయతీకి ఇంటర్నెట్ సదుపాయం తదితర హామీలను ఇచ్చింది. దీంతో కాంగ్రెస్‌ను నమ్మిన ఓటర్లు అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాల్లో గెలిపించి అధికారాన్ని కట్టబెట్టారు. అయితే, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అశోక్ గెహ్లాట్ సర్కారు మాటతప్పింది. ఉచిత విద్యుత్తు మాట అటుంచితే విద్యుత్తు చార్జీలను పెంచింది. రుణమాఫీని అటకెక్కించింది. రాష్ట్రంలో 33 లక్షల మంది నిరుద్యోగులు ఉంటే కేవలం లక్ష మందికే అదీ ఒక్క నెల మాత్రమే నిరుద్యోగ భృతినిచ్చి చేతులు దులుపుకొన్నది. మిగతా హామీలను కూడా తుంగలో తొక్కింది. దీంతో మోసాన్ని గ్రహించిన ఓటర్లు.. ఆ తర్వాత ఐదు నెలల వ్యవధిలోనే 2019 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 25 ఎంపీ సీట్లలో ఒక్క స్థానంలో కూడా కాంగ్రెస్‌కు మద్దతు పలుకలేదు. దీంతో ఆ ఎన్నికల్లో హస్తంపార్టీ ఒక్క లోక్‌సభ సీటునూ గెలుచుకోలేదు. దీంతో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ మళ్లీ గ్యారెంటీల కుట్రకు తెరతీసింది. అయితే, ఈసారి హస్తం పార్టీ మోసాన్ని గుర్తించిన ఓటర్లు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి అధికారాన్ని దూరంచేశారు.


కమల్‌నాథ్, అశోక్ గెహ్లాట్, భూపేశ్ బఘేల్

ఛత్తీస్‌గఢ్‌లో ఇలా.. ఎంపీలో అలా..

2018లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ కాంగ్రెస్ పై విధంగానే హామీలను గుప్పించింది. రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఉద్యోగ కల్పన, పేదలకు ఇండ్లు ఇలా పదుల సంఖ్యలో గ్యారెంటీలను ప్రకటించింది. దీంతో ఆ ఎన్నికల్లో ఇరు రాష్ట్రాల ప్రజలు పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారు. అయితే, అధికారంలోకి వచ్చాక, ఛత్తీస్‌గఢ్‌లోని బఘేల్ ప్రభుత్వం హామీల అమలును గాలికొదిలేసింది. మధ్యప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభ నివారణకే పరిమితమైన కమల్‌నాథ్ సర్కారు ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టింది. దీంతో ఐదు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇరు రాష్ట్రాలకు కలిపి మొత్తం 40 సీట్లకు గానూ కాంగ్రెస్‌కు కేవలం మూడు సీట్లనే ఓటర్లు కట్టబెట్టారు. ఇక, 2019 లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని మొత్తం 4 ఎంపీ సీట్లలో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలువలేదు.

తెలంగాణ, కర్ణాటకలోనూ అనుమానమే!

ఐదు గ్యారెంటీల పేరిట అటు కర్ణాటకలో, ఆరు గ్యారెంటీలను ఆశగా చూపి ఇటు తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకొన్న కాంగ్రెస్.. హామీల అమలులో మాత్రం చతికిలపడింది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చి పది నెలలైనా హామీల అమలు సంపూర్ణంగా జరుగట్లేదు. ఇటు తెలంగాణలోనూ పాలనాపగ్గాలు చేపట్టి 5 నెలలు అవుతున్నా ఒక్క గ్యారెంటీ కూడా సంపూర్ణంగా నెరవేరలేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అటు హిమాచల్‌లోనూ ఇచ్చిన పది హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదు. దీంతో అధికార కాంగ్రెస్‌పై ఆయా రాష్ట్రాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీని ప్రభావం వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు ఎంపీ సీట్లు రావడం కష్టమేనని విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల సరళి

రాష్ట్రం	2018 అసెంబ్లీ ఎన్నికలు		2019 పార్లమెంట్ ఎన్నికలు		2023 అసెంబ్లీ ఎన్నికలు	
	మొత్తం సీట్లు	గెలిచినవి	మొత్తం సీట్లు	గెలిచినవి	మొత్తం సీట్లు	గెలిచినవి
రాజస్థాన్	200	100	25	0	200	70
ఛత్తీస్‌గఢ్	90	68	11	2	90	35
మధ్యప్రదేశ్	230	114	29	1	230	66

ఆప్ ఎన్నికల ప్రచార గీతంపై ఈసీ నిషేధం: ఆతిశీ

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచారం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విడుదల చేసిన పాటపై ఈసీ నిషేధం విధించిందని ఆ పార్టీ నేత, ఢిల్లీ రాష్ట్ర మంత్రి ఆతిశీ తెలిపారు. 'జైలులో పెట్టినందుకు సమాధానంగా మేము ఓటు వేస్తాం' అనే అర్థం వచ్చే హిందీ పాటను ఈసీ నిషేధించిందని చెప్పారు. బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈ పాటలో చెడుగా చూపించారని ఈసీ చెప్పిందన్నారు. ఓ పార్టీ ప్రచార పాటపై ఈసీ నిషేధం విధించడం బహుశా ఇదే తొలిసారి కావచ్చునన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఇది ఉల్లంఘించలేదని తెలిపారు.

మాయావతి మేనల్లుడిపై కేసు
బీజేపీని తాలిబన్‌తో పోల్చిన ఆకాశ్ ఆనంద్

లక్నో: బీఎస్పీ చీఫ్ మాయావతి మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌పై ఉత్తరప్రదేశ్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆకాశ్ సీతాపూర్‌లో ఆదివారం జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, 'ఇది (యూపీ ప్రభుత్వం) ద్రోహుల ప్రభుత్వం. యువతను ఆకలితో అలమటించేలా చేస్తున్న, వృద్ధులను బానిసలుగా మార్చుతున్న ఉగ్రవాద ప్రభుత్వం. ఇలాంటి ప్రభుత్వాన్ని అఫ్గానిస్థాన్‌లో తాలిబన్లు నడుపుతున్నారు' అని అన్నారు. ఆకాశ్‌తోపాటు బీఎస్పీ అభ్యర్థి మహేంద్ర యాదవ్ తదితరులపై కేసు నమోదైంది.

గుజరాత్ తీరంలో 600 కోట్ల డ్రగ్స్ పట్టివేత
పాక్ పడవ నుంచి స్వాధీనం

అహ్మదాబాద్, ఏప్రిల్ 28: గుజరాత్ తీరంలో మరోసారి పెద్ద ఎత్తున డ్రగ్స్ పట్టుబడ్డాయి. రూ.600 కోట్ల విలువైన 86 కిలోల మత్తు పదార్థాలను భారత తీర ప్రాంత రక్షక దళం(ఐసీజీ) స్వాధీనం చేసుకుంది. పాకిస్థాన్ పడవ నుంచి ఈ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని అందులోని 14 మందిని అరెస్ట్ చేసినట్టు ఐసీజీ ఆదివారం వెల్లడించింది. డ్రగ్స్‌లో ఏయే రకాలున్నాయో ఇంకా పరిశీలించలేదని చెప్పింది. అరేబియా సముద్రంలో అర్ధరాత్రి వేళ రాజ్‌రతన్ నౌక, హెలికాప్టర్ సాయంతో గుజరాత్ ఏటీఎస్, ఎన్‌సీబీ బృందాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి.

జార్ఖండ్ లోక్‌సభ బరిలో 12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు

రాంచీ : జార్ఖండ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు లోక్‌సభ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. 14 లోక్‌సభ స్థానాలున్న జార్ఖండ్‌లో మే 13న ఎన్నికల పోలింగ్ జరగనున్నది. రాష్ట్రంలో మొత్తం 2.56 కోట్ల మంది ఓటర్లున్నారు. ఇండియా కూటమి నుంచి ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రధాన ప్రతిపక్షం బీజేపీ నుంచి ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు.. మొత్తం 12 మంది లోక్‌సభ ఎన్నికల బరిలో నిలబడ్డారు. కాంగ్రెస్, జేఎంఎం, ఆర్జేడీ, సీపీఐ-ఎంఎల్.. 'ఇండియా కూటమి'గా ఏర్పడ్డాయి. నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను జేఎంఎం బరిలోకి దింపింది. 81 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీకి శీతాకాలంలో ఎన్నికలు జరగనున్నాయి.

కేజ్రీవాల్‌ను కలిసేందుకు సునీతకు అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తో సమావేశమయ్యేందుకు ఆయన సతీమణి సునీత కేజ్రీవాల్‌కు తీహార్ జైలు అధికారులు అనుమతిని నిరాకరించారు. షెడ్యూలు ప్రకారం వీరిద్దరి భేటీ సోమవారం జరగవలసి ఉంది. ఎటువంటి కారణం చూపకుండానే సునీతకు అనుమతిని తిరస్కరించారని ఆప్ వర్గాలు మీడియాకు తెలిపాయి. అయితే ఢిల్లీ రాష్ట్ర మంత్రి, ఆప్ నేత ఆతిశీ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అరవింద్ కేజ్రీవాల్‌ను జైలులో కలిసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. కేజ్రీవాల్‌ను కలిసేందుకు సునీత, ఆతిశీలకు జైలు అధికారులు అనుమతి ఇచ్చారని, కానీ ఆ తర్వాత సునీతకు అనుమతిని తిరస్కరించారని ఆప్ వర్గాలు తెలిపాయి.

బీజేపీకి 'క్షత్రియ' సెగ

- కేంద్రమంత్రి రూపాలా వివాదాస్పద వ్యాఖ్యలు
- బీజేపీకి వ్యతిరేకంగా రాజ్‌పుత్‌ల ఆందోళనలు
- గిరిజనులను ఆకర్షించే పనిలో కాంగ్రెస్-ఆప్
- కంచుకోట గుజరాత్‌లో బీజేపీకి గుబులు
- 26 సీట్లపై గంపెడాశలు పెట్టుకున్న కమలనాథులు

అహ్మదాబాద్, ఏప్రిల్ 28: మూడోసారి అధికారాన్ని నిలుపుకోవాలని భావిస్తున్న బీజేపీ గుజరాత్‌పై గంపెడాశలు పెట్టుకున్నది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా సొంత రాష్ట్రం కావడంతో ఇక్కడ మంచి ఫలితాలు సాధించవచ్చని బీజేపీ నమ్మకంగా ఉన్నది. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడ మొత్తం 26 స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకొని క్లీన్‌స్వీప్ చేసింది. ఈసారి కూడా ఇవే ఫలితాలను రిపీట్ చేయాలనుకుంటున్న వేళ క్షత్రియుల రూపంలో బీజేపీకి ఊహించని ప్రతికూలత మొదలయ్యింది.

బీజేపీకి వ్యతిరేకంగా రాజ్‌పుత్‌ల ఆందోళనలు

బీజేపీకి క్షత్రియులు బలమైన ఓటుబ్యాంకుగా ఉన్నారు. క్షత్రియుల్లో రాజ్‌పుత్‌లతో పాటు కొన్ని ఓబీసీ సామాజికవర్గాలు ఉన్నాయి. వీరందరూ బీజేపీ వైపే నిలుస్తూ వచ్చారు. అయితే, మార్చి 22న దళితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాజ్‌పుత్‌లపై కేంద్ర మంత్రి, రాజ్‌కోట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పురుషోత్తం రూపాలా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై రాజ్‌పుత్‌లు భగ్గుమన్నారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వొద్దంటూ నినదించారు. 109 క్షత్రియ సంఘాలు ఒక్కటయ్యాయి. క్షత్రియుల్లో వ్యతిరేకత గుర్తించిన రూపాలా సహా బీజేపీ నేతలు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. అయినా వీరిలో అసంతృప్తి కొనసాగుతున్నది.



గిరిజనులను ఆకర్షిస్తున్న కాంగ్రెస్: ఆప్

కాంగ్రెస్ - ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధానంగా గిరిజన ఓటుబ్యాంకును ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్రంలో దాహోద్, ఛోటా ఉదయ్‌పూర్, బర్డోలి, వల్సద్ స్థానాలు ఎస్టీలకు రిజర్వయ్యాయి. భరూచ్‌లోనూ గిరిజనుల జనాభా ఎక్కువ. ప్రధానంగా ఈ సీట్లపై కూటమి కన్నేసింది. రాహుల్ గాంధీ కూడా తన భారత్ జోడో న్యాయ్ యాత్రను ఈ స్థానాల్లోనే కొనసాగించారు.

బీజేపీకి అంత సులువు కాదా?

2014, 2019 ఎన్నికల్లో గుజరాత్‌లోని మొత్తం 26 నియోజకవర్గాల నుంచి బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయం సాధించారు. అయితే, ఈసారి మాత్రం వారికి విజయం నల్లేరు మీద నడక కాదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇది గుర్తించిన బీజేపీ 14 మంది సిట్టింగ్ ఎంపీలను పక్కన పెట్టింది. కాగా, ప్రభుత్వ వ్యతిరేక ఓటు, మైనారిటీల ఓట్లు కాంగ్రెస్ - ఆమ్ ఆద్మీ పార్టీకి కలిసొచ్చే అవకాశం ఉంది.

నవాబులు, సుల్తానుల అరాచకాలపై మాట్లాడరేం?
రాహుల్‌పై మోదీ విమర్శలు

బెళగావి: భారతీయ రాజులు, మహారాజులను అవమానించే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి.. నవాబులు, నిజాంలు, సుల్తానులు, బాద్‌షాలు పాల్పడిన అరాచకాలపై మాట్లాడేందుకు మాత్రం నోరు రాదని ప్రధాని మోదీ విమర్శించారు. బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగానే ఆయన ఈ విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో ఆదివారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయని విమర్శించారు. ఇటీవల ఓ కాలేజీలో జరిగిన విద్యార్థిని హత్య గురించి ఆయన ప్రస్తావించారు. 'వారసత్వ పన్ను' అంశంపై కాంగ్రెస్ లక్ష్యంగా ప్రధాని మోదీ తన ఆరోపణలను కొనసాగించారు. దేవణగెరెలో జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని ఏడాది చొప్పున పంచుకోవాలనేది ఇండియా కూటమి ఫార్ములా అని అన్నారు.

'సెక్స్ స్కాండల్'లో ప్రజ్వల్

- జేడీఎస్ ఎంపీ అశ్లీల వీడియోలు వైరల్
- దేవెగౌడ మనవడు ఆయన
- కర్ణాటక రాజకీయాల్లో దుమారం
- ప్రజ్వల్, రేవణ్ణలపై కేసు నమోదు
- జర్మనీ పారిపోయిన ప్రజ్వల్!



బెంగళూరు, ఏప్రిల్ 28: కర్ణాటక రాజకీయాల్లో 'సెక్స్ స్కాండల్' సంచలనంగా మారింది. జేడీఎస్ పార్టీకి చెందిన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు చెందినవిగా భావిస్తున్న అశ్లీల వీడియోలు వైరల్‌గా మారాయి. హసన్ నియోజకవర్గానికి శుక్రవారం పోలింగ్ జరగగా అంతకు రెండు రోజుల ముందు నుంచి వీడియోలు వెలుగులోకి వచ్చాయి. మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత దేవెగౌడకు ప్రజ్వల్ స్వయానా మనవడు కావడంతో ఈ అంశం మరింత సంచలనం సృష్టిస్తున్నది. ప్రజ్వల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ నేతలు శనివారం ఆందోళన నిర్వహించారు. మరోవైపు, ఓ మహిళ ఫిర్యాదు మేరకు దేవెగౌడ కుమారుడు రేవణ్ణ, ఎంపీ ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది.

స్పందించిన సీఎం.. సిట్ ఏర్పాటు

అశ్లీల వీడియోలపై సమగ్ర విచారణకు సీఎం సిద్ధరామయ్య సిట్ ఏర్పాటు చేశారు. వీడియోల్లో ఒక మహిళను లైంగికంగా వేధిస్తున్నట్టు ఉన్నదని ఆయన అన్నారు. హోళె నరసిపుర పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా, కుట్రలో భాగంగానే నవీన్ గౌడ అనే వ్యక్తి మార్ఫింగ్ చేసిన వీడియోలను ప్రచారం చేస్తున్నట్టు తన ఎన్నికల ఏజెంట్ ద్వారా ప్రజ్వల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జర్మనీ పారిపోయిన ప్రజ్వల్!

సెక్స్ స్కాండల్ ఆరోపణల నేపథ్యంలో శనివారం ఉదయమే ప్రజ్వల్ జర్మనీ పారిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఒకవేళ ప్రజ్వల్ విదేశాలకు వెళితే అతడిని వెనక్కు తీసుకువచ్చి విచారణ కొనసాగించే బాధ్యత సిట్‌దేనని కర్ణాటక హోంమంత్రి జీ పరమేశ్వర తెలిపారు.



అమెరికాలో పాలస్తీనా అనుకూల నిరసనలు తీవ్రం

వాషింగ్టన్, ఏప్రిల్ 28: అమెరికాలో పాలస్తీనా అనుకూల నిరసనలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. పలు యూనివర్సిటీల్లో భారత్ సహా వివిధ దేశాల విద్యార్థులు పాలస్తీనాకు సంఘీభావంగా, మద్దతుగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. శిబిరాలు సైతం ఏర్పాటు చేసుకొని పాలస్తీనాకు అనుకూలంగా నినాదాలు చేస్తున్నారు. దీంతో ప్రతి వర్సిటీలో పదుల సంఖ్యలో విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిరసనలు విరమించుకోవాలని పలు యూనివర్సిటీల యాజమాన్యాలు విద్యార్థులతో చర్చలు జరుపుతున్నాయి. మరోవైపు నిరసనల సెగలు అమెరికా అధ్యక్షుడి నివాస భవనం వైట్ హౌస్‌ను కూడా తాకాయి. బైడెన్ వైట్ హౌస్‌లో ఇచ్చే ఎన్నికల ఏడాది విందుకు హాజరైన వేలాది జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, సెలబ్రిటీలను నిరసనకారులు విమర్శించారు. పాలస్తీనాకు స్వేచ్ఛ ఇవ్వండి అంటూ నినాదాలు చేశారు.

కాంగ్రెస్‌లో పొత్తు మంటలు

- ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడి రాజీనామా
- లోక్‌సభ ఎన్నికల వేళ ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ కాంగ్రెస్‌లో పొత్తు మంటలు రేగాయి. ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తును వ్యతిరేకిస్తున్న ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ రాజీనామా చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు రాజీనామా లేఖ పంపారు. కాంగ్రెస్‌పై తప్పుడు, అబద్ధపు, అవినీతి ఆరోపణలు చేసి ఆప్ అధికారంలోకి వచ్చిందని, ఆ పార్టీతో పొత్తు ఢిల్లీ కాంగ్రెస్ నేతలెవరికీ ఇష్టం లేదని అర్విందర్ పేర్కొన్నారు. అయినా కాంగ్రెస్ అధిష్ఠానం ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవడాన్ని తప్పుబట్టారు. ఢిల్లీ ఏఐసీసీ ఇంచార్జి దీపక్ బబ్రియా వైఖరి సరిగా లేదని, ఢిల్లీ శాఖలోని పార్టీ సీనియర్లు తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయాలను కూడా ఆయన ఏకపక్షంగా పక్కకు పెట్టేశారని లవ్లీ ఆరోపించారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను కాపాడలేనప్పుడు, తాను పీసీసీ అధ్యక్ష పదవిలో ఉండలేనని పేర్కొన్నారు. దీపక్ బబ్రియాతో పొసగక ఇటీవలే మాజీ మంత్రి, ఏఐసీసీ సభ్యుడు రాజ్‌కుమార్ చౌహాన్ కూడా రాజీనామా చేశారు.


అర్విందర్ సింగ్

బీజేపీ అభ్యర్థిగా లవ్లీ ?

అర్విందర్ సింగ్ లవ్లీని తూర్పు ఢిల్లీ స్థానం నుంచి హర్ష్ మల్హోత్రాకు బదులుగా బీజేపీ పోటీకి నిలపనున్నట్టు కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే ఆసిఫ్ మహమ్మద్ ఖాన్ ఆరోపించారు. తన రాజీనామా లేఖలో ఆయన ఆప్‌పై, కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించడం, అవినీతి ఆరోపణలు చేయడంతో ఇది నిజమేననే అనుమానాలు మొదలయ్యాయి. అయితే, తాను కేవలం ఢిల్లీ పీసీసీ అధ్యక్ష పదవికి మాత్రమే రాజీనామా చేశానని, తాను ఏ పార్టీలోనూ చేరడం లేదని లవ్లీ పేర్కొన్నారు.


రిజర్వేషన్లపై కాంగ్రెస్ దుష్ప్రచారం
రాహుల్‌పై అమిత్‌షా ధ్వజం

కాసర్‌ఘంజ్, ఏప్రిల్ 28: బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని కేంద్ర హోంమంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్‌షా అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఉన్న రిజర్వేషన్లను తమ పార్టీ తొలగించబోదని ఆయన పేర్కొన్నారు. ఇది మోదీ గ్యారెంటీ అని అమిత్‌షా చెప్పుకొచ్చారు. యూపీలోని కాసర్‌ఘంజ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సహా ఆ పార్టీ ఇతర నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. 'బలహీన వర్గాల పేరుతో రాహుల్ బాబా అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారు. బీజేపీకి 400 సీట్లు వస్తే, దేశంలో రిజర్వేషన్లను రద్దు చేస్తారంటూ దుష్ప్రచారం చేస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్పీకి మూడో దశ పరీక్ష!

- యాదవులు, ముస్లింలు అధికంగా ఉండే నియోజకవర్గాల్లో పోలింగ్
- మెయిన్‌పురి నుంచి డింపుల్ పోటీ
- పలు ఇతర నియోజకవర్గాల్లో అభ్యర్థులుగా అఖిలేశ్ బంధువులు

లక్నో, ఏప్రిల్ 28: ఉత్తరప్రదేశ్‌లో ఇప్పటికి లోక్‌సభ ఎన్నికల రెండు దశలు ముగిశాయి. వచ్చే నెల 7న జరుగనున్న మూడో దశ ఎన్నికలు రాష్ట్రంలో ప్రధాన పార్టీగా ఉన్న మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి సవాల్‌గా మారింది. ఎందుకంటే రెండో దశ ఎన్నికలు జాట్‌లు ప్రభావం ఉండే రీజియన్‌లో జరుగ్గా.. ఇప్పుడు మరో వారంలో 10 లోక్‌సభ స్థానాల్లో జరిగే మూడో దశ లోక్‌సభ నియోజకవర్గాలు యాదవులు, ముస్లింలు గణనీయంగా ఉండేవి కావడం గమనార్హం. ఇక్కడ ఎస్పీకి ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న 'యాదవ్-ముస్లిం' పరీక్షను ఆ పార్టీ ఎదుర్కోనున్నది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ 10 స్థానాలకు గానూ బీజేపీ ఎనిమిదింటిలో విజయం సాధించగా.. మెయిన్‌పురి, సంభల్ స్థానాలను ఎస్పీ గెలుచుకొన్నది. సమాజ్‌వాదీ పార్టీకి కుటుంబ పరంగానూ ఈ మూడో దశ ఎన్నికలు కీలకంగా ఉన్నాయి. అఖిలేశ్ యాదవ్ కుటుంబానికి చెందిన ఐదుగురిలో ముగ్గురు సభ్యులు ఈ దశలో అభ్యర్థులుగా ఉన్నారు. మెయిన్‌పురి నుంచి అఖిలేశ్ భార్య డింపుల్ యాదవ్ పోటీచేస్తుండగా.. ఫిరోజాబాద్ నుంచి అక్షయ్ యాదవ్, బదౌన్ నుంచి ఆదిత్య యాదవ్ బరిలో ఉన్నారు. 2014 ఎన్నికల్లో యాదవ్ కుటుంబ సభ్యులు ఈ స్థానాలను గెలుచుకొన్నారు. 2019 ఎన్నికల్లో ఫిరోజాబాద్, బదౌన్ స్థానాలను ఎస్పీ చేజార్చుకొన్నది. ఈ ఎన్నికల్లో అఖిలేశ్ ఆజంగఢ్ స్థానం నుంచి గెలువగా, ఆయన తండ్రి ములాయం సింగ్ యాదవ్ మెయిన్‌పురి నుంచి గెలుపొందారు.



విద్యా - ఉద్యోగ సమాచారం

• మే రెండోవారంలో సీబీఎస్‌ఈ ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): సీబీఎస్‌ఈ ఫలితాలు మే రెండోవారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయి. ఈ ఏడాది సీబీఎస్‌ఈ పదోతరగతి పరీక్షలు ఫిబ్రవరి 15నుంచి మార్చి 13వరకు, 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15నుంచి ఏప్రిల్ 2వరకు జరిగాయి. 39లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. మే తొలి వారంలో పదోతరగతి, రెండో వారంలో 12వతరగతి ఫలితాలు విడుదల చేసే అవకాశాలున్నట్టు తెలిసింది.

• 5లోపు సీయూఈటీ యూజీసెట్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): సెంట్రల్ యూనివర్సిటీలు సహా ఇతర విద్యాసంస్థల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ యూజీ సెట్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను మే 5లోపు విడుదల చేయనున్నట్టు యూజీసీ చైర్మన్, ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్ తెలిపారు. మే రెండో వారం నుంచి అడ్మిట్‌కార్డులను అందుబాటులో ఉంచుతామన్నారు. మే 15నుంచి 24వరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

• సజావుగా గురుకుల డిగ్రీ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 87.79శాతం విద్యార్థులు హాజరయ్యారని టీజీఆర్‌డీసీ సెట్ కన్వీనర్, తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో వెల్లడించారు. 18,989మంది దరఖాస్తు చేసుకోగా, 16564మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశ పరీక్షకు 88.02శాతం విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 47,463మంది దరఖాస్తు చేసుకోగా, 41,775మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు.

• పాలిసెట్ దరఖాస్తుకు రేపే ఆఖరు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ దరఖాస్తుల గడువు మంగళవారంతో ముగియనున్నది. రూ.100 ఆలస్య రుసుముతో ఈనెల 30, రూ.300 ఆలస్య రుసుముతో మే 20వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సాంకేతిక విద్యామండలి కార్యదర్శి పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మే 24న పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.



మెదక్ జిల్లా చిన్నశంకరంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



చిన్నశంకరంపేట రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన జనం

కేసీఆర్ బస్సుయాత్రతో వణుకు

హామీలపై అడిగితే తిట్లు.. లేదంటే ఒట్లు

- సవాలుకు తోకముడిచిన రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష
- రోడ్‌షోలలో మాజీమంత్రి హరీశ్‌రావు

మెదక్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రతో కాంగ్రెస్ నాయకులు గజగజ వణుకుతున్నారని, అందుకే ఎక్కడిపడితే అక్కడ దేవుని మీద ఒట్లు పెడుతున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మెదక్ జిల్లాలోని చిన్నశంకరంపేట, వెల్దుర్తి, శివ్వంపేట మండలాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ రోడ్‌షోలలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక తిట్ల పురాణం అందుకున్నారని విమర్శించారు. తిట్లు, లేదంటే ఒట్లు తప్ప ప్రజలు, రైతుల సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపు లేదని విమర్శించారు. రుణమాఫీ పేరుతో రైతులను సహా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలు అమలుచేస్తే రాజీనామా చేస్తానని, ఎన్నికల్లో మళ్లీ పోటీచేయబోనని సవాలు విసిరితే రేవంత్ తోకముడిచి పారిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌వి ఉద్దెర మాటలు తప్ప, ప్రజలను ఉద్ధరించింది ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రచారం కోసం కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే తరిమికొట్టేందుకు చీపుర్లు పట్టుకుని రెడీగా ఉండాలని, గుంపుమేస్త్రీ గూటం గుయ్‌మనేలా తీర్పు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఓట్లలోనూ కాంగ్రెస్‌కు తరుగుపెట్టాలి

పంట ఉత్పత్తులకు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మాటతప్పిందని హరీశ్‌రావు మండిపడ్డారు. వరి కొనుగోళ్లలో తరుగు పెడుతున్న కాంగ్రెస్‌కు ఓట్లలోనూ తరుగు పెట్టి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మెడలు వంచేది బీఆర్ఎస్ ఒక్కటేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు కోతలు, మోటర్లు కాలడం ప్రారంభమైందని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటేస్తే నీళ్లు లేని బావిలో దూకినట్టేనని హెచ్చరించారు. ధరల పెంపు, మత రాజకీయాలు తప్ప అభివృద్ధి, తెలంగాణ ప్రయోజనాలకు ఆ పార్టీకి పట్టవని హరీశ్‌రావు విమర్శించారు.

కేసీఆరే శ్రీరామరక్ష

తెలంగాణ ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, ప్రజలకు కేసీఆరే శ్రీరామ రక్ష అని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ హయాంలో బావి దగ్గర 24 గంటల కరెంటు వస్తే, ఇప్పుడు 14 గంటలు మాత్రమే వస్తున్నదని తెలిపారు. మహిళలకు కేసీఆర్ రూ.2 వేల పింఛన్ ఇస్తే, రూ.4 వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.4 వేల పెన్షన్ వచ్చిన వారు కాంగ్రెస్‌కు, రూ.2 వేలు తీసుకుంటున్నవారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు. హరీశ్‌రావు రోడ్‌షోలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. కాంగ్రెస్ మోసాలను వివరిస్తున్నపుడు మంచి స్పందన లభించింది. రోడ్‌షోల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

• జీవన్‌రెడ్డిపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్సీ, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ ఆదివారం ఫిర్యాదు చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మార్ఫింగ్ వీడియోను జీవన్‌రెడ్డి ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారని పేర్కొన్నది. అమిత్‌షా మాట్లాడిన వీడియోను ఎడిట్ చేసి 'కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు ఎత్తేస్తాం' అని అర్థం వచ్చేలా వీడియోను తయారుచేశారని తెలిపింది. సోషల్ మీడియాలో మార్ఫింగ్ వీడియోను వైరల్ చేస్తున్న జీవన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరింది.

• తనిఖీల్లో 104 కోట్ల నగదు స్వాధీనం


7,174 లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా నగదు, మద్యం, డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. మార్చి 16 నుంచి ఏప్రిల్ 28 వరకు రూ.104.18 కోట్లను తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 477 ఎఫ్ఎస్‌టీ, 464 ఎస్ఎస్‌టీ బృందాలు 89 సరిహద్దు చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, డ్రగ్స్, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో రూ.63.18 కోట్ల నగదు ఇప్పటికే దొరకడం కలకలం సృష్టిస్తున్నది. ఇక రూ.5.38 కోట్ల విలువైన మద్యం, రూ.7.12 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.21.34 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.6.91 కోట్ల విలువైన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,174 లైసెన్స్‌డ్ ఆయుధాలను పోలీసులకు డిపాజిట్ చేశారు. అనధికారికంగా వెంటపెట్టుకొన్న 14 ఆయుధాలను సీజ్ చేశారు. జిలిటెన్‌స్టిక్స్, డిటోనేటర్లు, కార్టన్ బాక్స్ వంటి పలు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణను నిండా ముంచిన మోదీ

- రిజర్వేషన్ల రద్దుకు కుట్ర
- రాముడి ఫొటోతో బీజేపీ ఓట్లు అడుకుంటున్నది
- ఎల్బీ నగర్ రోడ్‌షోలో సీఎం రేవంత్

వనస్థలిపురం, ఏప్రిల్ 28: తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతూ నిండా ముంచిన వ్యక్తి ప్రధాని మోదీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తే కల్లోలం సృష్టిస్తారని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల రద్దుకు మోదీ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గం వనస్థలిపురంలో మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన రోడ్ షో ఆయన మాట్లాడారు. తెలంగాణకు రావాల్సిన ఐటీఆర్ఐ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను రాకుండా చేసింది మోదీనే అని విమర్శించారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని తెలంగాణ ఉద్యమాన్ని పార్లమెంట్ సాక్షిగా అవమానించిన నరేంద్రమోదీ తెలంగాణలో ఓట్లెలా అడుగుతారని నిలదీశారు. దేవుడి పేరుతో రాజకీయం చేస్తూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద దేవుడి ఫొటో చూపించి అడుక్కున్నట్టు, బీజేపీ రాముడి ఫొటోపెట్టి ఓట్లు అడుక్కుంటున్నదని ఎద్దేవా చేశారు. పదేండ్లుగా దేశానికి ఏం చేశారో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. బీజేపీ పుట్టకముందు నుంచే అందరం రాముడిని, హనుమంతుడిని పూజిస్తున్నామని చెప్పారు. మతం పేరుతో రాజకీయం చేసి, ద్వేషం పెంచేవారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సునీతా మహేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మెట్రోను ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, ఇటు ఎయిర్‌పోర్టు వరకు విస్తరిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ముంపు ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. మూసీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



2035నాటికి చంద్రుడిపై రిసెర్చ్ సెంటర్: చైనా

బీజింగ్, ఏప్రిల్ 28: చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధన కేంద్రం నిర్మాణానికి ప్లాన్ చేస్తున్నట్టు చైనా ప్రకటించింది. రెండు దశల్లో ఈ ప్రాజెక్ట్ చేపట్టనున్నట్టు తెలిపింది. 2035 నాటికి ఈ ప్రాజెక్ట్ తొలి దశను పూర్తి చేయాలని భావిస్తున్నట్టు చెప్పింది. 2045 నాటికి మలి దశను పూర్తి చేయాలని చైనా అంతరిక్ష పరిశోధన సంస్థ ది ఇంటర్నేషనల్ లూనార్ రిసెర్చ్ స్టేషన్ లక్ష్యంగా పెట్టుకొంది. నీడ ఆవరించి ఉండే చంద్రుడి దక్షిణ ధ్రువంలో నీళ్లు, మంచు ఉంటాయని, పరిశోధనలకు ఆ ప్రాంతం అనుకూలమని భావించిన చైనా వ్యూహాత్మకంగానే ఆ ప్రాంతంలో పరిశోధన సంస్థ నిర్మాణానికి పూనుకుంది.

సాహస బాలుడికి సీఎం అభినందన

సాయిచరణ్ సాహసానికి ముగ్ధుడైన సీఎం రేవంత్



సాహస బాలుడు సాయిచరణ్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా నందిగామలో ఓ ఫార్మా కంపెనీలో రెండురోజుల క్రితం సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో ప్రాణాలకు తెగించి ఆరుగురిని రక్షించిన సాహస బాలుడు సాయిచరణ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. పోలీసులు, ఫైర్ ఉన్నతాధికారుల ద్వారా సాయిచరణ్ సాహసాన్ని తెలుకొన్న ముఖ్యమంత్రి ఆదివారం తన కార్యాలయానికి అతన్ని కుటుంబంతో సహా పిలిపించుకొన్నారు. సాయిచరణ్ తాడుసాయంతో ఆరుగురి కాపాడిన విధానాన్ని తెలుసుకొని రేవంత్‌రెడ్డి ముగ్ధుడయ్యారు. అనంతరం సాయిచరణ్‌ను ఘనంగా సన్మానించారు. అతడి చదువు, తల్లిదండ్రుల కుటుంబనేపథ్యం తెలుసుకొన్నారు. గత శుక్రవారం ఓ ఫార్మాకంపెనీలో సంభవించిన అగ్నిప్రమాదంలో సుమారు 50 మంది కార్మికులు మంటల్లో చిక్కుకొన్నారు. వీరిలో చాలామంది కిటికీల్లోంచి దూకి తమ ప్రాణాలు కాపాడుకొన్నారు. కొందరు బయటికి రాలేక మంటల్లోనే చిక్కుకుపోగా, సాయిచరణ్ సమయస్ఫూర్తితో వ్యవహరించి, తన ప్రాణాలకు తెగించి ఆరుగురిని కాపాడాడు. తెలివిగా ఫార్మా కంపెనీ భవనం పైకి ఎక్కి తాడు కట్టి, కిటికీలు పగలగొట్టడంతో బయటికి వచ్చిన బాధితులు.. ఆ తాడును పట్టుకొని సురక్షితంగా బయటికి రాగలిగారు. సాయిచరణ్ సాహసం గురించి తెలుసుకొన్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు ఎంతగానో అభినందించారు.

కార్.. టాప్ గేర్!

▸ మొదటిపేజీ తరువాయి...

ఇచ్చిన తర్వాతి రోజు నుంచే మార్పు మొదలైందని, ఆ తెల్లారి నుంచి కేసీఆర్ నిర్వహిస్తున్న రోడ్‌షోలు పరిస్థితిని తల్లకిందులు చేసాయని విశ్లేషకులు భావిస్తున్నారు. చానల్ ఇంటర్వ్యూలో కేసీఆర్ పలు వివాదాస్పద అంశాలపై, తనపై, పార్టీపై ఇంతకాలం జరిగిన దుష్ప్రచారంపై స్పష్టత ఇవ్వడంతో ప్రజల్లో ఒకరకమైన రియలైజేషన్ వచ్చిందని, బీఆర్ఎస్‌ను ఓడించి తాము తప్పు చేసామా? అన్న పునరాలోచన మొదలైందని సీనియర్ పాత్రికేయుడొకరు పేర్కొన్నారు. ఇక రోడ్‌షోల్లో కేసీఆర్ సూటిగా, సుత్తి లేకుండా, సంభాషణ పూర్వకంగా ఇస్తున్న సందేశంతో జనం బీఆర్ఎస్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడానికి పునాది వేస్తున్నది ఆయన వివరించారు. రోడ్‌షోల్లో కేసీఆర్ వేస్తున్న ప్రశ్నలకు ప్రజలు స్పందిస్తున్న తీరే ఇందుకు నిదర్శనమని అన్నారు. ''ఇప్పటికి ఐదు రోజుల్లో మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్‌లలో ఆరు రోడ్‌షోలు జరిగాయి. వీటిని గమనించిన ఎవరైనా, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల తరహాలో ఉండవని తెగేసి చెప్పవచ్చు'' అని ఆయన కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు దీన్ని గుర్తించాయి. అందుకే అవి మళ్లీ కదనోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలు అంటే అదేదో ఢిల్లీకి సంబంధించిన అంశమే కాదు; మనకు, మన రాష్ట్రానికి సంబంధించినది కూడా అనేదాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు గెలిస్తే తమకు, తెలంగాణకు లాభం జరుగుంది? అనే అంశాలపై కేసీఆర్ మాటలతో ప్రజల ఆలోచన విధానంలో మార్పు మొదలైంది అన్నది ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్న అభిప్రాయం.

అనూహ్యంగా పుంజుకున్న బీఆర్ఎస్

అసెంబ్లీ ఫలితాల తర్వాత, లోకసభ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ ప్రభావాన్ని కాంగ్రెస్, బీజేపీ చాలా తక్కువగా అంచనా వేసాయి. దీన్ని బీఆర్ఎస్ ఒక్కసారిగా తలకిందులు చేసింది. కేసీఆర్ జనంలోకి రావడం, బలమైన సందేశాన్ని ఇస్తుండడంతో పాటు కాంగ్రెస్ పరిపాలన వైఫల్యం, కరువును ఎదుర్కొనడంలో చేతగానితనం, వ్యవసాయ సంక్షోభం, రాజకీయంగా వ్యూహాత్మక తప్పిదాలు ఆ పార్టీని ఆత్మరక్షణలో పడేసాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ''ఈ ఎన్నికలు కూడా కేసీఆర్‌ను తిట్టి గెలవొచ్చన్న కాంగ్రెస్ వ్యూహం ఎదురు తన్నింది. పనిచేయాలని అధికారమిస్తే, కేసీఆర్‌ను తిట్టి పబ్బంగడుపుకొంటానంటే ఎట్లా? అన్నది ఇప్పుడు ప్రజలు వేస్తున్న ప్రశ్న. అదీగాక ఓవర్ కాన్ఫిడెన్స్‌తో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలు కూడా ఆ పార్టీ విజయావకాశాలను తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. దాదాపు 10-11 చోట్ల ఆ పార్టీ దారుణంగా దెబ్బతినబోతున్నది. ''సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, వరంగల్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల నుంచి కాదు; కాంగ్రెస్ క్యాడర్ నుంచే ఆమోదం లేదు. ప్రజాభిమానం కోల్పోయిన, బీఆర్ఎస్‌కు భారంగా మారిన వాళ్లను తెచ్చుకుని కాంగ్రెస్ అభ్యర్థులుగా పెట్టుకోవడం వ్యూహాత్మక తప్పిదం'' అని కాంగ్రెస్‌కే చెందిన ఒక సీనియర్ నేత విశ్లేషించారు. ''కరీంనగర్, పెద్దపల్లి, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబాబాద్ స్థానాల్లో కాంగ్రెస్ మూడో స్థానానికి జారిపోయింది. ఈ సీట్లలో పరిస్థితిని అంచనావేయడంలో మా పార్టీ నాయకత్వం పూర్తిగా విఫలమైంది'' అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఖమ్మం అభ్యర్థి ఎంపికలోనూ కాంగ్రెస్ తప్పు చేసిందని, ఒక్కసారి మినహా ఎన్నడూ రెడ్డి సామాజిక వర్గం గెలవని ఖమ్మంలో రెడ్డికి సీట్లు ఇవ్వడం, దీనిపై మంత్రులు, సీనియర్ల మధ్య కీచులాటలు కాంగ్రెస్‌ను పెను దెబ్బ తీయబోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఖమ్మంలో ప్రధాన సామాజికవర్గం బీఆర్ఎస్‌కే అండగా నిలవనుందని ఆయన స్పష్టంచేశారు. ''కేసీఆర్ రాజకీయ అనుభవం, విసిరిన పాచికలకు చేవెళ్ల, ఖమ్మం, వరంగల్ మంచి ఉదాహరణలు, కేసీఆర్ ఎత్తుగడలు ఆ పార్టీకి అనూహ్య లాభం కలిగించబోతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ రెండు జాతీయ పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ఉంటుంది. ఇందులో బీఆర్ఎస్‌కు ఏ రోల్ ఉండదనే అభిప్రాయాన్ని ఆయన పటాపంచలు చేశారు. కేసీఆర్ రాజకీయ అనుభవం, గ్రౌండ్‌ని బీఆర్ఎస్ వర్సెస్ అన్నట్టుగా మార్చివేసింది. హైదరాబాద్‌ను మినహాయిస్తే మొత్తం 16 సీట్లలో దాదాపు 10-11 చోట్ల ఇప్పుడు బీఆర్ఎస్- బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొనగా, నాలుగైదు చోట్ల బీఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య పోటీ నెలకొంది. ఈ క్రమంలో ఎన్నికల ఫలితాల్లో బీఆర్ఎస్సే ఫస్ట్‌ప్లేస్‌లో ఉండడం ఖాయంగా కనిపిస్తున్నది. బీఆర్ఎస్ సాధించే స్థానాల్లో సగం కాంగ్రెస్, అందులో సగం బీజేపీకి వచ్చే అవకాశం ఉంది'' అని రాష్ట్ర ఎన్నికలపై కచ్చితమైన అంచనాలు ఇచ్చే సెఫాలజిస్టు ఒకరు పేర్కొన్నారు. పోలింగ్‌కు ఇంకా 15 రోజులు ఉన్నందున, వాతావరణం మరింత స్వింగ్ అవుతుందని, అదే జరిగితే బీఆర్ఎస్ సంఖ్య మరింత పెరిగి, బీజేపీ జీరో అయినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ''బీజేపీ విషయంలో నెల రోజుల క్రితం ఉన్న వాతావరణం ఇప్పుడు లేదు. నాయకత్వ లోపం, బీఆర్ఎస్‌కు లయబిలిటీగా మారారనే పేరున్న (జహీరాబాద్, వరంగల్, నల్లగొండ) అభ్యర్థులను తెచ్చుకుని నిలబెట్టడం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీసింది. మోదీకున్న తెలంగాణ వ్యతిరేకత, రాష్ట్రానికి పదేండ్లుగా చేసిన అన్యాయం కూడా ఆలోచనాపరులను ఆలోచింపజేస్తున్నది'' అని మరో పాత్రికేయుడు పేర్కొన్నారు.

మైనారిటీలు, దళితుల్లో పరివర్తన

అసెంబ్లీ ఎన్నికల్లో కొన్నిచోట్ల కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరించిన మైనారిటీ, దళితవర్గాలు క్రమంగా బీఆర్ఎస్ వైపు తిరిగి వస్తున్నారని క్షేత్రస్థాయి వాతావరణం స్పష్టం చేస్తున్నది. బీజేపీ గెలవకుండా చూడడమే మైనారిటీల లక్ష్యం. ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా చూసినా, రాష్ట్రంలో చూసినా బీజేపీకి ఎదురొడ్డి నిలిచే సత్తా కాంగ్రెస్‌కు ఉన్నట్టు కనిపించడం లేదు. అందువల్ల ఈసారి మైనారిటీల ఓటు బీఆర్ఎస్‌కే పడుతుంది అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. 'మేము ఏదో అనుకున్నాం. కానీ ఇలా అవుతుందని అనుకోలేదు. మీరు చేసిందే నిజం. చెప్తున్నదే వాస్తవం. ఈ ఎన్నికల్లో మేం మీ వెంటే ఉంటాం' అని మహబూబ్‌నగర్ రోడ్‌షో తర్వాత స్థానిక ముస్లిం పెద్దలు కేసీఆర్‌ను కలిసి పేర్కొనడం గమనార్హం. బలమైన ప్రాంతీయ పార్టీలు మాత్రమే బీజేపీని అడ్డుకోగలవనే అభిప్రాయం దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాదిలో వ్యాపిస్తున్నది. దీనికి తోడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌కు బీజేపీతో సంబంధాలున్నాయని, ఎన్నికల తర్వాత ఆయన బీజేపీలో చేరతారని బీజేపీ నేతలే స్వయంగా ప్రకటిస్తుండడం, వీటిని ఆయన ఖండించకపోవడం కూడా మైనారిటీలను పునరాలోచనలో పడేసాయి. కర్ణాటకలో అధికారంలోకి వచ్చేందుకు అక్కడి కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రభుత్వంలోకి వచ్చిన తరువాత ప్రజలను విస్మరించిన తీరు, ఇప్పుడు రాష్ట్రంలోనే అదే జరుగుతుండడంతో మధ్యతరగతి, మేధావి వర్గం పునరాలోచనలో పడింది. బీజేపీని నిలువరించే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని పదేండ్ల ఆ పార్టీ పాలన రుజువు చేసిందని మైనారిటీ, దళితవర్గాలు బలంగా నమ్ముతున్నాయి. కర్ణాటకకు సరిహద్దుగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలోని మైనారిటీ పెద్దల అభిప్రాయమే ఇందుకు ఉదాహరణ. రాష్ట్రంలోని మైనారిటీ వర్గం తిరిగి బీఆర్ఎస్‌వైపునకు మళ్లిందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్వహిస్తున్న సమావేశాల్లో, కేసీఆర్ రోడ్‌షోల్లో మైనారిటీలే అత్యధికంగా పాల్గొంటుండడం ఆ వాదనకు బలం చేకూరుస్తున్నది. దళితుల్లో కేవలం మాల సామాజిక వర్గాన్ని, అదీ సంపన్న వర్గాన్ని మాత్రమే కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులుగా నిలిపిందని, తెలంగాణలో అత్యధికంగా ఉన్న తమను ఉద్దేశపూర్వకంగా విస్మరించిందని మాదిగ సామాజిక వర్గం ఆగ్రహంతో ఉన్నది. తమకు ఒక్కసీటు ఇవ్వరా అని మాదిగ సామాజిక వర్గం కాంగ్రెస్‌పై తిరుగుబాటును ప్రకటించింది. దళితవర్గాల్లో నిజాయితీపరుడిగా, ఉన్నతాధికారిగా సేవలు అందించి, గురుకులాలను అద్భుతంగా తీర్చిద్దిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ లాంటి నాయకుడు బీఆర్ఎస్‌లో నాగర్‌కర్నూల్ నుంచి, ఉద్యమకారుడు సుధీర్‌కుమార్ మాదిగ వరంగల్ నుంచి పోటీ చేస్తుండడంతో బీఆర్ఎస్‌ను మాదిగలకు దగ్గర చేసింది. దళితజాతి గర్వపడే మంద కృష్ణమాదిగ కాంగ్రెస్ పార్టీపై ఒకరకంగా యుద్ధమే ప్రకటించారు. దీంతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, ఆ మార్పు కచ్చితంగా బీఆర్ఎస్‌వైపే తిరుగుతున్నదని, రానున్న రోజుల్లో ఇది మరింత బలోపేతమవుతుందని రాజకీయ పరిశీలకుల అంచనా.

హామీలు అమలు చేయకుంటే దిగిపో..

- సీఎం రేవంత్ రెడ్డికి కిషన్‌రెడ్డి సవాల్
- రిజర్వేషన్ల రద్దంటూ అసత్యప్రచారమని మండిపాటు



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేదంటే గద్దె దిగిపోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉత్త మాటలతో ప్రజలకు న్యాయం జరుగదని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఎంకు చురకలంటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తొందరపడి ఓటేశామా? అని ఇప్పటికే ప్రజలు ఆలోచనలో పడ్డారని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నదని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనో, రాహుల్ సమర్థ నాయకుడనో, సోనియా గాంధీ భారత్‌లో పుట్టిందనో, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామనో చెప్పి ఓట్లడిగే పరిస్థితిలో లేడని, అందుకే అసత్య ప్రచారం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. వారు చేస్తున్న ప్రచారానికి సాక్ష్యాలు చూపాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో అమిత్ షా మాటలను కాంగ్రెస్ మార్ఫింగ్ చేసిందని, దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను నీరుగార్చిందే కాంగ్రెస్ అని మండిపడ్డారు. మతపరమైన రిజర్వేషన్లను అమలు చేస్తూ బీసీలకు విద్య, వైద్యాన్ని అందకుండా చేస్తున్నదని విమర్శించారు.

రిజర్వేషన్లపై బీజేపీ విధానమేంటి?

- అగ్ర నాయకత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి
- బీసీలకు అన్యాయం చేస్తే తిరుగుబాటు తప్పదు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ)/కాచిగూడ: రిజర్వేషన్ల అంశంపై బీజేపీ తన విధానమేంటో వెల్లడించాలని, దీనిపై ఆ పార్టీ అగ్ర నాయకత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అంశంపై 13 బీసీ సంఘాలు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించాయి. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను ఎత్తివేయాలని బీజేపీ కుట్ర చేస్తున్నదని ప్రతిపక్ష పార్టీల ఆరోపణలపై బీజేపీ నుంచి ఎలాంటి సమాధానం లేదని తెలిపారు. రాష్ట్ర పర్యటనకు త్వరలో రానున్న ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా రిజర్వేషన్ల అంశంపై తమ పార్టీ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీజేపీ పదేండ్ల పాలనలో బీసీల అభివృద్ధికి చిన్న పథకం కూడా పెట్టలేదని, కానీ అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లను కల్పించిందని, అది రిజర్వేషన్ల సిద్ధాంతానికి విరుద్ధమని వివరించారు. ఓబీసీల డిమాండ్లలో ఏ ఒక్కదానిని బీజేపీ సర్కారు నెరవేర్చలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఏకంగా ఉన్న రిజర్వేషన్లనే ఎత్తివేసే కుట్ర జరుగుతున్నదని పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు అన్యాయం చేస్తే దేశంలో తిరుగుబాటు తప్పదని, బీసీల హక్కులను పరిష్కరించకుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, రాజేందర్, రామకృష్ణ, జ్యోతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

• బస్సులు ఆపడం లేదని రోడ్డుపై రాళ్లు



బస్సులు ఆపడం లేదని మహిళలు రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం మాడాపూర్ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపకుండా వెళ్లడంతో మహిళలు ఆదివారం ఆందోళన చేపట్టారు. కల్వకుర్తి, అచ్చంపేట డిపోల నుంచి తెల్కపల్లి మీదుగా లింగాలకు నడిచే బస్సులు బీఆర్ఎస్ హయాంలో స్టేజీల వద్ద నిలిపేవారని మాడాపూర్, కోమటికుంట గ్రామాలకు చెందిన మహిళలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడంతో డ్రైవర్లు బస్సులను స్టేజీల వద్ద ఆపడం లేదని ఆరోపించారు. చేసేదేమీలేక రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి నిరసన చేపట్టాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. -లింగాల

ధాన్యం తాలు పడుతుండగా ఫ్యాన్ తగిలి యువకుడి మృతి



ఈశ్వర్ (ఫైల్)

దంతాలపల్లి, ఏప్రిల్ 28: వరి ధాన్యం తాలు పడుతుండగా ప్రమాదవశాత్తు ఫ్యాన్ తగిలి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలో ఆదివారం జరిగింది. మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మోగ్యతండాకు చెందిన భూక్యా వెంకన్న-పార్వతి దంపతుల కుమారుడు ఈశ్వర్ (18) ఇంటర్ పూర్తి చేశాడు. వేసవి సెలవులు కావడంతో రామవరం గ్రామంలో ఓ రైతుకు వడ్లు తాలు పట్టేందుకు కూలికి వెళ్లాడు. వడ్లు పట్టేందుకు ఫ్యాన్‌ను సరిచేస్తుండగా ఒక్కసారిగా ఆన్ కావడంతో ఈశ్వర్ తలకు తగిలి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు.

గనిలో పని వేళలు మార్చండి

- వేసవి దృష్ట్యా మజ్జిగ అందించండి
- సింగరేణి సీఎండీకి టీబీజీకేఎస్ నేత లేఖ

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): సింగరేణిలోని ఓపెన్‌కాస్టు గనుల్లో కార్మికులు మండుటెండల్లో విధులు నిర్వహిస్తున్నారని, ఎండ తీవ్రత నుంచి వారిని కాపాడాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆ సంస్థ సీఎండీ బలరాం నాయక్‌ను కోరారు. ఈ మేరకు ఆయన సీఎండీకి లేఖ రాశారు. రాష్ట్రంలో ఏప్రిల్ 28 నుంచి మే 2 వరకు ఎండలు తీవ్రంగా ఉంటాయని, 48 డిగ్రీల నుంచి 50 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నదని కేంద్ర వాతావరణశాఖ హెచ్చరించిందని, కోల్‌బెల్ట్ ఏరియాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఓపెన్‌కాస్టు గనుల్లో విధులు నిర్వర్తించే కార్మికులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని, సింగరేణి సంస్థ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ఓసీపీల్లో పనిచేస్తున్న కార్మికుల పని వేళలు మార్పు చేయాలని, మొదటి షిఫ్టు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, రెండో షిఫ్టు సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మజ్జిగ ప్యాకెట్లను అదనంగా సరఫరా చేయాలని, ఓసీలో మరిన్ని రెస్ట్ షెల్టర్లను ఏర్పాటు చేసి కార్మికులకు ఉపశమనం కలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా కొనసాగిన సమయంలో వేసవిలో ఓసీపీల్లో పనివేళల్లో మార్పులు చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. యాజమాన్యం ఎండల తీవ్రతను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

కాలిబూడిదైన ఈతవనం

- రెండువేలకుపైగా చెట్లు దగ్ధం
- నారాయణపేట జిల్లా భైరంపల్లిలో ఘటన

మాగనూరు, ఏప్రిల్ 28 : ఈతవనం దగ్ధమైన ఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం భైరంపల్లి శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. భైరంపల్లి, నేరడుగం శివారులోని ఈతవనాన్ని ఎవరో ఉద్దేశపూర్వకంగానే దహనం చేశారని గీత కార్మికుల అనుమానిస్తున్నారు. కల్లుగొౌబ్బలను ధ్వంసం చేసిన ఘటనపై నారాయణపేట ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రెండువేలకుపైగా ఈతచెట్లు కాలి బూడిదైనట్టు వారు పేర్కొన్నారు.



12 కోట్లు పలికిన 'టైటానిక్' వాచ్

న్యూఢిల్లీ: ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో 1912లో మునిగిపోయిన టైటానిక్ నౌకకు సంబంధించిన కథలు ఇప్పటికీ ప్రజలను కట్టిపడేస్తున్నాయి. ఈ నౌకలో ప్రయాణించి, ప్రాణాలు కోల్పోయినవారి జ్ఞాపకాలు చెక్కు చెదరకుండా నిలిచి ఉన్నాయి. అప్పటి ప్రమాదంలో మరణించిన అత్యంత సంపన్న వ్యాపారవేత్త జాన్ జాకబ్ ఆస్టర్ (47)కు గల గోల్డ్ పాకెట్ వాచ్ తాజాగా సరికొత్త రికార్డు సృష్టించింది. అమెరికాలోని హెన్రీ ఆల్డ్రిడ్జ్ అండ్ సన్ వేలం సంస్థ శనివారం నిర్వహించిన వేలంలో ఈ వాచీని రూ.12.17 కోట్లకు ఓ వ్యక్తి సొంతం చేసుకున్నారు. ఈ నౌక మునిగిపోతున్నపుడు ఓ ప్యాసింజర్ వాయించిన వయొలిన్‌ను ఇదే సంస్థ 2013లో వేలం వేసింది. అప్పట్లో దానికి పలికిన ధర (1.1 మిలియన్ పౌండ్లు) రికార్డు సృష్టించింది.


స్వలింగ సంబంధాలకు 15 ఏండ్ల జైలు

చట్టాన్ని ఆమోదించిన ఇరాక్

బాగ్దాద్, ఏప్రిల్ 28: స్వలింగ సంపర్క సంబంధాలను నేరంగా పరిగణిస్తూ ఇరాక్ పార్లమెంట్ ఒక చట్టాన్ని ఆమోదించింది. దీనిని ఉల్లంఘించిన వారికి 15 ఏండ్ల గరిష్ఠ కారాగార శిక్ష విధించనున్నట్టు పేర్కొంది. అయితే ఇది ఎల్జీబీటీ కమ్యూనిటీపై దాడిగా హక్కుల న్యాయవాదులు ఖండించారు. ఇరాక్ సమాజాన్ని నైతిక పతనం నుంచి రక్షించడానికి, ప్రపంచంలో పెరిగిపోతున్న స్వలింగ సంపర్కాన్ని నిరోధించడానికి ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్టు ఇరాక్ తన చట్టంలో పేర్కొంది. ప్రభుత్వంలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న సంప్రదాయ షియా ముస్లిం పార్టీల ఒత్తిడి మేరకు ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ చట్ట ప్రకారం వ్యభిచారం, స్వలింగ సంపర్కాన్ని నిరోధిస్తూ.. వాటిని అతిక్రమించిన వారికి కనీసం 10, గరిష్ఠంగా 15 ఏండ్ల కారాగార శిక్షను విధిస్తారు. అలాగే వీటిని ప్రోత్సహించిన వారికి కనీసం ఏడేండ్ల జైలు శిక్ష విధిస్తారు.

ఉద్యోగాలపై ఏఐ కత్తి!

- కృత్రిమ మేధ, ఆటోమేషన్‌తో కోట్లాది ఉద్యోగాలకు ముప్పు
- ఏఐతో 40 కోట్ల ఉద్యోగాల భర్తీ
- ప్రపంచ శ్రామిక శక్తిలో 15%
- మెకిన్సే నివేదిక అంచనా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ (కృతిమ మేధ).. నేటి టెక్ యుగంలో ఇదో సంచలనం. అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఏఐ నాంది పలికింది. అయితే ఇది రెండు వైపులా పదునున్న కత్తిలాంటిది. దీనితో లాభాలు ఎన్ని ఉన్నాయో నష్టాలూ అన్నే ఉన్నాయి. ఏఐ రాకతో అనేక మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంపై దీని ప్రభావం అధికంగా ఉన్నది. ఏఐ, ఆటోమేషన్ వల్ల గణనీయ సంఖ్యలో ఉద్యోగాలకు కోత పడుతున్నది. దీని వల్ల ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగాలు మారడమో లేదా కొత్త అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ కావడమో, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడమో చేయాల్సి ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. గతంలోనూ పలు కొత్త సాంకేతికతలు అందుబాటులోకి వచ్చిన సమయంలోనూ ఇలాంటి సందర్భాలు చూశామని గుర్తు చేస్తున్నారు. కంటెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీఎంఎస్) రావడంతో హెచ్‌టీఎంఎల్‌పై ప్రత్యేకంగా పనిచేసే 'వెబ్‌మాస్టర్స్' అనే రోల్స్ కనుమరుగైన విషయాన్ని చెబుతున్నారు.

మరింత క్లిష్టంగా పరిస్థితులు

భవిష్యత్తుల్లో దాదాపు 40 కోట్ల ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తుందని, ఇది మొత్తం ప్రపంచ శ్రామిక శక్తిలో 15 శాతమని మెకిన్సే నివేదిక అంచనా వేసింది. మన దేశంలోనే ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలుగా ఉన్న ఐఐటీల విద్యార్థులు కూడా ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు పొందడం గగనంగా మారింది. డాటా సేకరణ, డాటా ప్రాసెసింగ్‌కు సంబంధించిన ఐటీ ఉద్యోగాలకు డిమాండ్ క్రమంగా పడిపోతున్నది. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాలు తాజా పరిస్థితులు మరింత క్లిష్టంగా ఉండనున్నాయి. ప్రతి ఏటా జాబ్‌మార్కెట్‌లోకి ప్రవేశించే లక్షలాది మంది యువతకు ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉంటుంది.

పలు ఇతర రంగాల్లో ఉద్యోగాల సృష్టి

టెక్నాలజీ అభివృద్ధి, విస్తరణ అనేది నిరంతరాయంగా కొనసాగుతుంది. అయితే ఏఐతో కోల్పోయే ఉద్యోగాలు విషయం అటుంచితే.. మరోవైపు కొన్ని ఇతర రంగాల్లో ఉద్యోగాల సృష్టి జరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణ, ఆరోగ్య రంగం, గ్రీన్ ఎనర్జీ, శక్తి పరివర్తన, ఇతర డీప్ టెక్ డొమైన్స్‌లో కొత్తగా 80 కోట్ల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని, ఇది ప్రపంచ శ్రామిక శక్తికి 21-33 శాతం వరకు జోడిస్తుందని చెబుతున్నారు. మరోవైపు భారత్‌లో ప్రస్తుతం దాదాపు 3 వేలకు పైగా ఉన్న డీప్ టెక్ స్టార్టప్‌ల(ఇంజినీరింగ్‌లో హైటెక్ ఆవిష్కరణలు లేదా గణనీయ శాస్త్రీయ పురోగతి ఆధారిత వ్యాపార నమూనా గల సంస్థలు) సంఖ్య 2030 నాటికి 10 వేల దాటుతుందని నాస్కామ్ అంచనా వేసింది.

రోబోనే పెళ్లాడతా!

- 'గిగా'పై మనసు పడ్డ రాజస్థాన్ ఇంజినీర్
- రూ.19 లక్షల ఖర్చుతో 'వధువు' తయారీ



జయపుర: రోబో సినిమాలో ప్రేమకథను గుర్తుకు తెచ్చే ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకొంది. కాకపోతే ఈ లవ్ స్టోరీలో మనిషి రోబోను ప్రేమించి పెండ్లి చేసుకోబోతున్నాడంతే! ఇందుకోసం ఆ వరుడు ఏకంగా రూ.19 లక్షలు వెచ్చించి తమిళనాడులో పెండ్లి కూతురైన 'గిగా' రోబోను తయారు చేయిస్తున్నారు. రాజస్థాన్‌లోని జయపుర జిల్లా సీకర్ నివాసి అయిన సూర్యప్రకాశ్‌కు చిన్నప్పటి నుంచి రోబోలంటే ఎంతో ఆసక్తి. ఆ ఆసక్తితోనే రోబోటిక్స్ చదివి చాలా రోబోటిక్ ప్రాజెక్టుల్లో పని చేశారు. ఆ క్రమంలోనే రోబో గిగాను ప్రేమించారు. దాన్నే పెండ్లి చేసుకుంటానని తన కుటుంబానికి చెప్పారు. మొదట వారు ఈ విషయం విని షాక్ తిన్నా.. తర్వాత ఒప్పుకున్నారు. గిగా రోబోకు ఢిల్లీలో ప్రోగ్రామింగ్ చేయిస్తానని సూర్యప్రకాశ్ చెప్తున్నారు. 'నేను గిగాను సంప్రదాయబద్ధంగా పెండ్లి చేసుకొంటా. గిగా ఎనిమిది గంటలు పని చేస్తుంది. ఇది అందరినీ హాలో అని పలకరిస్తుంది. అని తనకు కాబోయే భార్య గురించి గొప్పగా చెప్పారు సూర్యప్రకాశ్!



మహదేవ్ బెట్టింగ్ కేసులో నటుడు సాహిల్‌ఖాన్ అరెస్టు

ముంబై, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో ముంబై పోలీసులు నటుడు సాహిల్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. బాంబే హైకోర్టు అతని ముందస్తు బెయిల్ దరఖాస్తును తిరస్కరించడంతో, ముంబై సైబర్ సెల్‌కు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఛత్తీస్‌గఢ్‌లో ఆయన్ను అరెస్టు చేసింది. అంతకుముందు, 2023 డిసెంబర్‌లో సాహిల్‌తో పాటు మరో ముగ్గురిని సిట్ విచారణకు పిలిచింది. కానీ వారు హాజరు కాలేదు. కాంట్రాక్ట్ ప్రకారం తాను బ్రాండ్ అంబాసిడర్ మాత్రమేనని సాహిల్ పేర్కొన్నారు. అయితే ఈ యాప్‌కు సహ యజమాని సాహిల్ అని పోలీసులు తెలిపారు.

మాజీ రెజ్లర్‌ను పెండ్లాడిన ఇండియన్ బిలియనీర్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: భారత సంతతికి చెందిన బిలియనర్, బిల్ట్ రివార్డ్స్ సీఈవో అంకుర్ జైన్, మాజీ డబ్ల్యుడబ్ల్యూఈ రెజ్లర్ ఎరికా హమ్మొండ్ శుక్రవారం ఈజిప్ట్‌లోని పిరమిడ్‌ల సాక్షిగా వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కైరోలో అత్యంత ఆడంబరంగా జరిగిన ఈ వివాహ తంతుకు ప్రముఖ సెలబ్రిటీలు లాన్స్ బాస్, మైఖేల్ టుర్చిన్, రాబిన్ థిక్కే, షార్క్ ట్యాంక్ ఇన్వెస్టర్ కెవిన్ ఓ లీరీతో పాటు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు మొత్తం 130 మంది హాజరైనట్టు పేజి సిక్స్ వార్తా సంస్థ వెల్లడించింది. అతిథులు ఆఫ్రికా సఫారీ నుంచి వివాహ వేదికకు ప్రైవేట్ ఫ్లయిట్ ద్వారా చేరుకున్నారు. వాస్తవానికి 34 ఏండ్ల జైన్ తొలుత తన వివాహాన్ని అంతరిక్షంలో చేసుకోవాలని భావించారు. అయితే దీనికి ఎరికా ఆసక్తి చూపకపోవడంతో ఈజిప్ట్‌లో జరుపుకున్నారు.

క్యూబాలో నగదు సంక్షోభం

బ్యాంకులు, ఏటీఎంల ముందు భారీ క్యూలు

హవానా, ఏప్రిల్ 28: ద్వీప దేశం క్యూబాలో నగదు సంక్షోభం ఏర్పడింది. రోజువారీ కార్యకలాపాలకు సైతం నగదు లభించకపోవడంతో ఆదివారం దేశంలోని పలు ప్రాంతాల్లో నగదు కోసం బ్యాంకులు, ఏటీఎంల ముందు పౌరులు బారులు తీరారు. కాగా, గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదని, దేశ ఆర్థిక సంక్షోభానికి ఈ పరిస్థితులు నిదర్శనమని పలువురు ఆర్థిక వేత్తలు వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో పెరుగుతున్న ద్రవ్య లోటు ఈ పరిస్థితికి కారణమని క్యూబాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త ఒమర్ ఎవర్లేనీ పేరెజ్ పేర్కొన్నారు. 1,000 క్యూబన్ పెసోలు కన్నా ఎక్కువ డినామినేషన్ ఉన్న నోట్ల అలభ్యత కూడా దీనికి కారణమన్నారు. అధిక ద్రవ్యోల్బణం కారణంగా బ్యాంకులకు నగదు తిరిగి రావడం లేదని ఆయన చెప్పారు.



వేగంగా వేడెక్కుతున్న హిందూ మహాసముద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: 2020-2100 మధ్య హిందూ మహా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 1.4 డిగ్రీల నుంచి 3 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉన్నదని తాజా అధ్యయనం అంచనా వేసింది. దీని వల్ల వడగాడ్పులు, తుఫానులు తీవ్రతరం కానున్నాయని హెచ్చరించారు. రుతు పవనాలు గతి తప్పుతాయని, సముద్ర మట్టాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పుణే 'ఐఐటీఎం' వాతావరణ శాస్త్రవేత్త రాక్సీ మాథ్యూ ఈ అధ్యయనానికి నేతృత్వం వహించారు. హిందూ మహాసముద్రం వేడెక్కడం కేవలం ఉపరితలానికే పరిమితం కాలేదని, సముద్రం 2000 మీటర్ల లోతు వరకు వేడి ప్రభావం ఉంటున్నట్టు అధ్యయనం పేర్కొన్నది.

ట్రాఫిక్ ధ్వనితో హృద్రోగాలు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ట్రాఫిక్‌లో వాహనాల రొద, హారన్ల మోతతో చికాకు వస్తుంది. చికాకు మాత్రమే కాదు.. హృద్రోగ ముప్పునకు కూడా ట్రాఫిక్ ధ్వని కారణం అవుతున్నదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రతి 10 డెసిబుల్స్ ధ్వని పెరుగుదలతో చాలా మందిలో గుండెపోటు, మధుమేహం తదితర సమస్యలు 3.2 శాతం పెరుగుతున్నాయని తేల్చారు. ఇకపై హృద్రోగాలకు ట్రాఫిక్ ధ్వని కూడా ఒక కారణంగా నిర్ణయించాల్సిన అవసరం ఉన్నదని జర్మనీకి చెందిన యూనివర్సిటీ మెడికల్ సెంటర్ మెయింజ్ పరిశోధకులు తెలిపారు. ముఖ్యంగా రాత్రిపూట ట్రాఫిక్ ధ్వని వల్ల నిద్రభంగం ఏర్పడి, రక్తనాళాల్లో ఒత్తిడి హార్మోన్లు పెరిగి రక్తపోటుకు కారణం అవుతున్నదని వివరించారు. ఈ అధ్యయనాన్ని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం రోడ్డు, రైలు, విమాన ట్రాఫిక్ ధ్వనిని నియంత్రించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అవ్వాతాతల ఆహారం.. మనవళ్లపై ప్రభావం!

న్యూఢిల్లీ: అవ్వాతాతలు తినే ఆహారం వారి మనవళ్లపై ప్రభావం చూపుతుందని తాజా అధ్యయనంలో తేలింది. వారి జన్యు లక్షణాల్లో మార్పునకు దారితీస్తున్నదని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ సైంటిస్టులు కనుగొన్నారు. 8 దశాబ్దాలుగా వంశపారంపర్య జన్యు లక్షణాలపై అధ్యయనం చేపట్టిన సైంటిస్టులు, ఆహార ఎంపికలు కూడా జన్యు మార్పిడికి కారణమవుతున్నట్టు తేల్చారు. నెదర్లాండ్స్‌లో నాజీలు ఆక్రమించుకున్న ప్రాంతాల ప్రజల 'ఎపిజెనిటిక్స్'ను సైంటిస్టులు ఉదహరించారు. 2 వేల కిలో క్యాలరీల శక్తినిచ్చే ఆహారం పొందలేక, కేవలం 400 నుంచి 800 కిలో క్యాలరీల శక్తినిచ్చే ఆహారంతో సరిపుచ్చుకోవటం, వారి పిల్లల జన్యుమార్పిడికి దారితీసిందని సైంటిస్టులు చెబుతున్నారు. పెరుగుదల, అభివృద్ధికి చెందిన ఐజీఎఫ్2 అనే జన్యువుల్లో మార్పులకు కారణమైందని కనుగొన్నారు.

దుబాయ్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద ఎయిర్‌పోర్ట్

రూ.2.9 లక్షల కోట్లతో నిర్మాణం

దుబాయ్, ఏప్రిల్ 28: ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని దుబాయ్‌లో నిర్మించబోతున్నారు. ప్రస్తుతం ఈ నగరంలోని విమానాశ్రయానికి ఐదు రెట్లు పెద్దదైన ఎయిర్‌పోర్ట్ త్వరలో ఇక్కడ ఏర్పాటుకాబోతున్నది. ఈ విషయాన్ని దుబాయ్ రాజు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తోమ్ ఆదివారం ప్రకటించారు. 35 బిలియన్ డాలర్లు (రూ.2.9 లక్షల కోట్లు) ఖర్చుతో 'అల్ మక్తోమ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్' నిర్మాణాన్ని చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. 5 సమాంతర రన్‌వేలు, 400 ఎయిర్‌క్రాఫ్ట్ గేట్స్, 26 కోట్లమంది ప్రయాణికుల సామర్థ్యం(ఒక ఏడాదిలో) దీని ప్రత్యేకతలుగా చెప్పారు.

చిత్రం

'పుష్ప 2' అంతా స్నేహమయమే



సినిమాలో వాణిజ్య హంగులు ఎన్ని ఉన్నా, కథలో ఎమోషన్స్ లేకపోతే జనం చూడరు. అంటే సినిమా విజయానికి కావాల్సిన ప్రధాన బలం ఎమోషన్స్ అనమాట. కథలోని ఎమోషన్ కట్టిపడేస్తే ఇక ఆ సినిమా విజయాన్ని ఎవరూ ఆపలేరు. ఉదాహరణకు 'పుష్ప'నే తీసుకుందాం. ఇందులో కావల్సినన్ని వాణిజ్యహంగులున్నాయి. కానీ జనం కనెక్టయింది ఎమోషన్స్‌కే. పుష్పరాజ్‌కీ, పుష్పరాజ్ తల్లికీ మధ్య ఉండే ఎమోషన్స్, 'పుష్ప' ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్, శ్రీవల్లికీ, పుష్పరాజ్‌కీ మధ్య నడిచే భావోద్వేగాలు.. ఇవి లేకుండా 'పుష్ప'ను చూడగలమా? అసలు 'పుష్ప' అంత హిట్ కావడానికి కారణం ఆ ఉద్వేగాలే. దర్శకుడు సుకుమార్‌కు ఈ విషయం బాగా తెలుసు. అందుకే 'పుష్ప 2'లో కూడా అద్భుతమైన భావోద్వేగాలు ఉండేలా కథ రాసుకున్నారు. 'పుష్ప'లో తల్లీకొడుకుల సెంటిమెంట్, పుష్ప, శ్రీవల్లీల లవ్‌ట్రాక్ హైలైట్ అయితే.. 'పుష్ప 2'లో ఫ్రెండ్‌షిప్ హైలైట్ కానుందట. పుష్పరాజ్, కేశవల స్నేహబంధంపై అద్భుతమైన ఎపిసోడ్స్ కుదిరాయని, వీరిద్దరి మధ్య సాలిడ్ ఎమోషన్స్ ఉంటాయని తెలుస్తున్నది. అల్లు అర్జున్ పెర్‌ఫార్మెన్స్ కూడా నెక్ట్స్ లెవల్లో ఉంటుందని సమాచారం. మరి ఈ ఏడాది ఆగస్ట్ 15న రానున్న 'పుష్ప2' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి. మైత్రీమూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే.



రొమాంటిక్ ప్రియదర్శి

కమెడియన్‌గా మొదలై, తక్కువ సమయంలోనే హీరోగా ప్రమోట్ అయ్యాడు ప్రియదర్శి. తనను హీరోగా పెట్టి సినిమాలు తీయడానికి నిర్మాతలు ఉత్సాహం చూపుతున్నారు. తాజాగా ప్రియదర్శి చేయనున్న కొత్త సినిమాకు చెందిన ప్రకటన ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి జాన్వీ నారంగ్ నిర్మాత. సునీల్ నారంగ్, భరత్ నారంగ్, ఎస్‌వీసీఎల్‌ఎల్‌పీ, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా కలిసి సగర్వంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం విశేషం. సరికొత్త కాన్సెప్ట్‌తో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, ఇందులో ప్రియదర్శి విభిన్నమైన పాత్రను పోషించనున్నారని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, త్వరలోనే ప్రీప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తామని, వచ్చే ఏడాది జనవరిలో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని మేకర్స్ తెలిపారు.



పేరెంట్స్ వల్ల సినిమాలు కోల్పోయా

' కథకు న్యాయం చేయడం నటీనటుల బాధ్యత. కథ అడిగింది మేం చేయాలి. 'నేను చేయను' అంటూ భీష్మించుకుని కూర్చుంటే ఇక్కడ ఎదగలేం.' అంటున్నది అందాలభామ మృణాళ్‌ఠాకూర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ముద్దు సన్నివేశాలపై ఆసక్తికరంగా మాట్లాడింది మృణాళ్. 'కెరీర్ తొలినాళ్లలో ముద్దు సన్నివేశాల్లో నటించేందుకు మా పేరెంట్స్ ఒప్పుకోలేదు. ఈ కారణంతో చాలా సినిమాలను కోల్పోయాను. ఆ తర్వాత నేనే వాళ్లను ఒప్పించాను. దర్శకుడు యాక్షన్ చెప్పగానే మేం పాత్రగా మారిపోవాలి. అప్పుడు నేను మృణాళ్‌ని కాను. ఈ విషయం అమ్మానాన్నలకు అర్థం కావడానికి కాస్త సమయం పట్టింది' అంటూ చెప్పుకొచ్చింది మృణాళ్ ఠాకూర్.





తలైవి ఈజ్ బ్యాక్

సినిమాలు చేయకపోయినా సమంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఇసుమంత కూడా తగ్గలేదు. సాంఘిక మాధ్యమాల్లో ఆమెను అనుసరించేవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. తను ఇన్‌స్టాలో ఏ పోస్ట్ పెట్టినా దానికి స్పందన అనూహ్యంగానే ఉంటుంది. సామ్ కొత్త సినిమా కోసం అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటే, తనేమో తీరిగ్గా ఇన్‌స్టాలో ఫొటోలను పోస్ట్ చేస్తూ కాలం గడిపేస్తున్నది. అయితే.. తాజాగా ఆమె ఇన్‌స్టాలో ఓ ఫొటో ప్రత్యక్షమైంది. అది ఆమె తాజా సినిమా పోస్టర్. సినిమాపేరు 'మా యింటి బంగారం'. సినిమా పేరైతే సున్నితంగా ఉందిగానీ.. పోస్టర్ నిండా వయొలెన్సే కనిపిస్తున్నది. ఎర్ర చీర.. మెడలో మంగళ సూత్రం.. రక్తసిక్తమైన శరీరం.. చేతిలో తుపాకీ.. చూడ్డానికి గృహిణిలా కనిపిస్తున్నది. అయితే.. ఆ రూపం చూస్తుంటే అపరకాళికలా అనిపిస్తున్నది. మరి ఈ కథేంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. విశేషమేంటంటే.. తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'పై సామ్ తెరకెక్కించే సినిమా ఇదే. అయితే.. ఈ పోస్టర్‌లో సమంత తప్ప మిగతా ఏ వివరాలూ లేవు. అభిమానులు మాత్రం ఆనందంతో 'తలైవి ఈజ్ బ్యాక్' అంటూ కామెంట్లు పెడుతున్నారు.

తండ్రీకూతుళ్ల ముచ్చట్లు



'ప్రేమ ఎలా మొదలైనా.. దాని స్వభావం ఎలా ఉన్నా.. వదులుకోవడం మాత్రం కష్టం. అది ఎంత అందంగా మొదలవుతుందో.. అంత భయంకరం ముగుస్తుంది. అదొక పోరాటం' అంటున్నారు నటలోకనాయకుడు కమల్‌హాసన్. ఆయన కుమార్తె శ్రుతిహాసన్ 'ఇనిమేల్' పేరుతో స్పెషల్ సాంగ్స్‌ని విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 'ప్రేమ వారసత్వం' పేరుతో మరో పాటను శ్రుతి విడుదల చేయనున్నది. ఈ పాటకు కమల్‌హాసన్ సాహిత్యం అందించడం విశేషం. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ సందర్భంగా ఈ తండ్రీకూతుళ్లు ఓ వీడియో విడుదల చేశారు. ఆ వీడియోలో కమల్, శ్రుతిల మాటలు ఇలా సాగాయి. ' సంప్రదాయాలు, సామాజిక పరిస్థితులు నచ్చకపోతే వదిలేశాను. ప్రేమను మాత్రం వదులుకోలేకపోయాను' అని కమల్ అంటే.. ' మానాన్న నన్ను అందరిలా పెంచలేదు. ఆయన ఎమోషన్స్‌ని బయటకు కనిపించనివ్వరు. చిన్న పిల్లలు తండ్రులతో ఉండే రీల్స్ నాకాయన పంపినప్పుడు నన్ను మిస్ అవుతున్నారని నాకు అర్థమవుతుంది. నేను ఎప్పటికీ నాన్న కూచినే' అని శ్రుతి చెప్పింది. ప్రస్తుతం ఈ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నది.

'హను-మాన్' దర్శకుడితో భేటి

'హను-మాన్' దర్శకుడు ప్రశాంత్‌వర్మ ముంబయ్‌లో రణవీర్ సింగ్‌ని కలిశారు. ఈ కలయిక ప్రస్తుతం ముంబయ్ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.



గత కొన్ని రోజులుగా రణవీర్ శక్తిమాన్ తరహా పాత్ర చేయనున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. 'హను-మాన్' తర్వాత 'జై హనుమాన్' చేయనున్నట్టు ప్రశాంత్ వర్మ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరూ కలవడం బాలీవుడ్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రణ్‌వీర్ చేయనున్న ఆ శక్తిమాన్ హనుమంతుడే అంటూ మీడియాలో కథనాలు కూడా వెలువడుతున్నాయి. మరి రణ్‌వీర్‌ని ప్రశాంత్‌వర్మ 'జై హనుమాన్' కోసం కలిశారా? లేక 'జై హనుమాన్' తర్వాత తాను చేయబోయే మరో సినిమా కోసం కలిశారా? అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.



తండ్రీకొడుకుల అనుబంధం

'నేను నటించిన చిత్రాలకు పనిచేసిన దర్శకుల నుండి నేర్చుకున్న విషయాల ఆధారంగా ఈ సినిమాకు దర్శకత్వం వహించాను. ఇప్పటివరకూ వంద చిత్రాల్లో నటించా. ఆ సినిమాల దర్శకులందరూ నాకు గురువులే. వారు నేర్పిన పాఠాలతోనే దర్శకుడిగా మారాను. సముద్రఖని అన్న లేకుంటే ఈ సినిమా పూర్తయ్యేదికాదు, నేను దర్శకుడిని అయ్యేవాడ్ని కాదు. ప్రతి ఒక్కరూ నాన్నతో కలిసి చూడాల్సిన సినిమా ఇది' అని ధనరాజ్ అన్నారు. ఆయన దర్శకుడిగా మారి తెరకెక్కిస్తున్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. సముద్ర ఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి పృథ్వీ పోలవరపు నిర్మాత. ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. దర్శకుడు బాలా, పాండిరాజ్, నటులు బాబీ సింహా, తంబి రామయ్య, హాస్యనటుడు సూరి, దీపక్, హరీశ్ ఈ కార్యక్రమంలో పాల్గొని చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. తండ్రీకొడుకుల అనుబంధం గురించి చెప్పే సినిమా ఇదని, సముద్రఖని లేకపోతే ఈ సినిమా లేదని నిర్మాత తెలిపారు. ధనరాజ్‌పై ఉన్న నమ్మకంతో ఈ కథను తననే డైరెక్ట్ చేయమని చెప్పానని, తను కచ్చితంగా పెద్ద విజయాన్ని అందుకుంటాడని సముద్రఖని నమ్మకం వెలిబుచ్చారు.

రాజు యాదవ్ గీతాలు



'జబర్దస్త్' ఫేం గెటప్‌శ్రీను హీరోగా రూపొందిస్తున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకుడు. కె.ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మాతలు. మే 17న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా 'థిస్ ఈజ్ మై దరిద్రం..' అంటూ సాగే గీతాన్ని సుడిగాలి సుధీర్ చేతులమీదుగా మేకర్స్ విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరపరచగా, రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ ఆలపించారు. ఈ పాటలో హీరోకు ఎదురయ్యే అనుభవాలు నవ్వులు పంచుతాయని మేకర్స్ చెబుతున్నారు. ప్రేమ, వినోదంతోపాటు మనసుల్ని హత్తునే భావోద్వేగాలు కూడా ఈ కథలో ఉంటాయని వారు చెబుతున్నారు. అంకిత ఖరత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆనంద్ చక్రపాణి, రాకెట్ రాఘవ, మిర్చి హేమంత్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్.

జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 29 ఏప్రిల్ 2024 www.ntnews.com

పూడిక తీత

కథాసుధ

వేసవి కాలంలో ఓ ఊళ్లోని గుడి దగ్గర కోలాహలంగా ఉంది. ఎందుకంటే కొందరు కళాకారులు అక్కడ రెండువారాల పాటు మహాభారతంలోని పర్వాలన్నిటినీ వీధి నాటక రూపంలో ప్రదర్శించే వారు. గ్రామస్తులు సాయంకాలానికి పనులన్నీ ముగించుకుని గుడి దగ్గరికి వెళ్లి శ్రద్ధగా నాటకాలు చూసేవారు. సమీపంలోని గ్రామవాసులు కూడా నాటకాలు చూసేందుకు తరలి వచ్చేవారు. ద్రౌపది వస్త్రాపహరణం, బకాసుర వధ, శ్రీకృష్ణ రాయబారం, దుర్యోధన వధ లాంటి ఘట్టాలను ప్రదర్శించే రోజుల్లో జనం కిక్కిరిసిపోయేవారు. ఒకరోజు గ్రామపెద్ద వీధి నాటకాన్ని చూడటానికి బయల్దేరుతుండగా ఓ రైతు పొలంలో ఉండటాన్ని గమనించాడు.

'నాటకాలు చక్కగా జరుగుతున్నాయి. వచ్చి చూడరాదా!' అని రైతును ఆహ్వానించాడు గ్రామపెద్ద. 'అయ్యా! గతేడాది చూశాను. మహాభారతం నాటకాన్ని ఎన్నిసార్లు చూసినా ఒకటే కదా. కొత్తగా ఏముంటుంది చూడటానికి' అన్నాడు రైతు. గ్రామపెద్ద నవ్వి 'పొలంలోని బావిలో నీళ్లు ఇంకిపోతే ఏం చేస్తావు?' అని అడిగాడు. 'పూడిక తీయిస్తాను. అప్పుడు కొత్త నీళ్లు వస్తాయి. చాలా తేటగాను, రుచిగానూ ఉంటాయ'ని బదులిచ్చాడు రైతు. 'మళ్లీ ఎండిపోతే' అన్నాడు గ్రామపెద్ద. 'మళ్లీ పూడిక తీయించక తప్పదు కదా బాబూ' అన్నాడు రైతు. 'మహాభారతం ఎన్నిసార్లు విన్నా, చదివినా, ఆ నాటకాలను అనేకసార్లు చూసినా మనకు కొత్తగా ఎన్నో మంచి విషయాలు తెలు



స్తాయి. బావిలోని అడ్డును పూడికతీత ద్వారా తొలగించినట్లు, భారతాన్ని మళ్లీ మళ్లీ వింటే అది మన మనసులోని అనేక అడ్డుపొరలను తొలగిస్తుంది. పూడిక తీసిన బావిలో వచ్చే తేటనీళ్లలా మన మనసు స్వచ్ఛంగా తయారవుతుంది. జీవన పోరాటంలో ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించుకునే శక్తి మనకు లభిస్తుంది' అని చెప్పి గ్రామపెద్ద అక్కడి నుంచి బయల్దేరాడు. అతని వెనుకే రైతు కూడా భారత నాటకం చూడటానికి బయల్దేరుతాడు.

... ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

సమస్యా పరిష్కారమూ నీదే..

గీతావాక్యం

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా॥

(భగవద్గీత 1-32)

ఈ ప్రపంచంలోని ప్రతి వ్యక్తి కోరుకునేది ఆనందాన్నే. అయితే ఆ ఆనందం అందరూ అనుభవించగలుగుతున్నారా? లేదు అనుకుంటే.. కారణం ఏమిటి? అంటే తాను 'కోరిన' ఆనందం వేరు.. తనకు 'అవసరమైన' ఆనందం వేరు. ఈ రెండిటి మధ్య భేదాన్ని గుర్తించలేని మానసిక స్థితి కలిగిన మానవుడు.. ఎంత సాధించినా అసంతృప్తితో రగిలిపోతూ కర్తవ్యాన్ని విస్మరిస్తాడు.

ప్రతి వ్యక్తి జీవితానికి ఒక ప్రయోజనం ఉంటుంది.. అలాగే కొన్ని ఇష్టాయిష్టాలు ఉంటాయి. దేనికోసం దేనిని వదులుకోవాలో తెలుసుకోవడమే జ్ఞానం.. అదే విజ్ఞత. అదే మన లక్ష్యాన్ని నిర్ణయిస్తుంది. సాధారణ వ్యక్తికి ఇందులో దేనిని ఆదరించాలనే సమస్య



వస్తుంది. సమస్య తనది కాబట్టి తానే పరిష్కార మార్గాన్ని అన్వేషించాలనీ, ఆ పరిష్కారమూ తనయందే ఉన్నదని గ్రహించగలిగిన వారు అన్వేషకులు. వాళ్లే సాధకులు. నిజానికి అదే సమస్యా పరిష్కారానికి మొదటి మెట్టు.

మహాభారత యుద్ధరంగంలో ఉభయ సైన్యాలలో ఉన్న తన చుట్టాలు, గురువులు, మిత్రులను చూడగానే అర్జునునికి జాలి కలిగింది. ఆత్మీయులైన వీరితోనా తాను యుద్ధం చేయాలి. వైరిబలాలలో ఉన్న తన వారిని తాను సంహరించినా.. వైరివర్గం వారు తన పక్షంలోని వారిని సంహరించినా.. తనకు మిగిలేది దుఃఖమే కదా! ఈ స్వజన సంహారంతో లభించే సామ్రాజ్యం తనకు సంతోషాన్ని ఇస్తుందా? భౌతిక సంపదను పొందడానికి చేసే స్వజన సంహారం అన్యాయం కాదా? బంధుమిత్రులను చంపి తాను తినే నెత్తుటికూడు ప్రశాంతతను ఇస్తుందా? పరిణామాలు తెలిసీ హింసాత్మకమైన యుద్ధ మార్గంలో నడవడం కన్నా అడవులలో కందమూలాలు తింటూ.. తపస్సు చేసుకోవడం ఉత్తమ మానవ ధర్మం కాదా? ఇది కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునునికి ఎదురైన సమస్య. దాని పరిష్కారానికి తన సామర్థ్యం సరిపోదని గ్రహించిన అర్జునుడు తాను నమ్మి, నారాయణునిగా భావించిన కృష్ణుడి సాయం కోరాడు.

యుద్ధంలో తనవారు చనిపోతారనే భావన వల్ల కలిగిన జాలి వారిని చిరకాలం బ్రతికిస్తుందా? లేదు! మరి ఆ జాలికి కారణం? మృత్యుభీతి. నిజానికి చేసే పనిలో ఆనందాన్ని పొందని వ్యక్తిలో అనేక సంశయాలు వెలుగుచూస్తాయి. తాను చేస్తున్న పని పవిత్రమైనదనీ, తాను ఆ కార్య నిర్వహణలో ఉపకరణం మాత్రమే తప్ప కర్తను కాననీ, త్రికరణశుద్ధిగా నమ్మి ఆ పనిని ఉపాసనగా భావించి ఆచరించే వ్యక్తి ఆ పనిలో భగవంతుడిని దర్శిస్తాడు. దానినే 'రసోవైసహ' అన్నారు పెద్దలు. బాధపడటం వల్ల సమస్య పరిష్కారం కాదు. బాధ అనేది ఒక ఊగే కుర్చీ లాంటిది. అది నిరంతరం తీరికలేకుండా చేస్తుందేకాని ఒక అంగుళం కూడా ముందుకు కదిలించదు.

ఆ సమయంలో కృష్ణుడు... 'అర్జునా! నీవు సమస్యలోని బాహ్యాపార్శ్వాన్నే చూస్తున్నావే కాని.. అంతరంగంలోకి చూడటం లేదు. ఆంతర్యాన్ని గ్రహించు నీ సందేహాలు తీరిపోతాయి' అన్నాడు. నిజానికి అర్జునుడి సందేహం మనందరిది కూడా. భగవంతుడు ఉపదేశించిన గీతలో చూడాల్సింది పదాలను కాదు.. వాటి వెనుక దాగిన రహస్యాన్ని. సమస్యలను ఎదిరించి పరిష్కరించుకోవాలే కాని... పారిపోవడం సమంజసం కాదు. సమస్యల నుంచి సమస్యలను సృష్టించుకోవడం కాదు.. సమస్యలలో సమరసతను చూడటం అలవర్చుకోవాలి. అలా ఆలోచించగలిగిన వారిలో జాత్యంతరీకరణ జరుగుతుంది. వారే విజయ సాధకులుగా నిలుస్తారు. అదే గీతాబోధనకు అంతిమ ఫలితం.

... పాలకుర్తి రామమూర్తి

గ్రహణ సందేశం

సూర్యుడి కుటుంబంలో బుధుడు, శుక్రుడు మినహా మిగిలిన అన్ని గ్రహాలకూ ఉపగ్రహాలు ఉన్నాయి. భూమికి– చంద్రుడు, అంగారకుడికి– ఫాబోస్, డైమోస్, ఇక బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలకు చాలా ఉపగ్రహాలు ఉన్నాయి. గ్రహాలు సూర్యుడి చుట్టూ తిరిగితే, ఉపగ్రహాలు గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. ఈ విధమైన ఏర్పాటు కారణంగా సూర్యుడికి, సంబంధిత గ్రహానికి మధ్య ఉపగ్రహం వచ్చే పరిస్థితులు ఏర్పడతాయి. భూమి విషయంలో... సూర్యుడికి భూమికి మధ్య చంద్రుడు వస్తాడు. ఇది అమావాస్య రోజుల్లో జరుగుతుంది. ఈ సమయంలో సూర్యుడు పాక్షికంగానో, పూర్తిగానో కనిపించడు. ఈ ఖగోళ అద్భుతాన్ని సూర్య గ్రహణం అని




పిలుస్తారు. ఇక సూర్యుడు– చంద్రుడికి మధ్య భూమి రావడం వల్ల మనకు చంద్రగ్రహణం ఏర్పడుతుంది. మరో కోణంలో చూస్తే... ఇది చంద్రుడికి సూర్యగ్రహణం అవుతుంది. గ్రహణాలు భూమ్మీద వచ్చినా, ఇతర గ్రహాల మీద వచ్చినా... మనిషి ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా సత్యాన్వేషణలో ఎన్నో ఆటంకాలు ఎదురవుతాయనే సందేశం వీటిలో ఇమిడి ఉంటుంది. అవాంతరాలు ఎదురైనా అవి తాత్కాలికమే... సత్యం నిత్యంగా వెలుగుతూ ఉంటుందని గ్రహణాలు మనకు తెలియజేస్తాయి. కాబట్టి, సత్యాన్ని తెలుసుకునే క్రమంలో మనం సహనంతో, అచంచలమైన విశ్వాసంతో ఉంటే ఆటంకాలు వాటంతట అవే పక్కకు తొలగిపోతాయి. ఇదే గ్రహణ సందేశం.

లీలామానుష విగ్రహుడైన గోపాల కృష్ణుని బాల్యలీలలలో ఐశ్వర్య మాధుర్య శక్తుల మేలు కలయిక అయిన 'ఉలూఖల బంధన' (దామోదర) లీల తాత్త్వికంగా చాలా కీలకమైనది. శ్రీ శుక ఉవాచ.. రాజా! ఎలాగైతేనేమి, నందబాల యశోద వసుదేవ నందనుణ్ణి పట్టుకొన్నది. పట్టుకొన్నదే కాని, అతనిని కొట్టడానికి ఆమెకు చేతులు రాలేదు. కుసుమ కోమలమైన మేను, మనసూ కల యశోద పసివాని మీద జాలిపడి, పోనీలే- కొట్టకుండా కట్టివేద్దామని తలచింది.

❖ ❖ ❖

వెన్న దొంగిలించి పారిపోతూ యశోద చేతికి చిక్కిన చిన్నికృష్ణుని వన్నెచిన్నెలను పోతన తనవైన ఎన్నో పద్యాలలో ఘనంగా వర్ణించాడు. 'పుష్టి భక్తి'కి ప్రతీక అయిన యశోద నోట అప్రయత్నంగా అధోక్షజుని- విష్ణుని అసలు తత్త్వాన్ని- జ్ఞానాన్ని భక్తిరసంతో రంగరించి హృదయంగమంగా విశదపరిచాడు. 'నే పలికిన భవహర మగునట' అన్న తన మాట నీటి మూట కాదని తేటపరుస్తూ పలికించాడు.



బొజ్జ దిరిగి రాదయ్యె!..

కం॥ 'పట్టినఁ బట్టువడని నినుఁ
బట్టెదనని చలముఁ గొనినఁ బట్టుట బెట్టే?
పట్టువడవంద్రు పట్టీ!
పట్టుకొనన్ నాకుఁగాక పరులకు వశమే?'

యశోద ఇలా అన్నది... 'పట్టీ! (బిడ్డా) నన్ను ఎవరూ పట్టుకోలేరని నువ్వు అనుకుంటున్నావు. నీవు అంత తేలికగా పట్టుబడేవాడవు కావని ఇతరులందరూ కూడా అంటారు. కాని, పట్టాలని పట్టుదల ఉన్నా నిన్ను పట్టడం పెద్ద రట్టు (కష్టం) అనుకున్నావా? చిన్నా! నిన్ను పట్టుకోవడం నాకు కాక పరులకు సాధ్యమవుతుందా?


కం॥ 'ఎక్కడనైనను దిరిగెద
వొక్కయెడన్ గుణము కలిగి యుండవు, నియమం
బెక్కడిది నీకు మరచినఁ
జక్కగఁ బోయెదవు పెక్కు జాడలఁ బుత్రా'

'నాన్నా! నువ్వు బెదురులేక ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ ఎదురుపడుతూ ఉంటావు. ఒక్క చోట కుదురుగా చక్కగా బుద్ధి- మంచిగుణం కలిగి ఉండవు. నీ ప్రవర్తనకు ఒక పద్ధతి అంటూ లేకుండా పోయిందేమిరా? క్షణకాలం విస్మరిస్తే- ఏమరుపాటు చెందితే అందరినీ పామరులు (అజ్ఞులు)గా చేసి విలక్షణమైన వేషాలు- ఎన్నైనా వేస్తావు'.

విష్ణువు 'ఇందుగలడందు లేడని సందేహం'లేని సర్వాంతర్యామి. అన్ని రూపాలూ తన రూపమే అయినవాడు. 'వొక్కయెడన్... యుండవు'- ఎందుకని? త్రిగుణాలకు అతీతుడు కనుక. సర్వతంత్ర స్వతంత్రునికి, సర్వనియంతకు, అఖిల శక్తిధరునికి నియమ నిబంధనలు పెట్టడం ఎవరికి సాధ్యం? జీవులందరూ పరతంత్రులేగా! 'సర్వము తానైనవాడు' అన్న స్ఫురణ- ఎరుక, ఒక్క క్షణమైనా లేకపోతే, తాను 'ఏకమేవ అద్వితీయం' అయి కూడా తనను 'నానా' (అనేకం)గా- అయినవాడు (మిత్రుడు) గానూ, కానివాడు (శత్రువు) గానూ కనుకట్టు (గారడి) చేసి తోపింపజేస్తాడు.

సీ॥ 'తోయంబులివి యని తొలఁగకచొచ్చెదు
తలఁచెదు గట్టినఁ దరల నెత్త
మంటితో నాటలు మానవు, కోరాడె,
దున్నత స్తంభంబు లూపఁబోయె
దన్యుల నల్పంబు లడుగంగఁ బారెదు
రాచ వేటలఁ జాలరవ్వ దెచ్చె
దలయవు నీళ్లకు నడ్డంబుఁ గట్టెదు
ముసలివై హరివృత్తి మొనయఁ జూచె'
ఆ॥ 'దంబరంబు మొలకు నడగవు దిరిగెద
వింకఁగల్కి చేతలేల పుత్ర
నిన్ను వంప వ్రాల్ప నేనేర నటియొ నీ
విట్టు క్రింద మీద నెరుఁగకునికి'

ఈ సీస పద్యంలో యశోద తనకు వీసమంత కూడా ధ్యాస లేకుండానే దశనామాల ఊసు (ప్రస్తావన, కథనం) ఎత్తకుండా వాసుదేవ కృష్ణుని భాసురమైన దశావతారాలను 'వ్యాజస్తుతి'- నిందాస్తుతి రూపంగా అగ్గలం- గొప్పగా ఉగ్గడిం (అభివర్ణిం)చింది.



'ఒరే కన్నయ్యా! ఉరు (మిక్కిలి) ప్రమాద భరితమైన అగాధ పయోధి (సముద్ర) జలప్రవేశం నీకెంతో ప్రమోద (ఆనంద) దాయకం రా! (మత్స్యావారంలో మహోదధి జొచ్చి సోమకాసురుని ద్రచ్చి, వాడు ముచ్చిలి (దొంగలించి)న వేదాలను విధాత- బ్రహ్మదేవునకు తెచ్చి ఇచ్చావు). ఎంత పెద్ద పర్వతాన్నైనా పైకెత్తే ప్రయత్నం చేస్తావు (కూర్మావతారంలో బృందారక (దేవతా) బృందంపై కూరిమి- ప్రేమతో మందరగిరిని ఎత్తి, ఓరిమితో దానికి కుదురుగా నిలిపి, అమరులకు అమృతం పంచి, అయోగ్యులైన అసురులను వంచించావు). మట్టిలో ఆటలు మానక పొర్లాడతావు. ముట్టె (నోటి)తో ఎగజిమ్మి, ఎత్తి నెత్తిన పోసుకుంటావు (ఆది వరాహావతారం ధరించి, భూదేవిని ఉద్ధరించి, కోరలపై నిలిపి, వ్రీడ (సిగ్గు) పడుతున్న ఆమెతో ఓర చూపులతో చిలిపిగా క్రీడించావు). ఉన్నతమైన స్తంభాలను సైతం జంభం (దర్పం)తో ఊపుతూ ఛిన్నాభిన్నం చేయడానికి పూనుకుంటావు (నృసింహావతారంలో స్తంభం నుంచి సంభవించి దంభపూరితుడైన హిరణ్యకశిపుని సంహరించి, పసివాని- బాలప్రహ్లాదుని ఖేదాన్ని పరిహరించావు). నీవు అనల్పుడవైనా స్వల్పమైన వస్తువుల కొరకు పరాయి వారి వద్దకు పరుగులెత్తి చేయి చాచుతావు (వామనావతారంలో ఆఖండలు- ఇంద్రుని కొరకు బలిని మూడడుగుల స్థలి (భూమి) అర్థించి, అవామనుడ- త్రివిక్రముడవై లోకత్రయాన్ని అలవోకగా ఆక్రమించావు). రాజస ప్రవృత్తికి లోనై రాజులను వేటాడి అపకీర్తి మూటగట్టుకొన్నావు (పరశురామ అవతారంలో ఆగడాలు చేస్తున్న క్షత్రియాధములను కక్షపూని వేటాడి- శిక్షించి జగడాలు కొనితెచ్చుకున్నావు). జల ప్రవాహానికి అవలీలగా అడ్డుకట్ట వేయాలని ఆలోచిస్తావు (రామావతారంలో లేమ (సీత) కొరకై సముద్రంపై సేతువు నిర్మించావు). రోకలి వంటి దండాన్ని, నాగలిని చేతపట్టి మట్టి దున్నుట మొదలగు సేద్యపు పనులు చేయ పూనుచున్నావు (బలరాముడవై ముసలం (రోకలి), హలం (నాగలి) ఆయుధాలుగా ధరించి అనాదిగా భారతదేశపు ప్రధాన వృత్తి అయిన వ్యవసాయానికి ప్రతీకగా నిలిచావు. ప్రలంబాది అసురులను సంహరించావు). దిసమొలతో తిరుగుతావు (బుద్ధావతారంలో దిగంబరివై తిరుగ గలవు) ఇంకనూ కలికి- నేర్పరి తనపు (చాతుర్యపు) పనులెందుకు? (కల్కిగా అవతరించాల్సిన అవసరమేమి?) శ్యామలాంగా! నిన్ను లొంగదీయడంలో నాకు భంగపాటు తప్పదనేగా నీ ధైర్యం? ఈ వీరంగం- కదం తొక్కడం? అందుకే నీవు కింద మీదు కానక మిడిసిపడుతున్నావు.

కం॥ 'ఆ లలన గట్టె రోలన్
లీలన్ నవనీత చౌర్యలీలుం బ్రియవా
గ్జాలుం బరివిస్మిత గో
పాలున్ ముక్తాలలామ ఫాలున్ బాలున్'

శుకయోగి.. రాజా! అలా పలుకుచూ ఆ లలన యశోద ఉపేంద్రుని (విష్ణుని) అవతార రహస్యాలు ఉపాలంభం చేస్తూ- ఎత్తిపొడుస్తూ, నవనీత చౌర్యమే లీల (పని)గా కలవాడు, ఇంపైన మాటలు వినసొంపుగా గలగలా మాట్లాడువాడు ఫాల భాగాన- నొసటన ముక్తాలలామ (ముత్యపుబొట్టు) అలరారు- శోభించువాడు అయిన ఆ మేటి అల్లరి బాలుని, గొల్లలందరూ ముక్కున వేలేసుకొని నిక్కి నిక్కి చూస్తుండగా ఆ బోటి- నంద స్త్రీ, రోటికి కట్టుటకై తాళ్లతో పోటీ పడటానికి పూనుకుంది.'

రాజా! అవ్యక్తుడు- ఇంద్రియాలకు గోచరించనివాడు, అసంగుడు- దేనిచే కూడా అంటుపడనివాడు, మానవ లక్షణాలతో మనసు హరించే మాధవుని- కృష్ణుని విష్ణువని తెలియలేని యశోద తన ఆత్మజుని- సుతునిగా తలచి, ప్రాకృతుని- కేవలం మనుష్య బాలుని వలె బంధించింది. తన యుణ్ణి రోటికి కట్టడానికి అతని నడుము చుట్టూ నిడుపాటి తాడు చుట్టింది. ఆశ్చర్యకరంగా ముడి వేయడానికి రెండు అంగుళాలు తగ్గింది. వింత బోయి ఆ కాంత దానికి మరోతాడు సంధించగా బంధనానికి మరల అంతే- రెండు అంగుళాలే కొరంత (తక్కువ) పడ్డది.




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

కం॥ 'తజ్జనని లోగిటం గల
రజ్జు పరంపరలఁ గ్రమ్మరన్ సుతుఁగట్టన్
బొజ్జ దిరిగి రాదయ్యె జ
గజ్జాలములున్న బొజ్జఁగట్టన్ వశమే?'

'సుతుని కట్టడానికి ఆ సుదతి ఇంటిలోని అన్ని తాళ్లూ వరుసగా ముడివేసినా అంతే వెలితి ఉండిపోయింది. ముజ్జగాలూ దాగి ఉన్న ఆ రుచిరమైన (అందమైన) చిరుబొజ్జను రజ్జువులతో కట్టడం ఎవరికి సాధ్యం?'. తన అల్లరి పిల్లవాని వలన గొల్లపల్లెకు కలుగుతున్న గోస (కలత, బాధ)కు తల్లడిల్లుతున్న ఆ తల్లి ఆ గోకుల బాధను తొలగించబోయి ముల్లోకాలనూ కల్లోల పరచిందని అంటాడు లీలా శుకుడు.

(సశేషం)

శ్రమను గుర్తిస్తే..



'మజ్దూర్, కూలీ.. ఇలా ఏ పేరుతో పిలిచినా మనకు సాయపడేవారు ఎవరైనా మీ సోదరులు' అని చెప్పారు ముహమ్మద్ ప్రవక్త (స). సమాజంలో ఎవరూ ఎక్కువా తక్కువా కాదు. ఒకరినొకరు పరస్పరం సాయం అందించుకునేందుకే జాతులుగా, తెగలుగా విభజన జరిగిందని ఖురాన్ చెబుతుంది. ఎవరినైనా తమ దగ్గర పనిలో పెట్టుకుంటే వారి వేతనాన్ని చెల్లించాలన్నది ఇస్లాం బోధనల సారాంశం. వారికి చెందాల్సిన హక్కును వారికి అందించాలి. 'కూలీవాని చెమట చుక్కలు ఆరకముందే అతని కష్టార్జితాన్ని ఇచ్చేయాలి' అన్న ప్రవక్త ఉద్బోధ కష్టజీవుల కష్టార్జితం దోచుకోకూడదని చెబుతుంది. ఎవరైనా తమ వద్ద పనిచేసే కూలీవాని వేతనాన్ని ఎగ్గొట్టిన వ్యక్తికి అంతిమ దినాన కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు ప్రవక్త (స).

ప్రవక్త బోధనల గ్రంథంలోని ఓ గాథ కూలీల శ్రమకు ఎంతటి విలువ ఇవ్వాలో చాటిచెబుతుంది. పూర్వం ఒక వ్యక్తి దగ్గర ఓ కూలీ పనిచేసేవాడు. ఏ రోజు కూలీ డబ్బులు ఆరోజు తీసుకుని వెళ్లేవాడు. అయితే ఒకరోజు రోజంతా పనిచేసి తీరా కూలీ డబ్బులు ఇచ్చే సమయానికి అతను కానరాలేదు. ఆ యజమాని అతని కూలీ డబ్బులను కొన్ని రోజుల వరకూ భద్రంగా ఉంచాడు. ఎంతకూ ఆ కూలీ రాకపోయేసరికి ఆ డబ్బును తన వ్యవసాయంలో పెట్టుబడిగా పెట్టాడు. అతని వాటాకింద వచ్చిన లాభాలను మళ్లీ పెట్టుబడిగా పెట్టసాగాడు. అందులోంచి ఒక్క రూపాయి కూడా తన సొంతానికి వాడేవాడు కాదు. కొన్నేండ్లు గడిచిపోయాయి. ఒకరోజు ఆ కూలీ వాడు యజమానికి తారసపడ్డాడు. గతంలో మరచిపోయిన కూలీ డబ్బులు చెల్లించమని అడిగాడు. అప్పుడు ఆ యజమాని 'అదిగో ఆ పొలం నీదే, ఈ మేకలు, ఈ ధాన్య రాశులు నీవే' అని చెప్పడంతో ఆ కూలీవాడు ఖంగుతిన్నాడు. యజమాని చెప్పేది నమ్మలేకపోయాడు. తనను అపహాస్యం చేస్తున్నాడని తలపోశాడు. కూలీ డబ్బులు ఇచ్చేస్తే వెళ్లిపోతానని బతిమాలాడు. యజమాని అసలు విషయాన్ని పూసగుచ్చినట్లు వివరిస్తే కూలీవాడు ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

ఒకసారి హసన్ బస్రీ (రహ్మాలై) దగ్గరికి ఒక యువకుడు వచ్చాడు. 'ఈ రోజు నుంచి నేను ఎలాంటి పనిచేయను, సంపాదించను' అని చెప్పాడు. హసన్ బస్రీ (రహ్మాలై) ఎందుకని అడిగారు. దానికా యువకుడు 'నేను ఈ రోజు అడవిలో ఒక వింత సంఘటన చూశాను. ఒక పులి ఒక జంతువుపై పంజా విసిరింది. తనకు కావాల్సింది తిన్నది. మిగతాది పర్వతంపై ఒక నడవలేని ఓ గుడ్డి తోడేలుకు అందించింది. అడవిలోని తోడేలు కడుపునింపే ఆ అల్లాహ్ నా ఆకలి తీర్చడా. అందుకే ఈ రోజు నుంచీ ఏ పని చేయను' అని వివరణ ఇచ్చాడు. హసన్ బస్రీ (రహ్మాలై) కలగజేసుకుని 'నీకు పులిగా మారాలని లేదా? తోడేలుగా మారాలనుకుంటున్నావా?' అని ఎదురు ప్రశ్నించారు. మజ్దూర్లు ఎప్పటికీ తోడేళ్లు కారు. కూలీ పనిచేసేవాళ్లు పులులు' అని ప్రశంసించారు హసన్ బస్రీ (రహ్మాలై). అందుకే కూలీలు తలఎత్తుకు తిరగాలి. ప్రవక్తలు, ఖలీఫాలు కూలీ పనులు చేసుకుని ఉపాధి పొందేవారు. ఖలీఫా అబూబకర్ (రజి) చక్రవర్తిగా తాను కూలీవాని కంటే ఎక్కువ జీతాన్ని తీసుకునే వారు కాదు. మన దగ్గర పనిచేసే వారికి మనం తిన్నదే ఆహారంగా ఇచ్చి గౌరవించాలని ప్రవక్త (స) ఉద్బోధ. కార్మికుల స్వేదాన్ని గౌరవించడం యజమాని బాధ్యత. వారి కష్టానికి తగిన వేతనం ఇవ్వడం ధార్మిక విధి.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076